సంపుటి: 28
సంచిక: 1

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 45 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

ఫిబ్రవరి, 1979

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

తొలిమాట

నమస్కారము. చాలామంది పాఠకుల కోర్కె మీదట 'హోమ్ డెలివరీ' సభ్యత్వ రుసుము రు. 5/-ల నుండి రు. 3/-లకు తగ్గించాము. ఇకమీదట కొత్తగా సభ్యత్వము తీసుకునేవారు రు. 3/-లు పంపితే చాలును. ఇది ఇప్పుడున్న సభ్యులకు వర్తించదు.

'హోమ్ డెలివరీ' ప్రారంభించి సుమారు 5 సంవత్సరాలు కావస్తున్నది. ఈ స్కీమ్ అనేకమంది పాఠకుల ప్రశంసలు పొందినది. వేలాది మంది ఈ స్కీమ్ వల్ల ప్రయోజనం పొందుతున్నారు. అయితే యిది ప్రారంభించిన దగ్గరనుండి ఇప్పటివరకు—వి.పి. తిరిగొచ్చిన కారణంగానైతేనేమి, మరో కారణంచేతనైతేనేమి, 1176 గురి సభ్యత్వం రద్దు చేయటం జరిగింది. అటువంటి వారికి ఒక అవకాశం ఇవ్వదలిచాము. అలా గతంలో సభ్యత్వము కోల్పోయిన వారు నామినల్‌గా రు. 1/- స్టాంపులు పంపి తిరిగి సభ్యత్వం పొందవచ్చును. యీ అవకాశం రెండు నెలలు మాత్రమే వుంటుంది.

ప్రకటించిన ప్రకారం ఈ నెల సప్లిమెంట్‌లో 'అంగారక' చివరిభాగము ప్రచురించాము. 'డిటెక్టివ్ ఫటాఫట్' వ్యంగ్య కార్టూన్ శీర్షిక యీ సంచికలో ప్రారంభమైంది. పాఠకులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. ఖైదీ నెం 77-ఎస్. గీతారాణి.
26. సరదాకొక అబద్ధం—వసుంధర.
44. అభిమాన రచయిత—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
64. హంతకుల ఆట—సుజనశ్రీ.
79. రక్తదర్పణం—అజీజ్.
98. అభాగిని—యస్. క్రిష్ణవేణి.
112. కథలు చెప్పకు!—ముళ్ళపూడి నాగేశ్వరరావు.
125. కావ్యాత్తి మరకలు!—వినయ్.
145. రెండు పొరపాట్లు—విద్వాన్ షీలాదేవి.
158. ప్రియా! ఓ ప్రియా—టి. వేణుగోపాల్.
178. అతీంద్రియశక్తులు (సీరియల్)—రమణశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. నీడలోని ఆడది—వసుంధర.
53. మదరిండియా—ముద్దా సురేష్.
118. నిర్జీవ నర్తకులు—అజీజ్.
180. అంగారక (చివరిభాగం)—శ్యాంబాబు
204. అడుగుముందుకు వేస్తే చస్తావ్ (సీరియల్—వసుంధర.

ఇవిగాక—క్రైమ్‌లోతమాషాలు, రచయితలతోముఖాముఖి, పాఠకుల ప్రశ్నలు, చెప్పుకోండి చూద్దాం, డిటెక్టివ్ ఫటాఫట్. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

ఖైదీ నెంబర్ 77

యస్. గీతారాణి

అది సెంట్రల్ జైల్.

ఒక్కొక్క సెల్‌లో నలుగురేసి ఖైదీలు వున్నారు. ఒక సెల్‌లో మాత్రం ఒకేఒక్క ఖైదీ వున్నాడు.

అతని చొక్కామీద నెంబర్ 77 వుంది. అతని వయసు ఇంచుమించు ముప్పై వుండొచ్చు. గెడ్డం బాగా పెరిగి

పోయింది. కళ్ళలో అశాంతి బాగా పేరుకుపోయింది. ముఖం కూడా లోతుకు పీక్కుపోయింది. ఆవేదనకి ప్రతినిధిలా, అశాంతికి ప్రతిరూపంలా వున్నాడతను.

సెంట్రీ భోజనం పెట్టి ఎంతసేపయిందోగాని, పెట్టినది పెట్టినట్లుగానే వుంది.

అతను దిమ్మమీద వాలిపోయి, బలవంతాన రెండుకళ్ళూ మూసుకున్నాడు. బయట కాపలాకాస్తున్న సెంట్రీల బూట్ల ధ్వనులు తప్పించి, మరే విధమైన ధ్వని వినరావటంలేదు.

అలా ఎంతసేపు గడిచిందోగాని, 'టంగ్' మని ఒకగంట కొట్టింది గడియారం. అతను ఆ గంట తన గుండెలోనే మ్రోగినంత ఖంగారుగా లేచి కూర్చున్నాడు.

ఆ గంట విన్నప్పుడల్లా అతని ముఖం వికృతంగా మారిపోతుంది. కళ్లు రెండూ రెండు అగ్నిగోళాలవుతాయి. దవడ ఎముక బిగుసుకొంటుంది. శరీరంలో రక్తమంతా గడ్డకట్టుకొన్నట్లయి, శరీరం గడకర్రలా బిగుసుకొంటుంది.

ఆ గంట అతని జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది.

సరిగ్గా ఆ గంటకే అతను జైలు పాలయ్యాడు.

అదే గంటకు అతను వురితియ్యబడతాడు కూడా.

అందుకే అతనికా గంటంటే భయం, ఆవేశం, కసి!

ఆ గంటకొట్టే వేళలో అతనుగాని గడియారం దగ్గరుంటే, ఆ గడియారాన్ని ముక్కలు ముక్కలు చేసేవాడు. కానీ నాలుగు గోడలమధ్య, ఇనుపవూచల వెనుక బందీ అయివున్నాడు.

అతని పిడికిళ్ళు బిగుసుకొన్నాయి "జయరామ్!" ఆ పేరును పైకే ఆవేశంగా వుచ్ఛరించాడతను.

అదే క్షణాన "ఈశ్వర్!" అని పిలిచారెవరో నెమ్మదిగా.

తృప్తిపడ్డాడు ఈశ్వర్.

లేచి నిలుచొని, కటకటాల దగ్గరకి వచ్చి చూసాడు.

తెల్లటి జైలుబట్టల్లో ఖాసీమ్ నిలిచివున్నాడు.

"భయ్యా! ఇంత రాత్రివేళా....నువ్...." ఈశ్వర్ గొంతు తారస్థాయిని పోబోతుంటే, ఖాసీమ్ తన చేత్తో అతని నోటిని అదిమిపట్టి, "పద, పారిపోదాం" అన్నాడు.

"నేనా!" అతను అయోమయంగా చూసాడు.

అదేక్షణాన జైల్లో సైరన్ మ్రోగింది. బూట్లధ్వనులు విజిల్స్ ఒకదాని వెనుక ఒకటి తరుముకొచ్చాయి.

ఖాసీమ్ ఆలస్యం చెయ్యకుండా ఈశ్వర్ సెల్‌తాళం తెరిచి, అతని చెయ్యి పట్టుకొని బయటకి లాగాడు.

బయట సెల్‌ప్రక్కనే రక్తపుమడుగులో పడివున్న సెంట్రీని చూడగానే, అతన్ని చంపి తన్ని రక్షించాడని గ్రహించాడు ఈశ్వర్.

ఖాసీమ్ క్రిందకు వంగి, సెంట్రీ ప్రక్కనున్న తుపాకీ అందుకొని ఈశ్వర్ చేతికి యిచ్చి, ముందుకు పరిగెట్టాడు.

అంతలో నలుగురు సెంట్రీలు ఎదురయ్యారు.

ఇద్దరి చేతుల్లోవున్న తుపాకీలు సెకండ్లలో వాళ్ళని కాల్చిపారేసాయి.

ఆ నలుగురు వేసే చావుకేకలకి ఎటో వెళ్తున్న బూట్ల ధ్వనులు, కేకలు వచ్చిన దిశకు మళ్లాయి.

ఇద్దరూ జైలుగోడ దగ్గరకి వచ్చారు.

ఖాసీమ్ మధ్యవేలు, బ్రొటనవేలు నోటిలోపెట్టి గట్టిగా విజిల్ వేసాడు. అతను అలా విజిల్ వేసిన వెంటనే బయటనుంచి ఒక తాడు లోపలకి వచ్చి పడింది.

"ఈశ్వర్! తొందరగా పైకెక్కు" ఖాసీమ్ గబగబా అరిచాడు.

వెనక బూట్లధ్వనులు దగ్గరవుతున్నాయి.

ఈశ్వర్ తాడు పట్టుకొని, పాములా జరజరా పైకి ఎక్కి, అవతలకి గెంతాడు.

దూరంగా నల్లటి డాడ్జికారు ఒకటి ఆగివుంది. స్టీరింగ్ ముందు ఓవ్యక్తి కూర్చొనివున్నాడు. అతను ఈశ్వర్‌ని చూడగానే ఎంతో పరిచయమున్నవాడిలా తన చేతిని వూపి, రమ్మన్నాడు.

ఈశ్వర్, ఖాసీమ్ కోసం ఎదురుచూస్తున్నాడు.

ఖాసీమ్, తాడు పట్టుకొని, పైకి యెక్కుతుండగానే జైలర్ తదితరులంతా వచ్చారక్కడికి. గోడ గెంత బోతుండగా ఆతన్ని కాల్చేసాడు జైలర్. దబ్బున ఇవతలకి పడ్డాడు ఖాసీమ్.

ఈశ్వర్‌కి మతిపోయినట్లయింది, అతన్ని పొదివి పట్టుకొని "భయ్యా! యెంత ఘోరం జరిగిపోయింది" అంటూ ఏడ్చేసాడు.

కారులో కూర్చున్న వ్యక్తి, కారుదిగి ఖాసీమ్ దగ్గరకి పరుగున వచ్చాడు.

ఖాసీమ్ వాలిపోతున్న కళ్ళను బలవంతంమీద పైకి లేపాడు.

"ఈశ్వర్! ఇతను నా అన్నయ్య. నీ కథ అంతా చెప్పాను అతనికి. నీకే సహాయం కావాలన్నా చేస్తాడు. పారిపో!" తడారిపోతున్న పెదాల్ని నాలుకతో తడుపు కొంటూ అన్నాడు.

"భయ్యా! నిన్ను ఇలా వదిలేసి, నా దారి నన్ను చూసుకోమంటావా!" అతని గొంతు పూడుకుపోయింది.

"ప్లీజ్! పారిపో, ఈ గుండెలో వూపిరి అట్టేసేపుండదు. క్షణంలో చచ్చే నా కోసం నువ్వు దొరికిపోయి, నీతో

పాటే నీ పగా, ప్రతీకారాన్ని చంపుకోకు. నీలో యువక రక్తమే ప్రవహిస్తుంటే, నిన్ను అకాల మృత్యుపాలు చేసిన.... ఆ.... జయ...." ఖాసీమ్ తన మాటల్ని మరి పూర్తిచెయ్యలేక తల వాల్చేశాడు. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఈశ్వర్, ఖాసీమ్‌అన్న, ఖాసీమ్ శవాన్ని కారులోకి చేర్చారు.

జైలర్ సెంట్రీస్ బయటకొచ్చారు.

ఈశ్వర్ డ్రైవింగ్‌సీట్లో కూర్చుని కార్ను ముందుకు దూకించాడు.

2

హోటల్ నియోమలబార్ ముందొక డాడ్జికారు ఆగింది. కారులోంచి ఓ పంజాబీ యువకుడు క్రిందకు దిగి, హుందాగా హోటల్ లోపలకి ప్రవేశించాడు.

కుర్చీలో కూర్చొని చప్పట్లుచరచి సర్వర్‌ని పిలిచాడు.

సర్వర్ పరుగున అతని దగ్గరకి వచ్చి "ఏం కావాలి సార్!" అని అడిగాడు.

"బాదంగీర్ తీసుకురా!"

సర్వర్ లోపలకెళ్లి బాదంగీర్ తెచ్చాడు.

పంజాబీ యువకుడు బాదంగీర్ త్రాగుతూ, కూలింగ్ గ్లాసెస్‌లోంచి, తన ఎదురుగావున్న వ్యక్తుల్ని పరీక్షగా చూసి, తల ప్రక్కకి తిప్పాడు.

అతనికి ప్రక్కవరుసలో ఓ యువకుడు కూర్చొని పేపర్ చూస్తున్నాడు. అతడే జయరామ్.

పంజాబీ యువకుడు బాదంగీర్ తాగేసి, సర్వర్‌ని బ్రూ



కాఫీ తెమ్మనిచెప్పి, అతనిదగ్గరకెళ్లి "ఓసారి పేపరిస్తారా!" అని అడిగాడు.

"వై నాట్!" అతను నవ్వుతూ పేపర్ అందించాడు.

ఆ యువకుని చూపులు వెనుక పేజీమీదకు మళ్లాయి.

ఆ పేజీలో అందమైన యువకుని ఫోటోవుంది. దాని క్రింద ఇలా వ్రాసివుంది:

"యస్.ఐ. సుదర్శనం కుమార్తె జయంతిని మానభంగం గావించి ఆమెని హత్యచేసిన ఈ యువకుడు ఈశ్వర్‌కి కోర్టు మరణశిక్ష విధించింది. కాని అతను పన్నెండవ తారీఖున రాత్రి ఒంటిగంటకు తోటి ఖైదీ ఖాసిమ్‌తో పారిపోయాడు.

జైలుగోడకు వ్రేలాడుతున్న తాడుసహాయంతో ముందు ఈశ్వర్ తప్పించుకొన్నాడు. అతని వెనుక ఖాసిమ్ తప్పించుకోబోతుంటే జైలర్ తప్పనిస్థితిలో అతన్ని కాల్చి చంపాడు. ఈశ్వర్ బయట వున్న కారులో ఎక్కి పారి

పోయాడట. పోలీస్‌జీప్ ఆ కారుని ఫాలోచేసినా అతన్ని పట్టుకోలేకపోయారట.

కారులో ఈశ్వర్ ప్రక్కన మరోవ్యక్తి వున్నాడట. బహుశా అతనే ఈశ్వర్, ఖాసిమ్ తప్పించుకొనేందుకు తాడు విసిరివుండొచ్చంటున్నారు పోలీసులు. ఈశ్వర్‌ని పట్టి అప్పగించినవారికి ప్రభుత్వం పదివేలరూపాయల బహుమతిని ప్రకటించింది."

ఆ పంజాబి యువకుడు చదవటం పూర్తిచేసి, పేపర్ ఇచ్చేసి తిరిగి కుర్చీలో కూర్చున్నాడు.

జయరామ్ బిల్ చెల్లించి బయటపడ్డాడు.

సర్వర్ బ్రూకాఫీ తెస్తే పంజాబీ యువకుడు వద్దనేసి, బిల్ చెల్లించి, జయరామ్‌ని అనుసరించాడు.

జయరామ్ ఓ వారగా ఆపివున్న స్కూటర్ యెక్కి స్టార్ట్ చేసాడు.

పంజాబి యువకుడు డాడ్జి కారెక్కి, ఆ స్కూటర్ వెనుకే పోనిచ్చాడు.

జయరామ్ మొదట ఆ కారు తన వెనుకే వస్తోందనుకొన్నాడు. కాని అది తను ఏ స్ట్రీట్‌మారితే ఆ స్ట్రీట్‌లోకి దూరటంతో అతనిలో అనుమానపు బీజం మొలకెత్తింది. తన అనుమానం దృఢపరచుకొందుకని మరో రెండు వీధులు వ్యర్థంగా తిరిగాడు. వెనుక కారుకూడా ఆ రెండువీధులు తిరిగింది.

అతని అనుమానం నిజమయింది.

తననెవరో ఫాలోచేస్తున్నారనుకొన్నాడు. ఎవరావ్యక్తి! పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి చెందినవ్యక్తా! వాళ్ళు ఫాలో చేసేందుకవకాశ మిచ్చేటంతటి తెలివితక్కువ పని ఏనాడూ చెయ్యడు తను. మరైతే తనని ఫాలో చేస్తున్న మని

షెవరు?

అతని ఆలోచన ఓ రూపం దాల్చకముందే ఆ కారు స్కూటర్‌ని ఓవర్‌టేక్ చేసింది. సర్రున ముందుకెళ్ళి, నేర్పుగా చక్రాలు పక్కకి తిరిగాయి. స్కూటర్‌కి ఎదు రొచ్చింది.

జయరామ్ తన స్కూటర్‌కి బ్రేక్‌కొట్టాడు. బింకంగా స్కూటర్ దిగాడు.

అటు పంజాబి యువకుడు కారు దిగాడు.

"నా దారి కెందు కడ్డొచ్చావ్?" రోషంగా అడిగాడు జయరామ్.

"నా జీవితాన్ని తగలబెట్టినందుకు"

"నేనా!" పెళ్ళున నవ్వాడు జయరామ్.

"నేనేం యముణ్ని కానే!" తన మాటలకు తనే పెద్దగా నవ్వాడు.

"నా పాలిట యముడివైనావు!"

చిరాగ్గా చూసాడతను "అసలు నువ్వెవరు?"

"నా పేరు వినాలని నీకంత ఆతృతగా వుందా! అయితే విను. నా పేరు ఈశ్వర్" అతను చిన్నగా నవ్వాడు.

జయరామ్ తనచేతిని చురుగ్గా ప్యాంట్‌జేబులోకి పోనివ్వ బోతుంటే, ఈశ్వర్ అంతకన్నా చురుగ్గా రివాల్వర్ తీసి, అతనికి గురిపెట్టి "హేండ్సప్" అన్నాడు.

తప్పనిసరిగా చేతులెత్తాడు.

ఈశ్వర్ వేలు ట్రిగ్గర్‌మీద బిగుసుకొనేసరికి అతని కళ్ళలోకి మృత్యుభీతి జరజరా పాకింది.

"జయరామ్! సంఘం దృష్టిలో నేనో రాక్షసుణ్ని. చట్టం దృష్టిలో హంతకుణ్ని. కోర్టు నాకు మరణశిక్ష విధించింది. పైగా చట్టాన్ని అతిక్రమించి జైలునుంచి

పారిపోయాను. ఇప్పుడు నిన్ను ఇక్కడ చంపి, నీ శవాన్ని రోడ్డుకడ్డంగా పడేసిపోయినా నాకెలాంటి ఇబ్బందిఉండదు. అవునా!" ఈశ్వర్ మందహాసం చేసాడు.

జయరామ్ ముఖంలో ఆందోళన బయలుదేరింది. నిర్జనంగా వున్న ఆ రోడ్డుమీద తనకెవరి సహాయం లభించదని తెలుసతనికి.

ఈశ్వర్ అతని దగ్గరగా వచ్చాడు.

"జయరామ్! నిన్ను చంపే అవసరం న్యాయంగా నా రివాల్వర్‌కి లేదు. కాని నువ్వు మొండితనం ప్రదర్శిస్తే నా రివాల్వర్‌కి పిచ్చికోపం వస్తుంది. దానికి కోపంవస్తే నీ పచ్చినెత్తురు బయటపడుతుంది. కాబట్టి బుద్ధిమంతుడిలా నా ప్రశ్నలకి సమాధానాలిచ్చెయ్. నిన్ను వదిలేస్తాను" అన్నాడు.

అతనిమాటలతో జయరామ్ భయం కొంత తగ్గింది. అతను అడిగినవాటికి బదులిస్తే తనదారిన తను పోవచ్చును కొన్నాడు.

"అడుగు" అన్నాడు.

"అక్టోబర్ ఇరవైరెండవ తారీకున రాత్రి పన్నెండున్నర, ఒంటిగంటకి మధ్యప్రాంతంలో జయంతి శీలాన్ని దోచుకొని, ఆమెని చంపిన ఐదుగురిలో నువ్వు ముఖ్యుడివి. అవునా!"

అవునన్నట్లు తల ఆడించాడు.

"జయంతిని చంపమని పంపించినది ఎవరు?"

"ఆ వ్యక్తిపేరు నాకు తెలియదు."

"పోనీ మనిషి తెలుసా?"

"ఐ డోంట్ నో"

ఈశ్వర్ ముఖం యెర్రబడింది. "యూ బాస్టర్డ్!"

అంటూ పిడికిలి బిగించి, అతని ముక్కుమీద గుద్దాడు.

ముక్కులోంచి గిద్దెడు రక్తం బయటకొచ్చింది. అతను బాధగా ముక్కు పట్టుకొన్నాడు.

"నిజం చెప్తావా? ఇలాంటిదే మరొకటి కావాలా?" ఈశ్వర్ ప్రళయకాలరుద్రునిలా చూసాడు.

"మిస్టర్ ఈశ్వర్! నన్ను నమ్ము. అతన్ని గురించి నాకు ఏం తెలియదు" ఈశ్వర్ మరోసారి పిడికిలి బిగించి ఎత్తబోతుంటే, రెండు చేతులూ అడ్డుపెట్టి, "అతన్ని గురించి ఒక్కటిమాత్రం చెప్పగలను" అన్నాడు.

చెయ్యి క్రిందకి దించి "ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"జయంతిని చంపమని పురమాయించినవ్యక్తి స్వరూప ఇంటికి ప్రతి ఆదివారం రాత్రి పదకొండు తరవాత వస్తుంటాడు."

"ఎవరా స్వరూప?"

"ఈ వూరిలో పేరుబడ్డ వ్యభిచారిణి"

"ఎడ్రస్!"

జయరామ్ ముక్కులో రక్తాన్ని తుడుచుకొంటూ స్వరూప ఎడ్రస్ చెప్పాడు.

"జయరామ్! ఇంకొక్కప్రశ్న నన్ను వేధిస్తోంది. ఆ రోజు అంటే అక్టోబర్ ఇరవై రెండున నేను, జయంతి పిక్చర్‌నుండి తిరిగివస్తుండగా దారికడ్డుగా ఓ మనిషి పడి వుంటే నేను కారాపవలసి వచ్చింది.

కారుదిగి, అతని దగ్గరకి వెళ్ళేసరికి నువ్వు, మరో ముగ్గురు మీదపడ్డారు. క్రిందపడివున్న వాడు వికటంగా నవ్వుతూ లేచినిలుచున్నాడు. మీ ప్రతి ఒక్కరి చేతుల్లో ఆయుధం నన్ను అసమర్థుడిగా నిలబెట్టాయి. నీ మనుషులిద్దరు నా పెడరెక్కలు విరిచి చెట్టుకు కట్టారు.

మీరంతా నాకళ్ళ ఎదురుగా జయంతి శీలాన్ని దోచుకుని, ఆమెను చంపి పోయారు. మీరు అలా వెళ్ళగానే మరో నలుగురు వ్యక్తులు వచ్చారు. నన్ను చూసారు. జయంతి శవాన్ని చూసారు. వాళ్ళలో వాళ్ళేదో చర్చించుకొని, ఆఖరికి ఒకడు ఎటోవెళ్ళి కొద్దిసేపటికి తిరిగివచ్చి, మిగతా వాళ్ళకి ఏమిటో చెప్పాడు.

ఒకనాడు నా దగ్గరగావచ్చి, మత్తురుమాలు వాసన చూపించాడు. స్పృహపోయింది నాకు. తిరిగి తెలివివచ్చేసరికి టైమ్ ఒంటిగంట అయింది. అప్పుడే దూరాన పోలీస్ హారన్ విన్పించింది.

నేరం చెయ్యకపోయినా, భయపడి జయంతి శవాన్ని కారులో వేసుకొని, కారుని పోనిచ్చాను. కాని దురదృష్టం పోలీస్ జీపే నా కెదురొచ్చింది.

అంతే! కటకటాల వెనకపడ్డాను. ఎస్. ఐ. కూతుర్ని భంగపరచి హత్య చేసానంది కోర్టు. కత్తిపిడి మీద, రివాల్వర్ మీద వేలిముద్రలు నావే కాబట్టి, నేనే హంతకుడి

నన్నారంతా. నా జేబులోకి రివాల్వర్ యెలా వెళ్ళిందో, కత్తిపిడి మీద వేలిముద్రలెలా వచ్చాయో నా కర్థంకాలేదు. అవి అర్థం చేసుకునేందుకే జైలునుంచి పారిపోయాను," ఈశ్వర్ వూపిరి పీల్చుకున్నాడు.

"జయరామ్! ఆ వ్యక్తి, అదే ఆ రెండవముఠాలో నాయకుడి పేరు తెలుసా?"

"విలియమ్! అతని అనుచరులు మిగతా వాళ్లు."

ఈశ్వర్ భృకుటి ముడిచిచూస్తూ, "నీకు స్పష్టంగా తెలుసా! తప్పించుకొందు కెత్తా!" అన్నాడు.

"ప్రామిస్‌చేసి చెబుతున్నాను. విలియమ్ అప్పుడు ఫుల్ బ్లాక్‌డ్రస్ వేసాడవునా! జయంతిని చంపి పారిపోతూ వుండగా అతన్ని చూసాను. వాళ్ళేం చేస్తారో అని వారగా నక్కి వాళ్ళ చర్యల్ని గమనించానుకూడా.

మేముచేసిన హత్య ఎందుకోగాని నీపై రుద్దాలని నీకు తెలివి తెప్పించి, నీ వేలుముద్రలు కత్తిమీద తీసారు. రివాల్వర్ నీ జేబులో పెట్టారు. నీకు తెలివి తెప్పించి, పారిపోయారంతా" జయరామ్ చెప్పటం ఆపి, ఈశ్వర్ ముఖంలోకి చూసాడు.

"విలియమ్ ఎడ్రస్." జయరామ్ అతని అడ్రస్ చెప్పాడు.

జయరామ్ గాఢశ్వాస వదిలిపెట్టి, స్కూటర్‌కి ఓ కిక్ ఇచ్చి ఎక్కాడు. బర్‌మని ముందుకు కదిలింది.

అదే క్షణాన ఈశ్వర్ రివల్వార్ తీసి, పేల్చాడు.

జయరామ్ కిక్కురు మనకుండా స్కూటర్‌మీంచికిందికి జారిపోయాడు. స్కూటర్ కిర్ర్....కిర్ర్ మంటూ అటూ, ఇటూ తిరిగి ఓ ప్రక్కకి ఒరిగిపోయింది.

"అయామ్ సారీ జయరామ్! నన్ను అర్థాయుష్కుణ్ని

చేసినందుకు కారకులయిన ఏ వ్యక్తుల్ని బతకనివ్వను,"
ఈశ్వర్ చిన్నగా నిట్టూర్చాడు.

3

ఈశ్వర్ కారుని ఆ ఇంటి ముందాపాడు.

కారుదిగి మునివేళ్ళతో తలుపు తట్టాడు.

మూడునిముషాల తరువాత విలియమ్ తలుపుతీసాడు.

"మే ఐ కమిన్" ఈశ్వర్‌గొంతు మృదువుగా ధ్వనించింది.

మారు వేషంలోవున్న ఈశ్వర్‌ని పోల్చుకోలేని విలియమ్ అతను ఏదోపనిమీద వచ్చివుంటాడనుకొని, అతన్ని లోపలికి ఆహ్వానించి, తలుపులు మూసేసాడు.

"మీపేరు?" ప్రశ్నించాడు విలియమ్.

"ఈశ్వర్!" తమాషాగా నవ్వాడతను.

విలియమ్ ముఖం కత్తివాటుకు నెత్తురు చుక్కలేనంత తెల్లగా పాలిపోయింది. గాబరాగా అడుగు వెయ్యబోతూ వుంటే, ఈశ్వర్ రివాల్వర్‌తీసి, అతనికి గురిపెట్టాడు.

"విలియమ్! కదిలితే కాల్చి పారేస్తాను" కఠినంగా అన్నాడు.

"ఈశ్వర్! నీకు నేనేం అపకారం చేయలేదు. నేను కిరాయి రౌడీని. ఎవరు ఎవర్ని చంపమంటే వాళ్ళను చంపటం నావృత్తి." విలియమ్ భయంగా అన్నాడు.

"అందుకే విలియమ్ నిన్ను చంపాలనుకోవటం లేదు. అయితే నా ప్రశ్నలకు బుద్ధిగా బదులిస్తే నిన్ను వదలిపెడతాను."

"ఏమిటా ప్రశ్నలు!"

"జయంతిని నేనే చంపినట్లు నిరూపించమని నిన్ను



నియమించిందెవరు?"

"ఆ వ్యక్తి నాకు తెలియదు. అతనింటి ఫోన్‌నెంబరు తెలుసు. ఫోన్‌ద్వారా నిన్ను చంపమని కావాల్సినంత డబ్బు ఇస్తానని అన్నాడు. ఓ మనిషిద్వారా నీ ఫోటో పంపించి, నువ్ ఏ సినిమాకెళ్తున్నావో చెప్పేడు. నేను నా మనుషులు హాలుదగ్గర కాపు కాసాం. నువ్వు ఒక అమ్మాయితో కారెక్కావు. నిన్ను ఫాలోచేసాం మేము. అనుకోకుండా మాకారు ట్రబులిచ్చింది. మేం ఆగిపోవాల్సి వచ్చింది. మళ్ళీ రిపేర్ చేసుకొని వచ్చేసరికి, జయరామ్ అతని మనుషులు చేస్తున్న ఘోరం చూసాం. అంతా ఆలోచించాం. నిన్ను చంపమన్న వ్యక్తితో జరిగింది చెప్పాం.

ఆయన నిన్ను చంపొద్దని, తెలివి తప్పించి, కట్లు విప్పేసి, హత్య నువ్వే చేసినట్లు నిరూపించి, వదిలెయ్యమన్నాడు.

అలాగే పోలీస్ రిపోర్టిచ్చాం. అదీ ఎలాగంటే మాలో ఒకడు రిపోర్టిచ్చాడు. వో యువకుడు, వో యువతిని కిడ్నాప్ చేసాడని, ఆమె కారులో అతనితో పెనుగులాడు తుండగా తను చూసానని చెప్పి, కారు మీరు పడివున్న స్ట్రీట్ వైపు వెళ్ళిందని చెప్పాడు.

పోలీస్ జీప్ అటువచ్చే వేళకి నీకు తెలివి తెప్పించి పారిపోయాం," విలియమ్ చెప్పటం ఆపాడు.

"విలియమ్! నన్ను చంపమన్న వ్యక్తి ఫోన్ నెంబరు చెప్పు చాలు. నా దారిన నేను పోతాను."

"ఆరు, నాలుగు, రెండు, మూడు."

ఈశ్వర్ షాక్ తిన్నాడు. ఆ ఫోన్ నెంబరు ఎస్. ఐ. సుదర్శనంది. తనని చంపటానికి వీళ్ళని నియమించింది జయంతి తండ్రా?

"థేంక్యూ విలియమ్!" ఈశ్వర్ చెయ్యి ట్రిగ్గర్‌మీద బిగుసుకుంది.

"ఈశ్వర్! నన్ను విడిచిపెట్టేయ్!" దైన్యంగా అరిచాడతను.

"సారీ విలియమ్! మీలాంటివాళ్ళని బ్రతికించి మరో ఖైదీని సృష్టించలేను" ఈశ్వర్ ట్రిగ్గర్ నొక్కాడు.

విలియమ్ చావుకేకపెట్టి, వెనక్కి విరుచుకు పడిపోయాడు.

4

స్వరూప ఆ వ్యక్తిని పరీక్షగా చూసింది.

పంజాబీస్‌లో అందగాళ్ళుంటారని వినిదిగాని, మరీ ఇంత అందగాణ్ని ఏనాడూ చూళ్లేదామె. ఇదే మరోరోజు వస్తే అతన్ని వదిలిపెట్టేది కాదు. ఈరోజు వస్తున్నది

ప్రముఖ వ్యక్తాయె.

ఈశ్వర్ మందహాసం చేస్తూ, లోపలికి అడుగుపెట్ట బోయాడు. స్వరూప తనచేతిని అడ్డుపెట్టంది.

"రేపు రండి. ఈరోజు ఓ ప్రముఖవ్యక్తి వస్తున్నారు" అని అంది మృదువుగా.

ఈశ్వర్‌కళ్ళు ఎరుపెక్కాయి. జేబులోంచి రివాల్వర్ తీసి, ఆమె గుండెలకి గురిపెట్టి, "ఇప్పుడు రావచ్చా?" అడి అడిగాడు వ్యంగ్యంగా.

స్వరూప గుండెలు దడదడ లాడాయి. భయంగా అత నికి దారి వదిలింది.

అతను రివాల్వర్ వూపుతూ, "కమాన్! నువ్వు కొంత సేపు నా అతిధివి" అంటు ఓ గదిముందుకు తీసికెళ్ళాడు.

స్వరూప అప్రతిభురాలై అతని చర్యలని గమనిస్తుంది పోయింది.

అతను తలుపు గడియతీసి, ఆమెని లోపలికి నెట్టి, తలుపుల్ని మూసేసాడు.

"మిస్టర్! ఏమిటీ దౌర్జన్యం! ఎవరు నువ్!" స్వరూప తలుపుల్ని దబదబ బాదింది.

"అయామ్ ఈశ్వర్!" ఆ పేరు వినగానే లోపలనుంచి ఎలాటి శబ్దం రాలేదు.

అదే సమయంలో "స్వరూపా!" అని పిలిచారెవరో.

ఈశ్వర్ గబగబా హాలులోకి వచ్చి, ఆ వ్యక్తిని చూసి, తల గిర్రున తిరిగినట్లయింది. అతను తన తండ్రి! జయంతిని చంపించింది తన తండ్రా?

శ్యామ్రావ్ కొడుకుని చూసి గతుక్కుమన్నాడు. అతని మెదడులో ముందురోజు పేపర్‌లో చదివిన సంఘటనలు మెదిలాయి.

రెండు రోజుల క్రిందట జయరామ్ అనే వ్యక్తి శవం బ్రిడ్జికవతల ప్రాంతంలో దొరికింది. అతను స్కూటర్ మీంచి వెళ్తుండగా కాల్చి చంపారు. అతన్ని చంపింది జైలునుండి పారిపోయిన ఈశ్వర్ అని అనుమానిస్తున్నారు పోలీసులు. ఎందుకంటే జయరామ్ శవానికి పన్నెండడుగుల దూరంలో తెల్లటి రుమాలు పడివుంది. ఆ రుమాలుమీది వేలుముద్రలు ఈశ్వర్‌వే అంటున్నాడట పోలీస్ ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్.

అంతేకాదు, అదేరాత్రి తాంబ్రం స్ట్రీట్‌లో పదహారవ నెంబర్ ఇంట్లో వుంటున్న విలియమ్‌కూడా హత్యగావించబడ్డాడు. అతని గుండెల్లో దొరికిన బుల్లెట్, జయరామ్ వెన్నులో దొరికిన బుల్లెట్ ఒక రివాల్వర్ లోనివేనట.

"నాన్నా! నువ్వా జయంతిని చంపించింది!" ఈశ్వర్ మాటలకు త్రుళ్లిపడ్డాడు శ్యామ్రావ్.

"ఆ జయరామ్‌గాడేనా చెప్పాడు?"

"అవును. జయంతిని ఎందుకు చంపించావు! ఆ అమాయకురాలు నీకేం హానిచేసింది!"

"అది చెయ్యలేదు. దాని తండ్రి చేసాడు."

"మామయ్యా!" ఆశ్చర్యంగా అడిగాడు ఈశ్వర్.

"అవును. ఆ దుర్మార్గుడే. వాడిని, వాడి పరువుని, వాడి చెల్లెలి జీవితాన్ని కాపాడినందుకు ప్రతిఫలంగా నన్ను జైలుకి పంపాడు."

"నిన్నా!"

"సుదర్శనం, నేను ప్రాణస్నేహితులం. మీ అమ్మ కాలేజీలో చదువుతూ ఒకడితో ప్రేమాయణం సాగించి, వాడికి ఓ బిడ్డ తల్లి అయింది. అది కడుపుతో వుందని తెలిసి వాడు వుడాయించాడు. సుదర్శనం తన పరువు

గంగలో కలిసిందని ఆత్మహత్య చేసుకొంటానంటే, వాడి మీద అభిమానంతో వాడి చెల్లెల్ని పెళ్ళాడాను.

తర్వాత నువ్వు పుట్టావు. నీ తరువాత సంతానం కలగ లేదు మాకు. నాకు పుట్టిన వాడివి కాకపోయినా, అభిమా నంగా చూసాను. నీ పదో ఏట సుదర్శనం, నేను స్మగుల్డ్ వ్యాపారం చేస్తున్నందుకు నన్ను పోలీసులకి అప్పగించాడు. నేను నాలుగేళ్ళు జైల్లో వున్నాను.

వాడిమీద పగా, ద్వేషం లోలో దాచుకొన్నాను. సమయం వస్తే వాడిని కటెయ్యాలని చూస్తున్నాను.

మన రెండు కుటుంబాల శత్రుత్వం తెలిసికూడా నువ్వు, జయంతి ప్రేమలో పడ్డారు. అది సహించలేకపోయాను. దాన్ని పెళ్ళాడటానికి వీల్లేదన్నాను. నువ్వు దాన్నే పెళ్ళా డుతా నన్నావ్. అప్పుడే నా పగ పడగలెత్తింది.

ఆ రోజు అక్టోబర్ ఇరవై రెండవ తారీకున వుదయం పెరుమాళ్ స్ట్రీట్ దగ్గరున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ దగ్గర కన్పించింది జయంతి. ఏం మాట్లాడుతుందో అని పొంచి విన్నాను. ఎవరినో సెకెండ్ షోకి రమ్మని ఆహ్వానిస్తున్నది.

అప్పుడే నా ప్లాను అమలుజరిపాను. నా పగ తీర్చు కొనేందుకు జయంతిని చంపాలనుకొన్నాను. వాడి ముద్దుల కూతురు శీలంచెడి, చచ్చిందంటే యస్.ఐ. సుదర్శనం కుమిలి చస్తాడు. జయరామ్‌కి డబ్బు ఇచ్చి దాన్ని చంపెయ్యమన్నాను.

కానైతే జయంతితో సినిమా కెళ్ళింది నువ్వేనని నీకు శిక్షపడ్డాక తెలిసింది. నీ గురించి ఏడ్చేందుకు మీ అమ్మ లేదు. నేను ఏడావటానికి నువ్వు నా కొడుకువికావు. అందుకే మౌనంగా వుండిపోయాను.''

ఈశ్వర్ ముఖం జేవురించింది.

"మైడియర్ శ్యామ్రావ్! నువ్వొక మేక వన్నెపులివని ఇప్పుడే తెలిసింది. ఆయనమీద కపితో జయంతి జీవితాన్ని బూడిదపాలు చేశావు. నన్ను....నన్ను జైలుపాలు చేశావు. నీలాంటి చీడపురుగులు వున్నంతకాలం దేశం బాగుపడదు. విదేశాలతో దొంగవ్యాపారం సాగించే నువ్వు సంఘం దృష్టిలో ఘరానా వ్యక్తిగా చెలామణి అవుతున్నావ్. చట్టం దృష్టికి దొరకని నువ్వు నా దృష్టిలో పడ్డావు. నిన్ను వదలి పెట్టను."

అతను అలా తిరుగుబాటుని ప్రదర్శిస్తాడని వూహించని శ్యామ్రావ్ ఖంగు తిన్నాడు.

"ఈశ్వర్! నేను నీ తండ్రిని" పిడచగట్టుకు పోయిన గొంతుతో అన్నాడు.

ఫకాల్న నవ్వాడు ఈశ్వర్.

"నేను కోర్టుముందు ముద్దాయిగా నిలుచున్నపుడు నిజాన్ని చెప్పి నన్నెందుకు రక్షించలేకపోయావు! ఒక అబద్ధం చాటున ఓ నిజం వురితియ్యబడుతుంటే చూస్తూ వూరుకొన్నపుడు ఈ వరసలు ఎక్కడకి పోయాయి?

నీలాంటివాళ్ళు అన్యాయానికి హారతులు పడుతుంటే న్యాయానికి సంకెళ్ళు పడ్తున్నాయి. ఒక అక్రమం చాటున ఓ అమాయకపు ప్రాణం శాశ్వత నిద్దరపోతోంది. ఒక తండ్రిమీద పగ ఇద్దర్ని బలి తీసుకొంది...." ఈశ్వర్ ట్రిగ్గర్ నొక్కాడు.

శ్యామ్రావ్ 'చావుకేక' వేసి నేల కొరిగిపోయాడు.

అంతట్లో బయట పోలీస్‌జీప్ ఆగిన శబ్దమయింది.

ఖంగారు పడ్డాడతను. తనెంత ఫూల్! ఫోన్‌వున్న గదిలో స్వరూపని బంధించి వుంటాడు. పోలీస్ రిపోర్టిచ్చింది. ఇప్పుడెలా? తన శత్రువు మరొక్కడు మిగిలి

పోయాడే?

ఈశ్వర్ టేబిల్‌మీదున్న ఫ్లవర్ వాజ్ తీసి, గాజు కిటికీని బద్దలుకొట్టి, బయటకి వురికి కారు దగ్గరకి వచ్చాడు.

పోలీసులంతా లోపలికెళ్ళారేమో, జీప్ ఖాళీగావుంది.

ఈశ్వర్ తన కారెక్కి స్టార్ట్‌చేసాడు. కారుశబ్దం వినగానే ఇనస్పెక్టర్, పోలీసులు బయటికి వచ్చారు.

"పారిపోతున్నాడు. త్వరగా పదండి" ఇన్‌స్పెక్టర్ జీప్ ఎక్కాడు.

5

పెద్దబంగళా ముందు కారాపి, కారు దిగాడు ఈశ్వర్.

వెనకాతల జీప్ వస్తున్న శబ్దం దగ్గర్లో విన్పిస్తోంది.

అతను గబగబా లోపలకెళ్ళి, కాలింగ్ బజర్ నొక్కాడు.

రెండు నిముషాల తరువాత తలుపు తీసాడు ఎస్.ఐ. సుదర్శనం.

ఈశ్వర్ చురుగ్గా లోపలికి వచ్చి, తలుపు మూసాడు.

"ఎవరు నువ్వు! ఇంత రాత్రివేళ వచ్చి నా నిద్దరెందుకు పాడు చేసావు."

"నేనా! ఈశ్వర్‌ని. నిన్ను శాశ్వత నిద్దర పుచ్చుదామని వచ్చాను."

సుదర్శనం చెయ్యి, టేబిల్ దాగ్గరకి పోబోయింది.

ఈశ్వర్ రివాల్వర్ తీసి, "యస్. ఐ. పిచ్చివేషా లెయ్యక" అన్నాడు.

బయట 'బర్'మని పోలీస్‌జీప్ ఆగింది. ఇన్‌స్పెక్టర్ దబదబా తలుపులు బాదాడు. ఓ పోలీస్ విజిల్ వూదాడు.

సుదర్శనం ముఖం వెలిగిపోయింది.

"ఈశ్వర్! పోలీసులు వచ్చారు" అన్నాడు గర్వంగా.

"వాళ్లు నా వెపకాలే వచ్చారుగాని, నన్నెందుకు చంపాలని చూసావ్!" ఈశ్వర్ రౌద్రంగా ప్రశ్నించాడు.

"నా కూతుర్ని నాకు కాకుండా చేసినందుకు. మన రెండు కుటుంబాల మధ్య ద్వేషం బాగా వుందని తెలిసి కూడా దాన్ని ప్రేమలోకి దింపావు. నీలాంటి గతిమాలిన వెధవకి నా కూతుర్ని యివ్వటం ఇష్టంలేదు నాకు. దానికి ఓ ఫారెనర్‌తో సంబంధం సెటిల్ చేసాను. అందుకే నిన్ను చంపెయ్యమని విలియమ్‌ని నియమించాను. కాని నా కతను నిన్నెవరో చెట్టుకు కట్టేసారని, నీ ముందొక స్త్రీ శవం వుందని ఫోన్ చేసాడు.

నిన్ను చంపకుండానే కసి తీర్చుకోవచ్చని నువ్వే ఆ హత్య చేసినట్లు సృష్టించమని చెప్పాను. కానీ ఈశ్వర్ ఆ చనిపోయినది నా కూతురే అని తెలిసాక నిన్ను చంపకుండా వదిలిపెట్టినందుకు చింతించాను. నీకెలాగైనా మరణ శిక్షపడాలి. అదే నా ఆశయం.

నా కూతుర్ని నువ్వు వాంఛించావని, నా కూతురు అందుకు నిరాకరించిందని, ఆ పగ మనసులో పెట్టుకొన్నావని పోలీసులకి చెప్పాను. యస్.ఐ. మాటల్ని నమ్మకుండా వుంటారా! నా ఆశయం నెరవేరింది. నీకు మరణశిక్ష పడింది" కసిగా పలికాడు సుదర్శనం.

"నా ఆశయం ఏమిటో తెలుసా! నీలాంటి చీడపురుగుల్ని ఏరిపారెయ్యటం."

"నోరుముయ్! నువ్వొక నీతిమంతుడువా! నా కూతుర్ని చంపి...."

"షెటప్!" గట్టిగా అరిచాడు ఈశ్వర్.

"తను పెంచిన మొక్కను త్రుంచుకోవాలని ఏ తోట

మాలీ అనుకోడు. అయినా చెట్టుకు కట్టివున్న నేను జయంతిని చంపానని అనుకున్న నువ్వొ ఓ యస్.ఐ.వా! జయంతిని చంపేసి, నన్ను నేను చెట్టుకెలా కట్టుకోగలనను కొన్నావ్! నిద్రపోయాయా నీ తెలివితేటలు. కాదు నా మీద పగా, ద్వేషం, నీ తెలివితేటల్ని నిద్రపుచ్చింది.

నామీద ద్వేషం నీ వృత్తినే రూపుమాపేసింది. దేశంలో హత్యలు, దోపడీలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడ వలసిన నువ్వు ఒక హంతకుడివి. నీవల్ల నేను వురికంబం యెక్కేందుకు సిద్ధంగా వున్నాను. న్యాయమే నీలో వుంటే నన్ను రక్షించేప్రయత్నం చెయ్యగలిగేవాడివి. ధర్మం కాపాడవలసినవాడివి,పగ కసిఅంటూసత్యానికి సంకెళ్లుబిగించావు.

ధర్మం దారితప్పిందంటే అది నీలాంటి ఆ శ్యామ్రావ్ లాంటి ప్రబుద్ధులవలన కదూ! నో, నిన్ను బ్రతకనివ్వను. వృత్తిధర్మం పాటించని నీలాంటి వ్యక్తి పోలీస్ డిపార్ట్ మెంట్లో వుంటే న్యాయం నీ కబంధహస్తాలలో నలిగి పోతుంది" అంటూ ఈశ్వర్ రివాల్వర్ పేల్చాడు.

సుదర్శనం 'గావుకేక' పెట్టి క్రిందపడ్డాడు.

ఈశ్వర్ ప్రశాంతంగా గుండెనిండా వూపిరి పీల్చుకొని, తలుపులు తీసాడు.

ఎదురుగా రక్తపుమడుగులో సుదర్శనాన్ని చూసి, "ఓ మైగాడ్ యస్.ఐ.గార్ని చంపేసాడు," అని పొలికేక పెట్టాడు ఇనస్పెక్టర్.

ఈశ్వర్ మౌనంగా తన రెండుచేతుల్ని ఇనస్పెక్టర్ ముందుకు చాచాడు.

అప్పుడే గడియారం ఒంటి గంట కొట్టింది.

ఈసారి ఆ గంట అతని గుండెలో జేగంటలా మ్రోగింది.

★

సరదాకొక అబద్ధం

వసుంధర

"ఎక్కడికి?" అనడిగింది సరోజ.

"మనిద్దరమూ తప్ప మరెవ్వరూ వుండనిచోటుకు...." అన్నాడు రఘు.

"ఎందుకు?"

"ఇద్దరం మనసులు విప్పి చెప్పుకోవలసిన కబుర్లుచాలా వున్నాయి."

సరోజ ముఖం వికసించింది. ఆమె ఆ ఊళ్ళో ప్రముఖ వ్యాపారస్థుడు శోభనరావు కూతురు. బియ్యే చదువుతోంది. చెప్పుకోదగ్గ అందగత్తె.

రఘు అంతస్థులో ఆమెకంటె చాలా పైన వున్నాడు. కోటీశ్వరుడు నాగరాజు అతని తండ్రి. ఆయనకు ఒక్కగా నొక్క కొడుకు రఘు.

నాగరాజు స్వయంకృషితో పేదరికంనుంచి ఈ స్థితికి వచ్చాడు. అందుకే అట్టహాసంగా జీవించడం ఆయనకు నచ్చదు. ఆయన ఇల్లు చూస్తే గొప్పవాడనిపిస్తుంది కానీ మరీ కోటీశ్వరుడనిపించదు. రఘుకు స్వంతకారుంటే వుండవచ్చు కానీ అతను సంసారపక్షంగానే పెరిగాడు. అతనికి గానీ అతని మిత్రబృందానికిగానీ చెడు అలవాట్లేమీ లేవు. వారిలో ఒక్కరుకూడా పొగత్రాగారు. మత్తుపానీయాల జోలికి వెళ్ళరు.

నాగరాజుకూ శోభనరావుకూ చిన్ననాటి నుంచీ స్నేహమూ, దూరపు బంధుత్వమూ వున్నాయి. సరోజ పుట్టినప్పుడే నాగరాజామెను తన కోడలుగా చేసుకుంటా నన్నాడు. అప్పట్లో ఆ విషయాన్నంత సీరియస్‌గా తీసుకోక పోయినా ఇప్పటికీ నాగరాజు అన్నమాటమీద నిలబడడం శోభనరావుకూ అతని భార్యకూ చాలా సంతోషంగావుంది.

రఘుకు సరోజ నచ్చింది. తండ్రి తనకు అంత అందమైన అమ్మాయిని భార్యగా నిర్ణయించినందుకు అతను చాలా సంతోషించాడు. చిన్నతనం నుంచీ యిద్దరికీ మంచి పరిచయముంది. కాబోయే భార్య అని తెలిసినందువల్ల రఘు ఆమెతో కాస్త చనువుగానే వుండేవాడు.

ఇద్దరూ కలిసి చాలాసార్లు విహారయాత్రలకు వెళ్ళారు. సినిమాలకూ, బీచీలకూ వెళ్ళడం సంగతి చెప్పనే అక్కర్లేదు. అయితే సంస్కారం, సంప్రదాయం—వారి నెప్పుడూ హద్దుమీరనివ్వలేదు. హద్దుమీరే ఆలోచనలకే వారి మనసుల్లో చోటుండేది కాదు. ఇద్దరు మంచి స్నేహితుల్లా ఇద్దరూ మసలుతూండేవారు.

సినిమాల గురించీ, రాజకీయాల గురించీ, చదువుల గురించీ, రచయితల గురించీ వాళ్ళ సంభాషణలు నడిచేవి తప్పితే ఎప్పుడూ ప్రేమ కబుర్లు చెప్పుకునేవారు కాదు. అందుకు ఇద్దరికీ మొహమాటంగానే వుండేది. అందువల్లనే ఒకరినొకరు ప్రేమించుకుంటున్నదీ లేనిదీ ఇద్దరికీకూడా తెలియదు. బహూశా ఇద్దరిలోనూ ఒకరిపై ఒకరికి ప్రేమ వుండే వుంటుందని ఇద్దరూ అనుకుంటూండేవారు.

అందుకే సరోజ రఘు అన్నమాటలకు సంతోషపడింది. ఇద్దరూ మనసులు విప్పి మాట్లాడుకునేందుకు ప్రేమకబుర్లు తప్ప మరేముంటాయి?

ఇద్దరూ రఘు ఇంటికి వెళ్ళారు. అది నాగరాజు కొడుకు కోసం ప్రత్యేకంగా కట్టించిన బంగళా. అన్ని సదుపాయాలతోటీ గవర్నమెంట్ ఆఫీసరు క్వార్టర్లా వుంటుంది. పరీక్షల సమయంలోనూ, సెలవుల్లోనూ రఘు ఎక్కువగా అక్కడే గడుపుతూంటాడు.

తలుపు తాళంతీస్తూ "ఈ ఇంట్లో వున్నది కేవలం మనమిద్దరమే—చాలా విశేషాలు మాట్లాడుకోవాలి...." అన్నాడు రఘు.

సరోజ తనువు పులకరించింది. ఎన్నో పర్యాయాలు తాము ఒంటరిగా కలుసుకున్నప్పటికి తాము యువతీ యువకులమన్న భావం ఆమెకు ఆ క్షణంలోనే కలిగింది.

ఇద్దరూ లోపల అడుగుపెట్టారు. రఘు తలుపులు వేసేశాడు. చెరో సోఫాలోనూ చతికిలబడ్డాక "నేను నిన్ను సూటిగా ప్రశ్నలడుగుతాను. జవాబు సూటిగా యివ్వాలి" అన్నాడు రఘు.

"అలాగే!" అంది సరోజ.

"నేనంటే నీ కిష్టమేనా?"

"ఇష్టమే!"

"మనపెద్దలు మన వివాహం జరిపిస్తామంటే నీకు అభ్యంతరమా?"

"లేదు...."

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

"తెలియదు...."

రఘు తడబడి "అదేం జవాబు?" అన్నాడు.

"సూటిప్రశ్నకు సూటిజవాబు కావాలన్నావు. ఇచ్చాను. ప్రేమగురించి నాకేమీ తెలియదు. అలాంటప్పుడు నిన్ను ప్రేమిస్తున్నానని ఎలా చెప్పేది?" అంది సరోజ.

"పోనీలే ప్రేమసంగతి తెలియకపోయినా నన్ను పెళ్ళి చేసుకుందుకు అభ్యంతరం లేదన్నావుగా-కాబట్టి ఒక చిన్న కోరిక. నిన్ను పెళ్ళి చేసుకోవడం నాకిష్టమే అని ఒక్క ముక్క చెప్పు. సిగ్గుపడకుండా బ్రతిమాలించుకోకుండా ఒక్కముక్కలో చెప్పు" అన్నాడు రఘు.

"ఈ మాత్రందానికి సిగ్గుపడడమెందుకు? బ్రతిమాలించు కోవడమెందుకు? నాకు నిన్ను పెళ్ళిచేసుకోవడం ఇష్టమే!" అంది సరోజ.

"వెరీగుడ్!" అంటూ ఉత్సాహంగా ఈలవేశాడు రఘు.

వెంటనే బిలబిలమంటూ పదిమంది యువకులు వచ్చి వాళ్ళిద్దర్నీ చుట్టుముట్టారు. వాళ్ళందరూ ఆ ప్రాంతాలే

దాగునివుండి తమ మాటలు విన్నారనీ రఘు ఈలవేయగానే బయటకు వచ్చారనీ ఇదంతా రఘు ఆడిన నాటకమనీ సరోజ గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు. సిగ్గుతో ముఖం కప్పుకుందామె.

రఘు తన స్నేహితుల వంక గర్వంగా చూసి "మీ సందేహం తీరిందా?" అన్నాడు. వాళ్ళందరూ పెద్దగా చప్పట్లుకొట్టి నవ్వేశాడు.

"ఇలాంటి నాటకాలు నీకు అలవాటేనని తెలిసీ మోస పోతూంటాను. నీ అబద్ధాలు నమ్మకూడదు" అంది సరోజ సిగ్గుతో ముడుచుకుపోతూ.

రఘు నవ్వి "ఇందాకా నాతో అన్నమాటలు యింకో సారి వీళ్ళందరికీ కూడా చెప్పకూడదూ ఎంతో సంతో షిస్తారు" అన్నాడు.

"ఛీ!" అంటూ సిగ్గుతో ముఖం కప్పుకుంది సరోజ.

"ఈ మాత్రానికే సిగ్గుపడతావనీ, బ్రతిమాలించుకుంటా వనీ అనుకోలేదు" అన్నాడు రఘు.

2

"అయితే నువ్వు వాణ్ణి ప్రేమిస్తున్నావన్నమాట" అన్నాడు గోపీ కోపంగా.

"అలాగని నేననలేదే!" అంది సరోజ.

"బాగుంది పెళ్ళిచేసుకునేందుకు ఇష్టమేనని సిగ్గు లేకుండా చెప్పినదానికి ప్రేమలేదంటే నమ్ముతానను కున్నావా?" అన్నాడు గోపీ.

"ప్రేమంటే ఏమిటో నాకు తెలియదు. నాన్నగారు రఘును పెళ్ళి చేసుకోమన్నారనుకో ఇష్టంలేకపోతే వద్దన వచ్చు. కానీ ఇష్టం లేకపోవడానికి కారణముండాలిగా. రఘు అందంగా వుంటాడు. తెలివైనవాడు. డబ్బుంది"

అంటూ నవ్వింది సరోజ.

"అయితే నేనందంగా వుండనా?" అన్నాడు గోపీ.

"ఉండవని ఎవరన్నారు?" అంది సరోజ.

"ఎవరన్నారో తర్వాత చెబుతాను. నేను అందంగా వుంటానా, వుండనా."

"నీ అందానికేం? నువ్వు రఘుకంటే కూడా బాగుంటావు...."

"మరి నాకూ అందంతోపాటు, తెలివితేటలు, డబ్బు వున్నాయి. నన్ను పెళ్ళిచేసుకోవడం ఇష్టమేనని నాతో యెందుకు చెప్పవు?" అన్నాడు గోపీ.

"నువ్వెప్పుడైనా నన్నడిగేవా?" అంది సరోజ నవ్వుతూ.

"అయితే యిప్పుడడుగుతున్నాను. నన్ను పెళ్లిచేసు కోవడం ఇష్టమేనా?" అన్నాడు గోపీ.

"ఇష్టమే!" అంది సరోజ.

"నిజంగా?" అన్నాడు గోపీ నమ్మలేనట్లు.

"అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేముంది?"

"మరి రఘుని పెళ్లిచేసుకోవడం కూడా ఇష్టమే నన్నావ్!" అంది సరోజ.

"నువ్వన్నా ఇష్టమే! రఘు అన్నా ఇష్టమే—అందుకే నాన్న ఎవరిని నిర్ణయిస్తే వాళ్ళను పెళ్ళిచేసుకుంటాను" అంది సరోజ.

"కానీ మీ నాన్న ఆ రఘుగాణ్ణే నీకు నిర్ణయించేశాడు" అన్నాడు గోపీ "కానీ నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ మనసు తెలుసుకోవడంకోసమే రఘును రెచ్చగొట్టి పందెం కట్టాను. ఆ పందెంమీద రఘు నిన్ను తనింటికి తీసుకు వచ్చి ఆ మాటలు అనిపించాడు. అప్పుడు నిజంగా నా

గుండె ఆగిపోయింది. ఇప్పుడిప్పుడే అది మళ్లీ పని చేయడం మొదలెడుతోంది."

గోపీ సరోజకు స్వయానా బావ. అయిదేళ్ల నుంచి అతను శోభనరావు యింట్లోనే ఉంటూ వ్యాపారంపనులు చూస్తున్నాడు. శోభనరావు అతనికి ఒక వ్యాపారంలో వాటా ఇచ్చాడు.

గోపీ సరోజను తొలిచూపులోనే ప్రేమించాడు. సరోజ అతనితో బాగానే వుండేది. అయితే ఆమెను రఘుకిద్దామను కుంటున్నట్లు విని అతను కలవరపడి విషయం విచారించాడు. తన అవకాశాలు పరీక్షించాడు. ఏమీలేవని తెలిసిపోయింది. నోరువిడిచి శోభనరావును అడిగేశాడు. ఆయన మృదువుగానే చెప్పాడు - సరోజకు సంబంధం చిన్నతనంలోనే కుదిరిపోయిందని.

రోజులు గడుస్తున్నకొద్దీ గోపీ అసహనం పెచ్చుమీరిపోయింది. అతను తరచుగా సరోజను గమనించసాగాడు. ఆమె తనపట్ల మసిలే తీరునుబట్టి ఆమెకు తనంటే ఇష్టమేనని అర్థమయింది.

గోపీ రఘు స్నేహబృందంలో కలిసి సరోజ గురించి రఘుని రకరకాలుగా ప్రశ్నిస్తూండేవాడు. రఘు తనకు సరోజ అంటే ఇష్టమని చెప్పాడు. సరోజకు రఘు అంటే ఇష్టంలేదేమో నన్నాడో సారి గోపీ. ఆ ప్రశ్నకు జవాబుగా రఘు ఓ చిన్న అబద్ధంచెప్పి సరోజను తన ఇంటికి తీసుకు వచ్చి తమాషాచేశాడు.

"మీ నాన్నకు చెప్పకుండా మనిద్దరమూ పెళ్లిచేసుకుందాం" అన్నాడు గోపీ.

"మా నాన్నకు చెప్పకుండా నా పెళ్లి జరగదు" ఖచ్చితంగా అంది సరోజ.



"అయితే రఘు బ్రతికుండగా నా పెళ్ళి నీతో జరగదు" అన్నాడు గోపీ. అలా అనడంలో అతని ముఖంలో ఏవో వింతభావాలు ద్యోతకమయ్యాయి.

3

"ది ఎగ్జోర్సిస్ట్" సినిమాకోసం జనం విరగబడి పోతున్నారు. అడ్వాన్స్ బుకింగ్ దగ్గర మామూలు బుకింగ్‌ల కంటె రష్‌గా వుంటోంది.

రఘు స్నేహితులు ముగ్గురు నానా అవస్థలూపడి ఆ రోజు మ్యాట్నీకి అడ్వాన్సుగా టికెట్సు కొనగలిగారు. అంతా రఘు ఇంటిదగ్గర కలుసుకుని అక్కణ్ణించి సినిమాకు వెళ్ళ డానికి ఒప్పందమయ్యింది.

అనుకున్న ప్రకారం సరిగ్గా రెండుగంటలకు అందరూ రఘు ఇంటికి వచ్చారు. సినిమాకు రెండున్నరకు బయ ల్దేరితే సరిపోతుంది. అందరూ సినిమాగురించే చర్చిస్తున్నాడు.

రెండూ॰ఇరవైకి అందరకూ బయల్దేరేమూడ్ వచ్చేసింది. రఘు ఒక్కడే బట్టలు మార్చుకోవలసి వుంది. బట్టలు

మార్చుకోడానికి లేచిన రఘు చటుక్కున మంచంమీద ఉండలా చుట్టుకుని పడిపోయాడు. అంతా ఆశ్చర్యంగా అతని చుట్టూమూగారు.

రఘు కడుపు గట్టిగా పట్టుకుని ముఖంలో బాధను ప్రకటిస్తున్నాడు. బహుశా కడుపులో పోట్లు అయివుండాలి.

"ఏమయింది" అన్నాడు ఒకడు.

"బాధ భరించలేను. ప్రాణం పోతుందా అనిపిస్తోంది" అన్నాడు రఘు.

"డాక్టర్ని పిలుచుకువస్తాను" అన్నాడు చలం అనే స్నేహితుడు.

గోపీ ఉత్సాహంగా ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు. చాలామంది వాచీలకేసి చూసుకుంటున్నారు.

ఫోన్‌నంబరు చెప్పి "అక్కడికి ఫోన్‌చేస్తే ఆయనే వస్తాడురా. మీరు సినిమాకు పొండి" అన్నాడు రఘు. మాట పూర్తిచేసేసరికి మరో మూడుమెలికలు తిరిగాడతను.

చలం పరుగెత్తికెళ్లి ఫోన్‌చేశాడు. డాక్టర్ వెంటనే బయల్దేరి వస్తానన్నాడు.

"ఆయన రావడానికి కనీసం పావుగంటైనా పడుతుంది. అనవసరంగా మీరు సినిమా మిస్ కొడతారు. వెంటనే బయల్దేరిపొండి—" అన్నాడు రఘు బాధను పళ్ళ బిగువున నొక్కిపెడుతూ.

"తలుపులు దగ్గరగా వేసి మనం వెళ్ళిపోదాం-అతనికి విశ్రాంతి అవసరం. డాక్టర్ రాగానే అవే సర్దుకుంటాయి" అన్నాడు గోపీ. అతనలా అనగానే అంతా ప్రయాణమయ్యారు-ఒక్క చలం తప్ప.

"దగ్గర ఎవ్వరైనా సాయముంటే మంచిది. నేనుండిపోతాను. వెధవ సినిమాకు ఇంకోసారి పోవచ్చు—"

అన్నాడు చలం.

"తీరా టికెట్లు కొనేశాం. లేకపోతే మరోరోజు వెడుదుము—" అన్నాడో స్నేహితుడు బాధగా.

"నా దగ్గరో టికెట్ వదిలేసి అంతా వెళ్ళిపొండిరా— డాక్టర్ కింతకంటె మంచి ఫీజు ఇచ్చుకోలేను. నాకు మందిచ్చి ఆయన సినిమాకు వస్తాడు...." అన్నాడు రఘు. మాట పూర్తిచేసి పెద్దగా మూలిగాడు.

రఘు ఎంత చెప్పినా వినకుండా చలం ఉండిపోయాడు. రెండు టికెట్లు వాళ్ళదగ్గర వదిలేసి మిగతా అందరూ వెళ్ళిపోయారు.

అందరూ వెళ్లిపోయాక చలం సినిమా మిస్సయినందుకు నొచ్చుకుంటూనే రఘు మూలుగుతున్నాడు. చలం అతనిబాధ చూడలేక—"సినిమా సంగతి తర్వాత చూడొచ్చు. వెధవసినిమా ఇంకోరోజున మనిద్దరం కలిసి చూడలేకపోము. కాసేపు మాట్లాడకుండా పడుకో—" అన్నాడు.

డాక్టర్ వచ్చే సమయానికి రఘు బాధ చాలావరకూ తగ్గిపోయింది. ఆయన అతని కడుపునొక్కి చూసి, కొన్ని ప్రశ్నలువేసి తనుకూడా తీసుకువచ్చిన మిక్స్చర్ యిచ్చి వెళ్ళిపోయాడు.ఆయన వెళ్లిపోగానే—"ఇప్పుడు టైమెంత యింది?" అన్నాడు రఘు.

"మూడు దాటింది—" అన్నాడు చలం.

"కార్లో వెడితే థియేటర్‌కు పదినిమిషాలు చాలు. ఇంగ్లీష్ పినిమా కాబట్టి మూడున్నర లోపులో మొదలు కాదు. పోదాం పద!" అన్నాడు రఘు.

"బాగుంది. నీకు విశ్రాంతి అవసరమని డాక్టర్ చెప్పాడు!" అన్నాడు చలం.

"ఫరవాలేదు ..." అని రఘు ఎంతచెప్పినా వినిపించు కోలేదు చలం.

ఆఖరికి విసిగిపోయి—"నాయనా! అవతల సినిమా హైమైపోతుంది. మన స్నేహితుల్లో నన్ను మనసారా ప్రేమించే వాడెవడో తెలుసుకోవడంకోసం కడుపు నొప్పి నాటకం ఆడాను. నాకే జబ్బులేదు. రెండు టికెట్లు దగ్గరుంచింది తర్వాత వెళ్ళడానికే!" అన్నాడు రఘు.

చలం తెల్లబోయాడు. స్నేహితుడి పరీక్షలో తను నెగ్గినందుకు ఆనందించినా అతడి వింత మనస్తత్వం చలాన్ని కలవర పరిచింది.

"పద-హాల్లో మన ఫ్రెండ్స్ను సర్ప్రయిజ్ చేద్దాం!" అన్నాడు రఘు.

"రఘు ఉత్త అబద్ధాలకోరు—" అన్నాడు గోపీ.

"ఏంజరిగింది?" అనడిగింది సరోజ.

గోపీ చెప్పాడు. అంతావిని సరోజ నవ్వేస్తూ— "అలాంటి వాళ్ళనుఅబద్ధాలకోరు లనరు. చిలిపివాళ్ళంటారు. చిలిపివాళ్ళంటే నాకు చాలా ఇష్టం—" అంది.

గోపీ ముఖం ఎర్రగా అయింది—"చిలిపితనం బాగానే ఉంది. కానీ ఇతగాడి మాటలు ఎలా నమ్మేది? నిన్న సినిమా అయిపోయేక టెన్నిస్, క్రికెట్, స్విమ్మింగ్ వగైరాలలో తన ప్రావీణ్యతగురించి చెప్పాడు. ఛాంపియన్ను సంగతి అటుంచితే తన స్నేహితుల్లో ఎవ్వరూ ఈ పోటీల్లో తనను నెగ్గలేరుట. కావాలంటే పందెం కడతానన్నాడు—"

"నువ్వు కట్టలేకపోయావా?"

"కడదామనే అనుకున్నాను. కానీ అక్కడకూడా నా

అసహాయత అడ్డొచ్చింది. పందెం ఏకంగా వెయ్యి రూపాయలట!"

"వెయ్యి రూపాయలు లేవా నీదగ్గర?"

"ఉన్నాయా లేవా అనికాదు. అంత మొత్తం ఓడిపోవడం ఇష్టంలేదు...."

"అంటే ఓడిపోతానని భయపడుతున్నావన్నమాట!" అని సరోజ నవ్వి—"ఇలా భయపడే వాళ్ళుండడం వల్లనే అతని ఆటలన్నీ సాగుతున్నాయి. ఎవ్వరూ ధైర్యంచేసి వెయ్యి రూపాయలు పందెం కాయరు. ఎంత ధైర్యం లేకపోతే వెయ్యి రూపాయలు పందెం కాస్తాడని భయపడతారు. నువ్వు నామాట నమ్మే పక్షంలో రఘుకు బుద్ధివచ్చే వుపాయం చెబుతాను—" అంది.

గోపీ ఆశ్చర్యంగా మరదలి వంకచూసి—"నువ్వు రఘుకు బుద్ధివచ్చే ఉపాయం చెబుతావా? నేను నమ్మలేను—" అన్నాడు.

"రఘు అంటే నాకిష్టమే-కానీ మరీ ఇంతలా అబద్ధాలాడేవాళ్ళంటే చిరాకు. ప్రాణాలు రక్షించుకోవడం కోసం అబద్ధమాడితే అర్థముంది. సరదాకోసం చిన్న అబద్ధం చెబితే ఫరవాలేదు. అలాకాకుండా అబద్ధాలాడడమే జీవన ధ్యేయంగా పెట్టుకుని నిత్యమూ అదేపని చేయడం నాకు నచ్చలేదు. రఘుకు బుద్ధిరావాలి. నువ్వు ధైర్యంచేసి రఘుతో ఈతవిషయంలో పందెంవేయి. నువ్వు తప్పక నెగ్గుతావు...." అంది సరోజ నమ్మకంగా.

"ఎలా చెప్పగలవు?"

"ఒకసారి స్విమ్మింగ్ పూల్‌వద్ద నాదగ్గర్ నానాకోతలూ కోసి భంగపడ్డాడు. నీళ్ళలోపడి గుటకలు వేస్తూంటే ఆడపిల్లలం రక్షించాం. పందెం కాస్తే నువ్వు తప్పక

నెగ్గుతావు. నెగ్గని పక్షంలో ఆ వెయ్యి రూపాయల నష్టమూ నేను భరిస్తాను....'' అంది సరోజ.

“అయితే ఈరోజు ఊరిచివర చెరువుదగ్గర అతన్ని ఛాలెంజి చేస్తాను. నువ్వుకూడా ఉండాలి. మా స్నేహితు లంతా వస్తారు....'' అన్నాడు గోపీ.

“నేను రెడీ!'' అంది సరోజ.

ఆ తర్వాత గోపీవచ్చి అన్ని ఏర్పాట్లూ జరిగేయంటే సరోజ ఆశ్చర్యపడింది. రఘుకు ఈతరాదని ఆమెకు ఖచ్చితంగా తెలుసును. అటువంటప్పుడు ఏ ధైర్యంతో అతను పందేనికి సిద్ధపడ్డాడో ఆమె ఊహించలేకపోయింది. సరే అక్కడే చూడవచ్చునని అనుకుందామె.

సాయంత్రం చెరువుదగ్గర అందరూ సమావేశ మయ్యారు.

చిన్నబోట్లో రఘు, గోపీ చెరువు మధ్యకు వెళ్ళారు. అక్కడ ఇద్దరూ బోట్లోంచి చెరువులోకి దూకారు.

గోపీ వేగంగా ఒడ్డువైపు ఈదసాగాడు.

రఘు రెండుమార్లు పైకితేలి—“హెల్ప్, హెల్ప్-'' అని అరిచాడు.

ముందు అది నటనేనని చాలామంది అనుకున్నారు. కానీ అతను అక్కడే గిలగిల తన్నుకునే పద్ధతి గమనించి అతను మునిగిపోవడానికి ఎంతోసేపు పట్టదని ఒడ్డున ఉన్నవారికి గ్రహింపయింది.

బోటులో వాళ్ళను తీసుకువెళ్ళిన మనిషి రఘుకు కర్ర అందించాడు. రఘు నెమ్మదిగా బోట్లోకి చేరేసరికి గోపీ ఒడ్డుకు ఈదుకు వచ్చేశాడు. అందరూ చప్పట్లు కొట్టేశారు. రఘు నెమ్మదిగా బోట్లో ఒడ్డుకు చేరాడు. అతని ముఖంలో జీవంలేదు.

"ఈత రానప్పుడు నీట్లో ఎందుకు దూకావ్?" అన్నాడు చలం మందలిస్తున్నట్లు.

"టెన్నీసూ, క్రికెటూ మొదటి ప్రాక్టీసులోనే బాగా ఆడాను. ఈత విషయం కూడా అంతే ననుకున్నాను...." అని గోపీవంక తిరిగి "డబ్బు తర్వాత ఇస్తాను" అన్నాడు రఘు. అతని మాటలు దీనంగా ఉన్నాయి.

గోపీ గర్వంగా నవ్వాడు.

"ఇంకెప్పుడూ ఇలాంటి పందేలు కాయకు—" అంది సరోజ.

"బుద్ధివచ్చింది కానీ ఇప్పుడొచ్చిన నష్టం పూడ్చుకునేందుకైనా క్రికెట్, టెన్నిస్ విషయంలో పందెం కాయాలి. అందులో నన్నెవ్వరూ ఓడించలేరు...." అన్నాడు రఘు.

"చింత చచ్చినా పులుపు చావదంటారు. ఇదే కాబోలు!" నుకుంది సరోజ.

5

"ఈ రహస్యం ఎవ్వరికీ చెప్పకూడదు—" అన్నాడు రఘు.

"ఏమిటది?" అన్నాడు గోపీ.

"నేను నీ దగ్గర ఈత నేర్చుకుంటాను. ఎవ్వరికీ తెలీకుండా రహస్యంగా నువ్వు నాకా విద్య నేర్పాలి—" అన్నాడు రఘు.

"ఎందుకని?"

"నేర్చుకుని సరోజపైన పందెం కాస్తాను...." అన్నాడు రఘు. "ఆమెకు తనకు ఈత బాగా వచ్చునని గర్వం!"

గోపీ కొద్ది క్షణాలు ఆలోచించాడు. అతని బుర్రలో ఏదో మెరిసింది.

ఇద్దరూ ఆ రాత్రి ఊరి చివర చెరువుకు వెళ్ళారు. అక్కడ బోటు ఒడ్డుకు కట్టేసి ఉంది. ఇద్దరూ అందులో యెక్కారు.

"ముందు బోట్లో కాసేపు విహరించి యెక్కడెక్కడ యెంతంత లోతుందో చూద్దాం—" అంటూ గెడవేసి చూస్తున్నాడు గోపీ. బోటు చెరువు మధ్యకు వెళ్ళింది. నిలబడి నీళ్ళవైపు చూస్తున్న రఘును చటుక్కున నీళ్ళలోకి తోశాడు గోపీ. రఘు ఉలిక్కిపడేటంతలోపు ప్రమాదం జరిగిపోయింది.

"గోపీ ప్లీజ్ హెల్ప్ మీ!" అంటూ అతను అరిచాడు. గోపీ బోటును ఒడ్డుకు చేర్చి కట్టేసి వెంటనే అక్కడ ఒక్క క్షణంకూడా నిలవకుండా వెళ్ళిపోయాడు. అతని కాళ్ళు వణుకుతున్నాయి. మనసులో ఏదో బెదురు ప్రారంభమయింది.

గోపీ రఘును హత్య చేయాలని అనుకోలేదు. కానీ అవకాశం అలా వెతుక్కుంటూ వచ్చింది. వెంటనే అతను ఇంటికి వెళ్ళిపోయాడు. రాత్రి అతనికి సరిగ్గా నిద్రపట్టలేదు.

మర్నాడతను నిద్రలేచేసరికి తొమ్మిదయింది. ముఖం కడుక్కుని కాఫీతాగేక కొంత మామూలుమనిషి కాగలిగేడు. ఇంటినుంచి తిన్నగా షాపుకెళ్ళాడు.

మధ్యాహ్నంవరకూ అక్కడ కూర్చునివుండగా ఇంటి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్‌చేసింది సరోజ. అతన్నోసారి అర్జంటుగా ఇంటికి రమ్మంది.

ఉరకలు పరుగులుమీద ఇంటికి వెళ్ళాడతను. ఇంటి దగ్గర సరోజ అతనికోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

"ఏమయింది సరోజా?" అన్నాడు గోపీ.

"రఘు నిన్నరాత్రి నుంచీ ఎక్కడున్నాడో తెలియడం లేదుట...."

"ఓస్ ఇంతేకదా. రఘు కనబడకపోతే నాకు మంచిదే! మన పెళ్ళికింక అడ్డుండదు" అన్నాడు గోపీ తనా విషయాన్ని తేలికగా తీసుకున్నట్లు.

"ప్లీజ్ జోకులువేయొద్దు. నీకేమైనా తెలుసా, రఘు గురించి" అంది సరోజ.

"ఎవరికీ చెప్పనంటే ఓ రహస్యం చెబుతాను" అన్నాడు గోపీ.

"చెప్పను."

"నీ ముందు ఈత విషయంలో పరాభవం పొందేక రఘు మనసు పాడైపోయింది. ఆత్మహత్య చేసుకోవాలని పిస్తోందని అన్నాడు" అన్నాడు గోపీ.

సరోజ ముఖం బాధగా అయిపోయింది. "అంత చిన్న విషయానికి అతడు ఆత్మహత్య చేసుకోడు. ఇంకేదైనా

నాటకమాడుతున్నాడేమోనని నా అనుమానం."

"అయితే సరే-అతనే బయటపడతాడు. ఈ మాత్రం దానికి నన్ను పిలవడమెందుకు?" అన్నాడు గోపీ చిరాకును నటిస్తూ.

"ఎందుకంటే ఇదివరకు నువ్వు నన్ను ప్రేమ, ఇష్టం గురించి కొన్ని ప్రశ్నలడిగావు. వాటికి నాకిప్పుడు జవాబు దొరికింది. ప్రేమంటే ఏమిటోనాకుతెలిసింది.నాలోనూప్రేమ వుందని ఈ రోజే నేను తెలుసుకున్నాను" అంది సరోజ.

గోపీకళ్ళు వెలిగాయి "అయితే చెప్పు నన్ను ప్రేమిస్తున్నావా?"

"లేదు. నిన్ను ప్రేమించడంలేదు సరిగదా ఇప్పుడు నువ్వు అంటే యిష్టం కూడా లేదు నాకు" అంది సరోజ.

"ఎందుకని?"

"నువ్వు హంతకుడివి. హంతకుడిని నేను ఇష్టపడను."

"నేను హంతకుడినా. ఎవరు చెప్పారు?" అన్నాడు గోపీ కంగారుగా.

"ఎవరు చెప్పారో చూపిస్తాను రా!" అంటూ అతన్ని పక్కగదిలోకి తీసుకువెళ్ళింది సరోజ. అక్కడ కుర్చీలో కూర్చునివున్న రఘును చూసి తెల్లబోయాడు గోపీ. అతనికి నోటమాట రాలేదు. సరిగదా కాళ్ళు కూడా వణకడం ప్రారంభించాయి. గుడ్లు మిటకరించి రఘువేపే చూస్తూ నిలబడిపోయాడు.

"భయపడకు. రఘు నిన్ను క్షమించాడు. ఆ క్షమా గుణమే నాకు అతనిపట్ల ప్రేమను కలిగించింది" అంది సరోజ.

"నీకు నేను వెయ్యిరూపాయలూ యివ్వనవసరం లేదను కుంటాను. నువ్వు బోటును ఒడ్డున కట్టేవరకూ నేను

నీళ్ళలో మునిగేవున్నాను. తర్వాత నెమ్మదిగా ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చాను" అన్నాడు రఘు.

"నీకు ఈత వచ్చా?" అన్నాడు గోపీ అప్రయత్నంగా.

"నిన్ను ఆటపట్టించడంకోసమే నీతో ఓడిపోయాను. ఆ తర్వాత నీ దగ్గర ఈత నేర్చుకుంటా నన్నాను. రెండ్రోజులయేక మిత్రబృందాన్నంతా ఆహ్వానించి నీకంటె బాగా ఈది నిన్నోడిపించాలనుకున్నాను. సరోజదగ్గర భంగపడ్డాక పట్టుబట్టి పొరుగూళ్ళో రహస్యంగా ఈత నేర్చుకు వచ్చాను" అన్నాడు రఘు.

గోపీ అక్కడ ఒక్క నిమిషం కూడా ఆగలేదు.

"నేను సరదాకు అబద్ధాలాడతాను. కానీ అది ఒక ప్రమాదకరమైన వ్యక్తిని, మిత్రుడిలా నటిస్తున్న శత్రువును నాకు పట్టిస్తుందని నేను ఊహించలేదు" అన్నాడు రఘు విస్మయంతో. ★

పరుగు?

ఒక పెద్దమనిషి ఉరకలు పరుగులతో పరుగెట్టి వెళుతున్నాడు. దారిలో అతనిని ఎరిగిన వ్యక్తి ఆపి, "ఎక్కడికలా పరుగెట్టి వెళ్తున్నారు?" అని అడిగాడు.

"ఎనిమిది గంటల మెయిలుకి...." అని అన్నాడు.

"ఇంకా చాలా టైముంది కదా! ఎందుకలా పరుగెత్తడం?"

"మధ్యలో ఎవరైనా తెలిసిన వెధవలు కనబడితే ఆగి మాట్లాడాలి కదా! ఆ టైము మేకప్ చెయ్యడానికి...." అని తిరిగి పరుగెత్తడం ప్రారంభించాడు.

—ప్రభాకర్, తిరుచ్చి-14

అభిమాన రచయిత

మల్లాది వెంకట కృష్ణమూర్తి

"డిటెక్టివ్ పృథ్వీరాజ్ రెండు చేతులూ పైకెత్తి, తన ఎదురుగా నిలబడ్డ ఆ మొరటు వ్యక్తివంక చూసాడు. అతని చేతితో నల్లని పిస్తోలు నిగనిగ మెరుస్తోంది. లిఫ్ట్ నిశ్శబ్దంగా పైకి వెళ్తోంది...."

చదువుతున్న వెంకట్ కి ఎవరో తలుపుమీదముని వేళ్ళతో కొట్టిన శబ్దం వినపడింది.

తలుపువైపు చూసాడు. మళ్ళీ వినపడింది చప్పుడు. ఈసారి బయట తలుపుకున్న గొళ్ళేన్ని తలుపుమీద కొడుతున్నారు.

కుర్చీలోంచి లేచి నిలబడి మధ్య గదిలోంచి హాల్లోకి వచ్చాడు. మళ్ళీ వినపడింది తలుపు చప్పుడు.

"ఎవరది?" అడిగాడు ముందు గది గుమ్మం దగ్గరికి వెళ్ళి.

"ఓసారి తలుపు తీస్తారా?" ఇంగ్లీష్‌లో అడిగారు ఎవరో.

వెంకట్ కిటికీకున్న తెరని పక్కకి జరిపి బయటకి చూసాడు. బయట ఓ ముప్పై అయిదేళ్ళతను నిలబడి వున్నాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు కిటికీలోంచి.

"మిష్టర్ వెంకట్!"

"మీ పేరు?"

"చెప్తాను. నా పేరు, చిరునామా, ఎందు కొచ్చిందీ చెప్తాను. తలుపు తీస్తారా?" ఇంగ్లీష్‌లో అడిగాడు మళ్ళీ.

వెంకట్ తలుపుకివున్న అడ్డ గడియని తీసి తలుపు తెరచాడు.

"వెంకట్ మీరేనా?" అడిగాడు అతను నమ్రతగా ఇంగ్లీష్‌లోనే.

"మీరు?" అడిగాడు. అతనికి తెలుగురాదని అర్థమైంది వెంకట్ కి.

"నా పేరు మంజునాథ్....హసన్ దగ్గరేవున్న ఓ పల్లె మాది....మిమ్మల్ని చూడటానికి వచ్చాను." సంశయిస్తూనే

లోపలికి వచ్చాడు అతను.

"వెంకట్? మీకెలా పరిచయం ఆయన." అడిగాడు వెంకట్.

"మీరేనా వెంకట్?" అడిగాడతను వెంకట్‌ని ఎగాదిగా చూస్తూ.

"కావచ్చు, హాసన్? ఎక్కడుంది అది?"

మంజునాథ్ చిరునవ్వు నవ్వాడు. కుడిచేతిని చాపి వెంకట్ చేతిని అందుకుని కరచాలనం చేస్తూ చెప్పాడు.

"వెరీ గ్లాడ్ టు సీ యు సర్!"

కుర్చీకోసం వెదికాయి అతని కళ్ళు. మంజునాథ్ అభిప్రాయం గ్రహించి చెప్పాడు వెంకట్ తలుపుమూస్తూ.

"రండి."

మధ్య గదిలోకి దారితీసి ఓ పేము కుర్చీ చూపించాడు కూర్చోమన్నట్లుగా. అతని యెదురుగా కూర్చున్నాడు వెంకట్.

"ఈ చిరునామా ఎలా తెలుసు మీకు?" అడిగాడు వెంకట్.

అతను జేబులోంచి చేతిరుమాల తీసి మొహం తుడుచుకుని, ఓసారి ఆ గదివంక పరిశీలనగా చూసాడు.

"ఆ పుస్తకాలు మీరు రాసినవేనా?" అడిగాడు గోడకున్న అద్దాల అలమారలో కనపడుతున్న పుస్తకాలని చూసి.

"నే రచయితనని యెందు కనుకుంటున్నారు?" అడిగాడు వెంకట్.

"నాకు మీ కథలంటే చాలా ఇష్టం. ముఖ్యంగా మీరు వ్రాసే డిటెక్టివ్ కథలంటే ఇంకా ఇష్టం. కన్నడంలోకి మీ కథలు చాలా అనువదింపబడి ప్రచురింపబడ్డాయి."

"హసన్ కర్నాటక రాష్ట్రంలో వుందా?"

"అవును. బెంగుళూర్‌కి వంద కిలోమీటర్ల దూరంలో."

"మీరు రచయిత ననుకునే వెంకట్‌ని కాదు నేను." చెప్పాడు వెంకట్ పైప్ అందుకుంటూ.

అతను చిన్నగా నవ్వాడు.

"నాకు తెలుసు, రచయితగా మీ పేరు తప్ప వ్యక్తిగతంగా మీరు గుర్తింపబడటం అంటే ఇష్టం లేదని."

వెంకట్ టొబాకో ఫ్లేక్స్‌వున్న సంచీని అందుకున్నాడు. బదులుగా మౌనంగా వుండిపోయాడు పైప్‌లో ఫ్లేక్స్‌ని పేరుస్తూ.

"మిమ్మల్ని కలుసుకోడానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది."

అతను టీపాయ్ మీది అగ్గిపెట్టె అందుకుని వెంకట్ పైప్‌ని అంటించాడు.

"మీరు చాలా బాగా రాస్తారు...."

"వెంకట్ బాగా రాయవచ్చు. అతనికథలు నే నెన్నడూ చదవలేదు. నేను మీరనుకుంటున్న వెంకట్‌ని కాదు."

"బుకాయించకండి సార్. మీరు రచయిత వెంకట్."

మౌనంగా పైప్ పీలుస్తూండి పోయాడు వెంకట్ అతని వంక పరిశీలనగా చూస్తూ.

"కనీసం మీ పేరు వెంకట్. ఒప్పుకోరా! మీ పక్క ఇంటివాళ్లు చెప్పారు మీ పేరు వెంకట్ అని."

చిన్నగా నవ్వాడు వెంకట్.

"ఆల్ రైట్. నా పేరు వెంకట్. కాని రచయితని కాదు."

"మిమ్మల్ని ఇలా కలవడానికి నే నెంత అవస్థ పడ్డానో మీకు తెలియదు. ముందర మా పల్లెనుంచి మీ కథలు

ప్రచురించిన ఓ కన్నడ పత్రికకి రాసాను, మీ చిరునామా తెలియ చేయవలసిందిగా. మీ చిరునామా వాళ్ళదగ్గర లేదని జవాబు వచ్చింది."

వెంకట్ మౌనంగా పైప్ తాగుతూ వినసాగాడు మంజునాథ్ మాటలు.

"ఆ తర్వాత అనువాదకురాలి చిరునామా పంపమని వ్రాసాను. ఆవిడ అనుమతి లేకుండా చిరునామా ఇవ్వమని జవాబు వచ్చింది మళ్ళీ. కాని నా ఉత్తరం ఆవిడకి పంపించారు. ఆవిడ తన చిరునామా తెలియ చేయలేదు. కాని ఉత్తరం రాసింది, ఆవిడ దగ్గరకూడా మీ చిరునామా లేదని. మీ కథలు ప్రచురింపబడ్డ పత్రికలు, అనువాదానికి పర్మిషన్ లెటర్స్ మాత్రం పంపుతారుట మీరు ఆవిడకి."

"ఇంట్రష్టింగ్" చిన్నగా నవ్వాడు వెంకట్ పొగపీల్చి వదులుతూ.

"ప్రతీనెలా తప్పనిసరిగా మీ కథ ప్రచురించే ఓ తెలుగు డిటెక్టివ్ మాసపత్రిక ఎడిటర్‌కి రాసాను మీ చిరునామా తెలుపమని. ఆ ఎడిటర్ జవాబు రాసాడు తన దగ్గర మీ చిరునామా లేదని."

"ఆ తర్వాత?"

"సరాసరి హైద్రాబాద్ వచ్చి ఆ పత్రిక ఎడిటర్‌కి ఫోన్‌చేసి అడిగాను, మీరు నా అభిమాన రచయిత అనీ, మీ చిరునామా కావాలని. మళ్ళీ అదే మాట చెప్పాడు మీ చిరునామా లేదని."

"సాధారణంగా రచయిత పర్మిషన్ లేకపోతే యెంత అభిమాన పాఠకులకయినా చిరునామా ఇవ్వరు ఎడిటర్స్."

"మీరు పంపే కథలు నచ్చకపోతే తిరిగి ఎవరికి పంపు

తారని అడిగాను. 'నచ్చనివి అరుదు. అలాంటివి చింపే స్తాము?' అని చెప్పాడు ఎడిటర్."

"ఆ తర్వాత?" ఉత్సాహంగా అడిగాడు వెంకట్.

"మరయితే పారితోషికం ఎలా పంపుతారు?" అని అడిగాను. మీ పేరున చెక్ వ్రాపి మీ బేంక్ ఎకౌంట్ నంబరు ఉదహరిస్తూ మీ బేంక్‌కి పంపుతామని చెప్పాడు."

"బేంక్ ఎకౌంట్ నంబర్ ఇచ్చారా ఎడిటర్?" అడిగాడు వెంకట్.

"ఆయన ఫోనులో మాట్లాడిన పద్ధతినిబట్టి తెలిసి పోయింది అడిగినా చెప్పడని. రెండు రోజులాగి ఆ పత్రిక ఆఫీస్‌కి వెళ్ళాను. ఎడిటర్‌ని కలసి మీ చిరునామా అడిగాను. లేదన్నాడు. కథలు పోస్టులో వస్తాయనీ, ప్రచురించాక రాయల్టీ స్క్రిప్టుమీద వ్రాపిన బేంక్‌కి మీ ఎకౌంట్‌లో క్రెడిట్ చేయమని చెక్ పంపుతామనీ చెప్పాడు.

నిరుత్సాహ పడ్డట్టుగా నటించి చెప్పాను, నేనో సినిమా నిర్మాతననీ, మీరు ఈ మధ్య వ్రాసిన ఓ నవలని కన్నడంలో సినిమాగా తీయడానికి మిమ్మల్ని కలుద్దామని బెంగుళూర్‌నుంచి వచ్చానని, కన్నడ దేశంలో రచయితలని కలవటం తేలిక అన్నాను.

ఆయనకి మీరంటే అభిమానం. మీరు ఎట్టి పరిస్థితుల్లో ఎకౌంట్ నంబర్ ఎవరికీ యివ్వద్దని చెప్పారని, అయినా మీ నవల సినిమాగా తీసే ప్రయత్నంలో వున్నాను కాబట్టి, మీ మంచికోసమే కాబట్టి ఆ బేంక్, ఎకౌంట్ నంబర్ నాకు తెలియచేసాడు. హైద్రాబాద్‌లోనే వుంది ఆ బేంక్."

"బేంక్‌కి వెళ్ళి ఏజెంట్‌ని అడిగారా వెంకట్ చిరునామా?"

"అవును. మీ చిరునామా అడిగితే బేంక్ రూల్స్ ప్రకారం అది ఇవ్వడానికి కుదరదని చెప్పాడు."

"అర్ధరాత్రి బేంక్‌లోకి జొరపడి ఫైల్స్ తిరగేసి పట్టుకున్నారా ఎడ్రస్?" నవ్వాడు వెంకట్.

మంజునాథ్ నవ్వలేదు.

"మీరు అలాంటి సన్నివేశంలో కథలో ఏవిధంగా రాస్తారో అదే విధంగా చేసాను....మర్నాడు కౌంటర్‌లోని క్లర్క్ దగ్గరకి వెళ్ళి నేను వెంకట్‌నని, మద్రాసునుంచి వచ్చిన రెండు చెక్‌లు డిపాజిట్ చేసి నెలయినా అవి కలెక్ట్ చేయబడి క్రెడిట్ కాలేదని, వాటిని నా పాత చిరునామాకే తిప్పి పంపారని, కొత్త చిరునామా వాళ్ళ రికార్డ్సులో సమోదు అయిందో, లేదో చూడమని కోరాను. అతను నా ఎకౌంట్ వున్న లెడ్జర్ తెరచి మీ చిరునామా చెప్పాడు. దాన్ని గుర్తు పెట్టుకున్నాను."

"మీరు డిటెక్టివ్ కథా రచయితగా చక్కగా పనికి వస్తారు."

"కాని మీరు ఇంకా తెలివయినవారు. బేంక్‌లో ఎకౌంట్ తెరిచేటప్పుడు ఇచ్చిన చిరునామా తప్పు. అసలు సికింద్రాబాద్‌లో గణపతి రోడ్ లేదు. రెండు రోజులు ఆటోలో తిరిగాక అది తప్పు చిరునామా అని తేలింది."

"ఆ తర్వాత?"

"ఆలోచించాను. బేంక్ ఎకౌంట్‌లోంచి మీరు డబ్బు విత్‌డ్రా చేయడానికి వస్తూంటారు బేంక్‌కి తరచు. అందుకని బేంక్‌కి వెళ్ళాను."

"కాపేసి, నేను ఆ ఎకౌంట్‌లోంచి డబ్బు విత్‌డ్రా చేస్తూండగా చూసి నన్ను వెంబడించి వచ్చారు ఇక్కడికి. అవునా?" వెంకట్ నవ్వాడు.

మంజునాథ్ వెంకట్ వంక చూసాడు చురుగ్గా. ఆ చూపులో అరాధనా భావం, కోపం రెండూ కలిసివున్నాయి.

"మీరు అంత తెలివి తక్కువ వాళ్ళయితే ఇంతమంచి డిటెక్టివ్ కథా రచయిత అయివుండే వారు కాదు....అలా చేసి వుంటే ఎప్పటికీ మిమ్మల్ని కలిసివుండే వాడిని కాను."

"అంటే?"

"మీది చెక్ సౌకర్యంతో తెరువబడ్డ ఎకౌంట్ కాదు. కనీసం వుండాల్సిన బేలన్స్ అయిదు రూపాయలుమాత్రమే. మీ ఎకౌంట్‌లో తరచువచ్చే చెక్‌ల తాలూకు మొత్తం అయిదు వందలు దాటగానే అయిదు వందలు విశాఖ పట్నంలో అదే బేంక్ బ్రాంచిలో తెరచిన మరోఎకౌంట్‌కి ఆటోమేటిక్‌గా మెయిల్ ట్రాన్స్‌ఫర్ చేసే విధంగా ఏర్పాటు చేసుకున్నారు మీరు.

అంతేకాదు. ఫోర్జరీ జరగకుండా వుండాలనే ఆలోచనతో అనుకుంటాను ఆ ఎకౌంట్‌లోంచి డబ్బు కేవలం ఎకౌంట్ మూసేటప్పుడు తప్ప, విత్‌డ్రాయల్స్ వుండ కూడదనీ ఏర్పాటు చేసుకున్నారు. మళ్ళీ అక్కడ మీ అపరాధ పరిశోధక కథల బుర్ర పనిచేసి వుంటుంది. అవునా?"

వెంకట్ జవాబు చెప్పలేదు. పొగాకు పైప్‌లో వేసుకుని గుప్పుగుప్పున పొగ పీల్చాడు.

"విశాఖపట్నం వెళ్ళాను. అక్కడ ఎకౌంట్ కేవలం మీ పేరు మీదే లేదు. అది జాయింట్ ఎకౌంట్. వైజాగ్ పోర్ట్‌లో పనిచేస్తున్న మీ తమ్ముడితో కలిసి మీరు తెరచిన ఎకౌంట్ అది."

"వైజాగ్ వెళ్ళారన్నమాట."

"నిజంగా మీ తెలివికి, ఇంత పకడ్బందీగా చేసిన ఏర్పాట్లుకి కంగ్రాట్స్ చెప్పకుండా వుండలేకపోతున్నాను. మీరు ఇంత రహస్యంగా వుండాలని కోరుకుంటున్నారంటే, మీ అభిమానులు ఇదివరలో తరచు వచ్చి మిమ్మల్ని యెంతగా ఇబ్బంది పెట్టేవారో వూహించగలను."

"మీరు చెప్పే కథ సస్పెన్స్‌లో ఆపేసారు. ఆతర్వాత?"

"ముగింపు మీకూ తెలుసు. మీ కథలమీద వచ్చే డబ్బుతో కాదు మీరు బ్రతికేది. పెన్షన్, ఇంటి అద్దెలు, బహుశ రిటయిరయినప్పుడు మీకు వచ్చిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుయిటీ మొదలయిన వాటితో మీ జీవనం సాగుతోంది. మీ తమ్ముడితో చెప్పారు మీ తదనంతరం ఆ డబ్బు అనాథశరణాలయంలాంటి మంచికార్యం కోసం మీరు వుపయోగించే వుద్దేశ్యంలో వున్నారని, అందుకు తగ్గ ఏర్పాట్లు ఇదివరకే చేసారని."

"వైజాగ్‌లోని వెంకట్ తమ్ముడు ఇచ్చాడా ఈ చిరునామా?"

"అడిగితే వెంకట్ నా అన్నయ్యే కాని కథా రచయిత కాదని బుకాయించాడు. చిరునామా ఇవ్వలేదు."

"ఇవ్వకపోతే ఇక్కడికి యెలా వచ్చారయితే?"

"మీ తమ్ముడు మీకు వుత్తరాలు రాస్తూండచ్చు తరచు. మీ తమ్ముడు ఇంటి సందులోనే వుంది గోడకి వేలాడే చిన్న పోస్ట్‌బాక్స్. వారంరోజులు ఓపికగా కాపేశాను. ఓ రోజు మీ తమ్ముడి కొడుకు వుత్తరాలు పోస్ట్ చేసాడు కొన్ని. ఇనపవైరులో గోడకి వేలాడే ఆ డబ్బాని ఎత్తు కెళ్ళిపోయాను అప్పటికప్పుడే సంచీలో పెట్టుకుని. హోటల్ గదికెళ్ళి తాళం పగలకొట్టి లోపలవున్న వుత్తరాలన్నీ తీసి మీ పేరుగల వుత్తరంకోసం వెతికాను. మీ పేరు, చిరు

నామా, మీ తమ్ముడి ఫ్రమ్ అడ్రస్ గల ఇన్‌లెండ్ కవరు దొరికింది. మీరు హైదరాబాదులోనే వున్నారని తెలిసి ఆశ్చర్యపడ్డాను.''

''అలా పోస్టుడబ్బా దొంగతనం చేయడం నేరం....''

''....అని తెలిసే మీరు మీ నవల 'రేపు లేదు'లో సహస్రబుద్ధిచేత అలా చేయించారు, కిరణ్మయి చిరునామా తెలుసుకోటానికి. మీరు రాసిన ఒక కథలోని సన్నివేశం వల్లే మీ దగ్గరికి రాగలిగాను.''

''మీరు డిటెక్టివ్ కథా రచయితగా కాదు, డిటెక్టివ్‌గానే పనికొస్తారు.''

''థాంక్స్. కాని మీ కథల్లో సాధారణంగా డిటెక్టివ్‌ల కన్నా హంతకులే ఎక్కువ తెలివితేటలు కలిగివుంటారు. ఎందుచేత?''

''అంటే నేను రచయిత వెంకట్‌నే నన్నమాట?'' నవ్వాడు.

''తప్పకుండా. ఇంత శ్రమపడి మీ దగ్గరికి వచ్చిన అభిమాన పాఠకుడిని ఇంకా నిరుత్సాహపరచటం న్యాయమా చెప్పండి?''

''సారీ. మీకు చాలా శ్రమఇచ్చాను. ఇంతకాలం, దాదాపు నాలుగు సంవత్సరాలుగా నా చుట్టూ రహస్యంగా అల్లుకున్న గూడుని ఛేదించగలిగారు మీరు. నిజంగా హార్టీ కంగ్రాచ్యులేషన్స్.''

''థాంక్ యూ సార్. మరి నా ప్రశ్నకి సమాధానం?''

''మళ్ళీ అడగండి.''

''డిటెక్టివ్ తెలివితేటలు చివరలో కాని బయటపడవే?''

''కారణం హంతకుడు డిటెక్టివ్ ఆలోచనాధోరణి వూహించగలడు కాబట్టి ముందే జాగ్రత్తపడతాడు.

డిటెక్టివ్ హంతకుడి తెలివితేటలు అంచనావేసేది అతన్ని గురించి ఓ అవగాహన ఏర్పడ్డాకే. అందుకు కొంత సమయం తీసుకుంటుంది."

"మీ కథలు చదువుతూంటే ఎంత సహజంగా వుంటాయంటే ఒకోసారి నేరం చేయడం ఇంత తేలికా అనిపిస్తుంది."

"ఆ తర్వాత వాళ్ళు పడే కష్టాలు యెలాంటివో కూడా ప్రతీ కథల్లో విశదీకరిస్తాను. కాదంటారా?"

"నిజమే.... కాని...."

"కాఫీ తాగుతారా?"

"కథలు రాయడం ఓ వరం అయితే మంచి డిటెక్టివ్ కథలు రాయడం యింకో వరం"

"కాఫీ తాగుతారా?"

"ఇంట్లో యెవరూ లేనట్లున్నారు. మీకు వివాహం కాలేదని తెలుసు. అఫ్‌కోర్స్, వ్యక్తిగత కారణాలు అడగను లెండి."

"ఫర్వాలేదు. నే చేస్తాను కాఫీ. ఎలక్ట్రిక్ స్టవ్‌మీద నిముషాల్లో అయిపోతుంది.... నే వ్రాసిన కథలన్నిటిలో మీకు నచ్చిన కథ ఏది?"

మంజునాథ్ కళ్ళలోకి కొత్త కాంతి రావడం గమనించాడు వెంకట్.

"బాగా నచ్చిన కథ? బాగా కాదు. మనస్పూర్తిగా నచ్చిన కథ ఒకటుంది. ఎంత నచ్చిందంటే వురి తీయబోతూ ఆఖరి కోరిక ఏమిటంటే ఓసారి ఆ కథ చదవాలంటాను."

వెంకట్ మొహం ఇబ్బందిగా పెట్టాడు. తన కథలని యెవరయినా మొహంమీద ఏమాత్రం పొగిడినా, తన భాష

రాని పదిమంది కొత్తవాళ్ళ మధ్య అకస్మాత్తుగా తీసుకు వెళ్ళి వుపన్యాసం ఇవ్వమని వదిలినట్లుగా ఫీల్ అవుతాడు.

"ఆ కథపేరు 'శివాజ్ఞ లేనిదే' ఆ కథలో హంతకుడు తనకి ద్రోహంచేసిన ప్రియురాలిని కత్తితో చంపి ట్రంక్ పెట్టెలో పెట్టి, హతురాలి గుర్తు తెలియకుండా వుండ టానికోసం ట్రంక్ పెట్టెనిండా అంగుళం ఖాళీలేకుండా కరిగించిన తారుపోసి ఓ రైల్లో వదులుతాడు ఆ పెట్టెని. పోలీసులు ఆ పెట్టె తెరిచేసరికి గడ్డకట్టిన తారుతప్ప మరేం వుండదు. తారు లోపల శవం. శవం వంటిమీద తారు పోదు సరిగ్గా. ఎంత ప్రయత్నించినా శవాన్ని గుర్తించ లేరు...."

ఎంతో ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు మంజునాధ్.

"అవును. ఆ కథ బావుందని చాలా మంది రాసిన ఉత్తరాలు చూసాను పత్రికలో. ఆ కథ కన్నా నా ఉద్దే శంలో చదరంగంలో హత్య...."

"అది ట్విస్ట్ కథ. కాని ఇది మీరే హత్యచేయాలని వూహించి, పథకం వేసుకుని రాసారా అనిపించే కథ...."

వెంకట్ లేచి హాల్లో ఓమూల చిన్న కాఫీ టేబిల్ మీద వున్న ఎలక్ట్రిక్ స్టవ్ ప్లగ్‌ని పాకెట్‌లో వుంచి దానిమీద గిన్నె వుంచాడు. అందులో పక్కనేవున్న గాజు జగ్గులోని పాలని పోసాడు.

"మీరు నిజంగా హత్య చేయాలని అన్ని విధాలుగా ఆలోచించి రాస్తారా లేక ఆ కథ పరిధిని మాత్రమే దృష్టిలో వుంచుకుని రాస్తారా?" అడిగాడు మంజునాధ్.

"విమర్శకులు తప్పు పట్టకుండా వుండేలా ప్లాన్ చేసు కుంటాను. తర్వాత సహజత్వానికి దూరంగా వుండకుండా జాగ్రత్త పడతాను."

"నాకు మీ తెలివి తేటలమీదా, మీ ఆలోచనా సరళి మీదా చాలా నమ్మకం ఏర్పడింది మీ కథలు చదివాక. మీ కథలు...."

"చక్కెర లేకుండా తాగుతాను నేను. మీకు?"

"నాకు షుగర్ వ్యాధిలేదు. చక్కెర ఎక్కువ వేయండి. మీ వయసు వచ్చాక మానేస్తాను చక్కెర" నవ్వాడు మంజునాధ్.

ఆ నవ్వులో అదివరకటి సౌమ్యత లేదు. మర్యాద అసలే లేదు.

వెంకట్ వింతగా చూసాడు అతని వంక.

"నేను రెండు హత్యలు చేసిన హంతకుడినని తెలిస్తే మీ రెలా ఫీల్ అవుతారు?" అడిగాడు మంజునాధ్.

వెంకట్ నవ్వాడు.

"ఏమో? అవాలిగా మీరు?" అన్నాడు.

"మీ కథల్లోని పాత్రలు ఎలా మాట్లాడుతాయో అలాగే మాట్లాడుతున్నారు మీరు. నిజం నేను ఇద్దరిని చంపాను."

"కాఫీ తాగుతూ వివరాలు చెప్తురుగాని కొత్త కథకి ప్లాట్ దొరుకుతుంది ఇవాళ" మళ్ళీ నవ్వాడు వెంకట్, పాలలో చెంచాతో ఇన్‌స్టాంట్ కాఫీపొడి వేస్తూ.

"ఆ అవకాశం మీ కివ్వను."

"మీరే వ్రాసే వుద్దేశంలో వున్నారా?" అడిగాడు కాఫీ టేబిల్ మీదవున్న సాసర్లమీద బోర్లించివున్న కప్పులని అందుకుంటూ.

"కాదు! మీరు రాసిన 'శివాజ్ఞ లేనిదే....' కథలోలాగా చేసాను మొదటి హత్య. ఇంక మీరు కొత్తగా రాసేదేమీ లేదు అందులో."

మంజునాధ్ కంఠంలో ఇది వరకు తనమీద చూపించిన



మర్యాద లేదని గ్రహించాడు వెంకట్. కఠినంగావున్నాయి మాటలు. అతనివంక చూసాడు. మంజునాధ్ ఆవేశ పడు తున్న గుర్తుగా అతని నుదుటిమీద వున్న నరాలు వుబుకు తున్నాయి.

ఆశ్చర్యంగా చూసాడు వెంకట్.

"అలా అయిపోయా రేమిటి?"

"నీ వల్లే."

మంజునాధ్ కంఠంలో ఆకస్మాత్తుగా కోపం, ద్వేషం.

"సంగతేమిటో చెప్పండి."

"నీవల్ల నేను నా భార్యనే చంపుకున్నాను."

"నావల్లా....?"

"అదే, నీ....నువురాసిన కథవల్ల....నీ మీద నమ్మ కంతో నీ రచనలమీద నమ్మకంతో."

"వివరంగా చెప్పండి. ఆవేశ పడకండి."

"చెప్తాను. మీ కథ 'శివాజ్ఞ లేనిదే....' లోలాగా నా భార్యని హసన్‌నుంచి నాగపూర్ తీసుకెళ్ళాను. అక్కడ ఓ ట్రంక్ పెట్టె, తారు సంపాదించాను. ఆ కథలో లాగే దాన్ని చంపి ట్రంక్‌లో ముందర కరిగించిన తారుపోసి తర్వాత శవాన్ని పడుకోబెట్టి శవంమీద పెట్టె నిండే లాగా తారుపోసాను. తారు గట్టిపడ్డాక తాళంవేసి, నాగపూర్‌లో ఎక్కించాను. ఆ ట్రంక్ పెట్టె ఢిల్లీ చేరింది. నేను బెంగుళూరు చేరాను. నన్నెవరూ పట్టుకో లేరనుకున్నాను. కాని రెండు నెలల తర్వాత ఓ రోజు ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ వచ్చి అరెస్ట్ చేసాడు, నా భార్యని హత్యచేసిన నేరం మీద."

"ఎలా కనుక్కున్నారు మిమ్మల్ని?" ఆసక్తిగా అడిగాడు వెంకట్.

"నా భార్య శవాన్ని కెమికల్ లోషన్‌లలో కడిగారు. బాగా కమిలిపోయింది శరీరం. ఎవరూ గుర్తుపట్టలేదు. కాని పోస్ట్‌మార్టమ్‌లో నా భార్య వయసు, ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగిన సంగతి, చిన్నపుడు ఎడం భుజంమీద అయిన గాయం తాలూకు మచ్చ, వెజిటేరియన్ అనే విషయం, జడ పొడుగు, మరణించిన రాత్రి తిన్న పదార్థాలు, జుట్టుకి రాసుకున్న హేరాయిల్, మొదలయినవివరాలు సేకరించారు. ఆనవాయితీగా ఆ వివరాలు దేశంలోని ప్రతీ రాష్ట్రి రాజధానిలోని ఐ. జి. పి. కి పంపారు. బెంగుళూర్‌లోని ఐ.జి. కర్ణాటక రాష్ట్రింలోని డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్ స్టేషన్‌లకి పంపాడు ఆ రిపోర్ట్. నాగపూర్‌నుంచి తిరిగిరాగానే హసన్ డిస్ట్రిక్ట్ పోలీస్ స్టేషన్‌లో నా భార్య ఎవరితోనో లేచిపోయిందని కంప్లెయింట్ ఇచ్చాను. అది తిన్న గోధుమ రొట్టెల వివరాలు వున్నాయి ఆ మెడికల్

రిపోర్టులో.

నే నొక్కడినే నాగపూర్ వెళ్ళానని, తిరిగివచ్చేసరికి లేదని రాసాను కంప్లైయింట్‌లో. అది అబద్ధంఅని తేలింది దాని కడుపులోని ఆహారంవల్ల. నాగపూర్‌లో రొట్టెలు, హసన్‌లో అన్నం తింటారు. ఆ శవం వయసు మొద లయినవి భర్తకి సరిపోతాయి. మొత్తంమీద బయటపడింది అంతా. చివరికి నాకు యావజ్జీవ కారాగారశిక్ష వేసారు."

"యావజ్జీవం? అయితే యిక్కడెలా వున్నారు?"

"జైల్లోకి అడుగుపెట్టిన రోజు అనుకున్నాను తప్పించుకోవాలని. తప్పించుకున్నాను. నన్ను పట్టుకున్న సబిన్‌స్పెక్టర్‌ని చంపాలి. ఆ హత్య నా స్వంత బుర్ర వుపయోగించి చేసాను. ఇప్పుడతని శవం ఓ డ్రమ్ములోని తారులో గట్టిపడి నర్మదానదిలో మునిగివుంది. మూడోది నీ పని. చంపాక నీ శవాన్ని తారుడ్రమ్ములో వేసి దాన్ని హుస్సేన్‌సాగర్‌లో పారేస్తే చాలు."

"దేనికి నన్ను చంపడం?" నవ్వుతూ అడిగాడు వెంకట్ ట్రేలో కాఫీ కప్పులు సర్దుతూ.

"ఇలాంటి కథలు బాధ్యతారహితంగా రాసి దేశంమీదికి వదిలితే, నాలాంటి వారికి నేరాలు యెలా చేయాలో నేర్పి నట్లవుతుంది. కాబట్టి, నీ కథ చదివి, మెచ్చుకుని, ఇన్-స్పయిర్ అయి, ఆ హత్య చేసివుండకపోతే నా భార్యకి విడాకులు ఇచ్చి, ఇంకో వివాహం చేసుకునేవాడిని. కేవలం ఆ కథ, ఆ ఒక్క కథవల్ల, నీ కలంనుంచి వచ్చిన ఆ కథవల్ల నా జీవితం పాడుచేసుకున్నాను.

"మీరు హత్యచేసే వుద్దేశంలో నన్ను సంప్రదించి వుంటే, నేను ఆ కథలో లాగా చేయమని సలహా ఇచ్చి వుంటే, నా సలహా ఆచరించాక పట్టుబడితే, అప్పుడు నేను

నిజంగా బాధ్యుణ్ని అయేవాడిని. మీరు హత్య చేస్తారనే, చేయాలనే వుద్దేశంతో వ్రాయలేదా కథని నేను."

"కాని అపరాధపరిశోధన గురించి పూర్తిగా తెలియకుండా ఇలాంటి కథలు రాయడం నీ తప్పు. పోస్ట్‌మార్టమ్ చేసేటప్పుడు ఎలాంటి క్లూలు దొరుకుతాయో కూడా తెలుసుకుని రాసివుండాల్సింది నువ్వు ఆ కథ. అలా జరిగివుంటే నేనింకా జాగ్రత్తపడేవాడిని. అలా చేయనందుకు శిక్ష అనుభవించక తప్పదు."

జేబులోంచి తళతళ మెరిసే స్టీలు కత్తి తీసాడు మంజునాథ్. ఇప్పుడు అతని వుద్రేకం, కోపం ఛాయమాత్రంగా కూడా లేవు మొహంలో. ఓ స్థిరనిర్ణయానికి వచ్చినట్లుగా వుంది అతని మొహం.

"మీరు చంపదలచుకుంటే ఆ పని చేయకమానరు," నవ్వాడు వెంకట్ రెండు కప్పుల్లోకి కాఫీ వంచుతూ.

"నేను జోక్ చేస్తున్నాననుకుంటున్నారా? ఇంత డబ్బు శ్రమ, కాలంవృధాచేసి ఎందుకు మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చినట్లు? మీ రచనలమీద అభిమానంతో మాత్రమే కాదు, కసితో, పగతో, ద్వేషంతో. ఓ చక్కని రచయితని చంపడం-అందులో నా అభిమాన రచయితని-బాధాకరమే అయినా, ఈ పని చేస్తేకాని నాకు శాంతిలేదు."

"అలాగే కాఫీ త్రాగచ్చా నేను?"

కాఫీ ట్రేతో టీపాయ్‌వైపు వచ్చాడు వెంకట్ చిన్నగా ఈలవేస్తూ. మంజునాథ్ లేచి నిలబడ్డాడు అప్రమత్తంగా, చేతిలో కత్తితో.

"మీరు నమ్మటంలేదు నే చెప్పేది" అసహనంగా అన్నాడు.

"నమ్ముతున్నాను. కాఫీ తాగండి" గలగలా నవ్వాడు

వెంకట్.

వెంకట్ కాఫీ చప్పరిస్తూ, అతని చేతిలోని కత్తివంక చూడసాగాడు వచ్చే నవ్వును ఆపుకునే ప్రయత్నంచేస్తూ.

మంజునాథ్ కప్పు అందుకుని రెండుగుక్కలు తాగి చెప్పాడు.

"హాసన్ జిల్లాలో కాఫీ ఎస్టేట్లు ఎక్కువ. అక్కడ కాఫీ చాలా బావుంటుంది. ఫ్రెష్ ఫ్రమ్ ఓవెన్...."

"నన్ను చంపాక ఏం చేద్దా మనుకుంటున్నారు?"

"ఈ ఇంట్లోని ఖరీదయిన వస్తువులు, డబ్బు తీసుకు వెళ్తాను. డబ్బుకోసం హత్య జరిగిందనుకుంటారు. ఆ తర్వాత గుజరాత్ రాష్ట్రంలోని ఓ చిన్న వూళ్లో కొత్త జీవితం ఆరంభిస్తాను. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకొన్నాను."

కాఫీ పూర్తిచేసి కప్పు టీపాయ్‌మీద వుంచాడు మంజునాథ్. వెంకట్ కొన్ని క్షణాల తర్వాత తన కాఫీ కప్పుని కూడా టేబిల్ మీద వుంచాడు.

"మీరు సిద్ధమేనా?"

మంజునాథ్ లేచి నిలబడ్డాడు కత్తి గట్టిగా పట్టుకుని. కాళ్లు నేలమీద నిలవలేదు, గాల్లో తేలిపోతున్నట్లుగా అనిపించింది.

"ఏం చేసా....?"

అంతే! స్పృహ తప్పింది మంజునాథ్‌కి. కొన్ని క్షణాల్లో నేలమీదకి వాలిపోయాడు.

నేలమీద పడివున్న మంజునాథ్ వంక చూసాడు వెంకట్. కొన్ని క్షణాలు చిన్నగా నవ్వుకున్నాడు. తర్వాత టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి రిసీవర్ ఎత్తి, ఓ నంబర్ డయల్

చేసి, తన ఇంటి చిరునామా చెప్పి వెంటనే రమ్మని చెప్పాడు.

పావుగంట తర్వాత పోలీసులు వచ్చారు. తనని రిటైర్డ్ జిల్లా జడ్జిగా పరిచయం చేసుకున్నాక జరిగింది వివరంగా చెప్పాడు వెంకట్.

"ఇతను చెప్పిన దంతా నిజమో, కాదో తణిఖీచేస్తాం. కాని ఎలా స్పృహ తప్పాడు?"

"మార్ఫియాలా త్వరగా పనిచేసే మత్తు పదార్థం కాఫీలో కలిపి ఇచ్చాను."

"మీ దగ్గర సిద్ధంగా ఎప్పుడూ వుంచుకుంటారా ఆ మందు?"

చిన్నగా నవ్వాడు వెంకట్.

"అయిదేళ్ళ క్రితం రిటయిర్యే రోజు ఓ వ్యక్తికి ఏడేళ్ళ కఠిన శిక్ష వేసాను. 'నే బయటికి వచ్చాక, 'నువు బ్రతికివుంటే నిన్ను తప్పక చిత్రవధచేసి చంపి తీరుతాను' అని బెదిరించాడు. నా సర్వీస్‌లో అలా చాలామంది బెదిరించారు. కాని అతను మాత్రం కోపంగా బెదిరించలేదు. చాలా ప్రశాంతంగా శపథంచేసి వెళ్ళాడు.

జైల్లోంచి విడుదల అవగానే అతను చేసే మొదటి ప్రయత్నం నే నెక్కడున్నానో కనుక్కోవటం. అందుకని నేను ఎక్కడుంటున్నానో ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడుతున్నాను ఇన్నాళ్ళు.

ఒకవేళ అతను ఎలాగయినా నా వునికి తెలుసుకుంటే నన్ను నేను రక్షించుకోడానికి కొన్ని కప్పుల్లో ఆ మత్తు మందుని పోసి వుంచాను. దాంట్లో వేడికాఫీ పోస్తే ఆ మందు కాఫీలో కరిగి అది తాగిన వ్యక్తిని నిముషంలో స్పృహ తప్పిస్తుంది.

మృత్యువు అకస్మాత్తుగా మంజునాథ్ రూపంలో వెదుక్కుంటూ వచ్చింది నన్ను. కాని ఓడిపోయింది. మంజునాథ్ నాకు ఓ విధంగా మేలు చేసాడు. నా వునికి గురించి మంజునాథ్ తెలుసుకున్న విధంగా ఇకముందు ఎవరూ నన్ను కలుసుకోకుండా తగిన ఏర్పాట్లు చేసుకుంటాను."

మంజునాథ్‌ని పోలీసులు తీసుకువెళ్ళాక తన బల్లముందు కూర్చుని వెంకట్ అంతకుముందు తను వ్రాస్తున్న డిటెక్టివ్ కథలోని డిటెక్టివ్‌ని లిఫ్టులో వదిలేసి, ఆ కాగితాలని ఫైల్లో వుంచి, కొత్త కథకి ప్లాట్ దొరకడంతో వుత్సాహంగా ఆ కథ వ్రాయడం మొదలు పెట్టాడు. ★

గాడిదను వదిలేస్తే—?

ఇద్దరు కుర్రవాళ్ళు ఒక గాడిదను చెరొకవైపునా గట్టిగా పట్టుకొని నడిపించుకొస్తున్నారు.

దారిలో ఒక చెట్టుక్రింద కొంతమంది సైనికులు మాట్లాడుతూ, నవ్వుతూ వచ్చిపోయే వాళ్ళను అల్లరి పట్టిస్తున్నారు. గాడిదను అంత గట్టిగా పట్టుకొస్తున్న ఆ కుర్రాళ్ళను చూసి హేళనగా "గాడిదను అంత జాగ్రత్తగా పట్టుకొస్తున్నారు, గాడిదంటే ఎంత ప్రేమ మీకు," అన్నారు.

దానిని అంత గట్టిగా పట్టుకోటానికి కారణం చెపుతూ "మేము ఈ గాడిదను ఒదిలేస్తే పోయి సైన్యంలో చేరుతుందని మా భయం." అన్నారు కుర్రవాళ్ళు.

అంతే! సైనికుల నోరు ఠక్కున మూతపడింది.

—కాకరపర్తి సుబ్రహ్మణ్యం, తెనాలి.

హంతకుల వేట

సుజనశ్రీ

సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంది.

నెల్లూరు బస్‌స్టాండ్ దగ్గర ఇద్దరు యువకులు రోడ్డు మీద నిలబడి వున్నారు. వచ్చే పోయే టాక్సీలను పరీక్షగా చూస్తున్నారు.

ఖాళీగా వస్తున్న ఓ టాక్సీ కనుపించింది.

“ఏయ్ టాక్సీ,” అని అరిచాడు మొదటి యువకుడు.

కుదుపుతో టాక్సీ ఆగింది. మొదటి యువకుడు డోర్ తెరచి డ్రైవర్ ప్రక్కనే కూర్చున్నాడు. రెండో వ్యక్తి వెనుక సీట్లో కూలబడ్డాడు.

“పోనీయ్!” అన్నాడు మొదటి యువకుడు.

ఎక్కడికి అని అడగలేదు డ్రైవర్. ఇలాంటి బాడుగలు అతడికి పరిపాటే! ఎక్కడికో చెప్పకుండానే టాక్సీలో ఎక్కేస్తారు చాలామంది. సగం దోవలో కుడిచేతి మలుపు త్రిప్పు అనో, లేక ఫలానా చోటికి వెళ్ళమనో అంటారు.

జనరల్ హాస్పిటల్, 'నిప్పో' డ్రైసెల్ ఫ్యాక్టరీదాటింది టాక్సీ. క్రమేపీ నెల్లూరు పట్టణం దూరమవుతోంది.

“ఎందాకా వెళ్ళాలి!” సిగరెట్ వెలిగించుకుంటూ అడిగాడు డ్రైవరు.

“వేదాయ పాళెం స్టేషనుకు ఇవతలే ఆ ఆ!” వెనుక సీట్లో వ్యక్తి చెప్పాడు.

ఇద్దరు యువకులూ, అధునాతనంగా వున్నారు. పొడుగ్గా, బలంగా వున్నారు గూడా! మెడమీదకు వ్రేలాడే గిరజాల జుట్టూ, బెల్ బాటమ్ ప్యాంట్లూ, చేతికి ఉంగరాలూ, ఖరీదైన వాచీలూ. సంపన్నుల కుటుంబానికి చెందిన వాళ్ళలాగే వున్నారు.

"వేదాయపాళెం స్టేషనుకు ఇవతల రోడ్డు కిరువైపులా నరసంచారం లేని బయలు ప్రదేశాలు. అక్కడ మీకేం పని," డ్రైవర్ ఆసక్తిగా అడిగాడు.

"చెప్పరా వేణూ!" వెనుక సీట్లో యువకుడు అదమాయించాడు.

"వేదాయపాళెం ఊళ్ళోనుంచి, మా కోసం ఒక అమ్మాయి వస్తానంది." వేణూ చెప్పాడు.

డ్రైవర్ సన్నగా ఈల వేశాడు. "మీ రిద్దరున్నారు. ఒకమ్మాయేనా?" ఆసక్తిగా అడిగాడు డ్రైవర్.

"ముందు మా సుందరమే దాన్నివలలో వేసుకున్నాడు, తర్వాత ఇద్దరం వాడుకుంటున్నాం." వేణు గర్వంగా చెప్పాడు.

"నీపేరు వేణూ అన్నమాట! నీ స్నేహితుడి పేరు సుందరం అన్నమాట? బాగున్నాయి పేర్లు."

"మరి నీ పేరో?" సుందరం డ్రైవర్నుద్దేశించి అడిగాడు.

"నాపేరు రాఘవులు!"

కారు రోడ్డుదిగి, నిర్మానుష్యంగా వున్న ఆరు బయలు ప్రదేశంలో కొంతదూరం పరుగెత్తింది.

"కారాపు!" అన్నాడు వేణు.

"ఏదీ! మీ లవర్ వచ్చినట్టు లేదే?" కారు ఆపుతూ చుట్టూ కలయజూశాడు డ్రైవర్ రాఘవులు.

ముగ్గురూ కారు దిగారు.

వేణుచుట్టూ ఒకసారి పరికించి చూశాడు. అతడిచేతిలో తళతళ మెరిసే కత్తి ప్రత్యక్షమయింది. ఆ కత్తిని రాఘవులు డొక్కకు ఆనించాడు వేణు.

సుందరం ఆసక్తిగా చూస్తూ నిలబడ్డాడు.

డ్రైవర్ రాఘవులు ఉలిక్కిపడ్డాడు.

"ఏయ్? ఏమిటిది? నాతో పరాచికా లాడుతున్నారా?" డ్రైవర్ కోపంగా అరిచాడు.

"పరాచికాలు కాదుబే! నిన్ను పరలోకానికి పంపిస్తాం." అన్నాడు వేణు కత్తిని ఇంకా కొంచెం గట్టిగా ఆనిస్తూ.

"అయ్యో! గట్టిగా పొడవకండి! నొప్పి పుట్టదూ? నేను మీకేం అపకారం చేశాను? నన్ను వదలండి! కావాలంటే ఈ కారునిగూడ ఎత్తు కెళ్ళండి. నన్ను మాత్రం చంప వద్దు." రాఘవులు గొల్లుమన్నాడు.

"మాకు కారు అక్కరలేదు!" వేణు వికటంగా నవ్వాడు.

సుందరం అతడితో శృతి కలిపాడు.

"మరేం కావాలి? డబ్బా? నా దగ్గర జేబులో రెండు వందలుంది? అది తీసుకోండి! డబ్బూ. కారూ ఈ రెండు తీసుకోండి. నన్ను మాత్రం చంపద్దు!"

"నీ కారూ వద్దూ! నీ డబ్బూ వద్దు. మాకు ఎడ్వెంచర్ కావాలి." సుందరం ఆనందంతో చెప్పాడు.

"అంటే! మీ రనేది నాకర్థం కావటం లేదు." రాఘవులు అయోమయంగా చూశాడు.

"సినిమాల్లో చూడటంలా? పేపర్లలో సంఘటనలు చదవటం లేదూ? ఈ రోజుల్లో యువకులకు సాహసోపేత మైన కార్యాలంటే ఇష్టం. అవతల వాళ్ళను హింసించి

చంపటం, ఆడవాళ్ళను చెరచటం! మా ఇద్దరికీ ఎవరినైనా హత్య చేయాలని ఆరాటం కలిగింది. సమయానికి నీవు దొరికావు. అది నీ ఖర్మ!" వేణు కత్తిని ఇంకా గట్టిగా పొడుస్తూ చెప్పాడు.

రాఘవులు ఆశగా చుట్టూ కలయజూశాడు, తన ప్రాణాలు కాపాడగలిగిన మనిషి ఎవరన్నా కనుపిస్తారేమో అని. కానీ అతడి ఆశ నిరాశే అయింది. కనుచూపు మేరలో ఏ ప్రాణీ కనుపించలేదు.

"అబ్బే. మీ విషయం ఎక్కడా పొక్కనివ్వను. జీవితాంతం మీకు ఋణపడే వుంటాను. కారూ, డబ్బూ మీరే వుంచుకోండి. కావాలంటే నేనీ రాష్ట్రాన్నే వదిలేసి పోతాను. నన్ను చంపకండి." రాఘవులు మళ్ళీ ప్రాధేయ పడసాగాడు.

"ఒరేయ్! నీ నక్కవినయాలు నా దగ్గర కాదురా? ఆ బ్రహ్మ రుద్రులు అడ్డం వచ్చినా, నిన్నిపూట వదిలేది లేదు. ఇంక నీ దబ్బంటావా? సుందరం నాన్న అనేక లక్షలకు అధిపతి! వాళ్ళనాన్న పెద్ద బిజినెస్ మాగ్నెట్. నెల్లూరులో జనార్ధన రావుకి ఎన్ని మేడలూ, ఎన్ని వ్యాపారాలున్నాయో తెలియని వాళ్ళు లేరు." వేణు ఉత్సాహంగా చెప్పుతూ పోతున్నాడు.

"ఏయ్ ఫూల్! ఇందులో మా నాన్న పేరెత్తుతావెందుకు? ఇంతవరకు మనం ఎవరమో, ఈ డ్రైవర్‌కి తెలీదు. ఇప్పుడు అతనికి మన పూర్తి అడ్రసు తెలిసి పోయింది గదరా?" సుందరం గద్దించాడు వేణుని.

"తెలిస్తే మాత్రం వీడేం చేయగలడు. మరో కొద్ది నిముషాల్లో వీడి బొందిలో ప్రాణాలు విశ్వంలో కలిసి పోవూ?"

"బాబ్బాబూ! మీ కాళ్ళకు మ్రొక్కుతాను. నాకు అవతల భార్యా బిడ్డలున్నారు. వాళ్ళు దిక్కులేని వారయిపోతారు. మీ గురించి సర్వం మరచిపోయి బ్రతుకుతాను, నన్ను వదిలి పెట్టారంటే! మీ పేర్లు మీ నాన్న పేరూ అసలు నేను విన లేదు అనుకోండి!" రాఘవులు కాళ్ళు పట్టుకునే పర్యంత మయాడు.

వేణు గలగల నవ్వాడు.

"ఒరేయ్ టాక్సీ డ్రైవరూ? ఇంకా దీనాతిదీనంగా, హృదయ విదారకంగా ఏడవరా? ఒక్కో కత్తి పోటుకు ఒక్కోరకంగా అరవరా!

"ఇంతకీ సుందరం! మన ఆట ఎలా మొదలెట్టేది? చేతి వ్రేళ్లు ఒక్కొక్కటే కోసి పారేయాలా? లేక మర్మా వయవాల్లో పొడవాలా? కంఠంలో కొంచెం కొంచెంగా గాయంచేసి, అందులోనుంచి కారేరక్తాన్నిచూసి ఆనందిం చాలా? చెప్పరా చెప్పు!"

డ్రైవర్ భయంతో తన ముఖాన్ని అరచేతుల్లో దాచు కున్నాడు. "అయ్యో? నన్ను హింసించకండి! కావాలంటే ఒక్కసారే చంపేసి, మీ రక్త పిపాసను తీర్చుకోండి."

"అంత తేలిక చావుకు నీవు నోచుకో లేదురా! నీ చేతి వ్రేళ్ళను తెగ నరుకుతాం ముందు! నా జేబులో ఒకటి, సుందరం జేబులో ఒకటి వేసుకుని గర్వంగా తిరుగుతాం. మేం చేయబోయే తర్వాతి హత్యలకు అవే ఇన్స్పిరేషన్ ఇస్తాయి."

"మీరు మనుషులు కాదు! నరరూప రాక్షసులు?"

వేణు చేతిలోని కత్తి డ్రైవర్ కాకీ చొక్కాని సర్రున చీల్చుకుని చర్మంలో గుచ్చుకుంది.

"అయ్యో! నన్ను రక్షించండి! నన్ను కాపాడండి! నా

కారూ, నా డబ్బూ, వాచీ, ఉంగరం అన్నీ మీవే! నన్ను హింసించకండి! నా ప్రాణాలు తీయకండి?" రాఘవులు అతి దీనంగా ఏడుస్తున్నాడు. అతడి కళ్ళవెంట నీరు ధారగా కారుతోంది.

"ఓరి బడుద్ధాయీ! నీ కారూ నీ డబ్బునీ మా కేవో దానం ఇస్తున్నట్టుగా మాట్లాడతావేం! నిన్ను చంపేశాక అవీ ఎటూ మావే అవుతాయి గదా?"

"అలా కాదండీ! నన్ను ఎటూ చంపేయబోతున్నారు గదా! చావబోయే వాడి ఆఖరి కోరిక తీర్చటం న్యాయం. నా దగ్గరున్న డబ్బుని నాచేతి మీదుగా మీకు అందజేయా లనేదే నా కడసారి కోరిక."

"సరే! అదేదో త్వరగా ఏడువు! నిన్ను కసి దీరా చంపేయాలి, ఇంకేమాత్రం ఆలస్యం కాకుండా!"

రాఘవులు పర్సుకోసం ప్యాంటు జేబులో చెయ్యి పెట్టాడు. అతడిచేయి మళ్ళీ బయటకు వచ్చినప్పుడు నల్లని పిస్తోలు మెరుస్తోంది అతడి చేతిలో! హెచ్చరిక గూడ చేయకుండా "ఢాం! ఢాం! ఢాం!" అని మూడుసార్లు పేల్చాడు వేణుకి గురిపెట్టి.

"అమ్మా!" అంటూ వేణు ఛాతీమీద చేతులతో వత్తు కుంటూ నేల కూలాడు. రెండు సార్లు పొర్లి పల్లంగావున్న గడ్డి బీడులోకి దొర్లాడు. అతడి చేతులనిండా రక్తం!

సుందరం అవాక్కయి పోయాడు.

"ఏం వీరుడా! ఇక చెప్పు! నిన్నే విధంగా చిత్ర హింస చేసి చంపాలో! ఇందాకట్నుంచి నన్ను భయపెట్టి చంపారు. ఇప్పుడది నావంతు." అన్నాడు రాఘవులు పిస్తోలుని సుందరానికి గురిచేసి.

సుందరం గజ గజ లాడాడు. "ఇదుగో రాఘవులూ!

నీకు అన్యాయం వుంటుంది. న....నన్ను చంపకు."

రాఘవులు పకపక నవ్వాడు. "ఏం! మీ ప్రాణాలయితే అంత తీపిగదూ! సరే! నిన్ను చంపను! కానీ అందుకు నీవు జరిమానా చెల్లించవలసి వుంటుంది.

"వేణు కత్తితో నన్ను చంపటానికి యత్నించాడు నీ ప్రోత్సాహంతో! ఆత్మ రక్షణార్థం నేను వేణుని కాల్చి చంపాను. చచ్చి, వాడు బ్రతికిపోయాడు. నీవు బ్రతికి యావజ్జీవతం జైల్లో మ్రగ్గుతావు. నీలాంటి ధనికుల బిడ్డ, ఎంతో అభివృద్ధిలోకి రావలసినవాడు ఇలా శిక్షింపబడడం నాకు చాలా జాలి కలిగిస్తోంది."

"రాఘవులూ! నీ కాళ్ళకు మ్రొక్కుతాను! అంత పని చేయకు! నన్ను రక్షించు!"

"అందువల్ల నాకేం జరుగుతుంది. పోనీ నేను చెప్పినట్టుగా చేస్తే నిన్ను రక్షించగల మార్గంవుంది." రాఘవులు గర్వంగా అన్నాడు.

"ఏమిటది?" సుందరం ఆశగా చూశాడు.

"పాతికవేల రూపాయలు యిప్పించు."

"అమ్మో! పాతికవేలే? నన్ను చంపినాసరే మా నాన్న అంత డబ్బు యివ్వడు."

"పోనీ పదివేలు!"

"లాభం లేదు."

"అయితే నడు పోలీస్ స్టేషన్‌కి!" సుందరం జబ్బ పట్టుకుని లాగాడు రాఘవులు.

"ఆగు!....మా ఇంటికి వెళదాం పద! అలాగే నీవు కోరిన డబ్బు ఇప్పిస్తాను."

ఇద్దరూ పట్టి శవాన్ని డిక్కీలో పడేశారు.

కారు మళ్ళీ బయలుదేరింది. ట్రంక్ రోడ్డులో ఒక

కిళ్లీ బంకుదగ్గర ఆపాడు రాఘవులు. టాక్సీ అరలోంచి ఏదో వస్తువుని తీసి బంకు యజమానికి ఇచ్చి చిన్నగా ఏదో మాట్లాడాడు.

మళ్ళీ టాక్సీ కదిలింది. అయిదు నిముషాలు ప్రయాణించి, పెద్ద బంగళాముందు ఆగింది.

రాఘవులు, సుందరం ఇద్దరూ లోపలకు నడిచారు.

"నువ్వు ఇక్కడే హాల్లో కూర్చో! ముందు నేను మా నాన్నతో మాట్లాడి ఒప్పించి వస్తాను." సుందరం తండ్రి గదివైపు నడిచాడు.

"త్వరగా! పిచ్చివేషాలు మాత్రం వేయకు!" హెచ్చరించాడు రాఘవులు.

2

ప్రక్క గదిలోంచి మాటలు వినిపిస్తూన్నాయ్ హాల్లోకి. సుందరం జరిగినదంతా ఏడుస్తూ తండ్రికి చెప్పాడు. సుందరం తండ్రి జనార్ధనరావు కోపంతో కేక లేస్తున్నాడు.

సుందరం బయటకువచ్చి హాల్లో కూర్చున్న రాఘవుల్ని లోపలకు రమ్మని సైగచేశాడు.

రాఘవులు గదిలోకి వెళ్లాడు సుందరం వెనకనే.

సోఫాకి నిండుగా, లావుపాటి వ్యక్తి కూర్చుని ఉన్నాడు నోట్లో సిగరెట్టుతో.

"ఏమోయ్! నీవు చేస్తున్నదేమిటో తెలుసా? బ్లాక్ మెయిల్ చెయ్యాలని ప్రయత్నిస్తున్నావు?" జనార్ధనరావు గుచ్చి చూస్తూ అడిగాడు రాఘవుల్ని.

"మీరలా అపార్థం చేసుకుంటే నేను చెప్పేదేమీ లేదు. మీ అబ్బాయి బంగారు భవితవ్యం ముందు పదివేలు ఏపాటి?" రాఘవులు ధైర్యంగా చెప్పాడు.

"వాడ్ని అసలు నేనే జైలుకు పంపుదామనుకున్నాను.



నా కొడుక్కి లేని వ్యసనంలేదు. నా కడుపున చెడ బుట్టాడు. వీడు హత్య చేయబడినా, నా పరువు దక్కేది."

సుందరం కళ్ళవెంట అశ్రుధారలు కారుతున్నాయ్.

"త్రాగుడూ, వ్యభిచారం ఇవి చాలక హత్యలకు గూడ దిగాడు నా కుమారుడు. ఒరేయ్! నీకెటూ పరువులేదు. నీ తండ్రి పరువు నిలపటానికైనా ఇలాంటిపనులు మానరా!" జనార్ధనరావు పళ్ళు కొరికాడు సుందరం వంక చూస్తూ.

"మీ పరువు ప్రతిష్ఠలు నిలబెట్టాలనే గదా నేను మీ వద్దకు వచ్చింది! లేకపోతే ఈపాటికి మీ కుమారుడు జైల్లో వుండేవాడు" రాఘవులు గర్వంగా చూశాడు.

"అందుకు ప్రతిఫలం పదివేలా? ఉన్నపళాన అంత డబ్బు ఎక్కడ్నుంచి తేగలను? కొంచెమన్నా వ్యవధి కావాలిగదా?" జనార్ధనరావు గునిశాడు.

"అలా బుకాయించకండి. వ్యాపారస్థులవద్ద రహస్యపు అరల్లో బ్లాక్‌మనీ వుండి తీరుతుంది. బ్లాక్ మెయిల్‌కి బ్లాక్ మనీ! హ్హాహ్హా!" రాఘవులు నవ్వాడు.

"అంటే నేను అక్రమ వ్యాపారం చేస్తున్నాననంటావా?

ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా ఎగవేస్తున్నానంటావా?"

"ఎంతమాట! మిమ్మల్ని మీరలా కించపరుచుకోవటం బాగులేదు. త్వరగా మనపని పూర్తిచేసుకుని విడిపోవడం మంచిది."

"అసలు నీకు డబ్బు ఎందుకివ్వాలోయ్! నా కొడుకు ఉదయంనుంచీ ఇంట్లోనే వున్నాడని పోలీసులకు నిరూపిస్తాను దాంతో నీ ఆటకట్టు!" జనార్ధనరావు బుకాయించాడు.

"తొందర పడకండి సార్! మీరలా బెదిరిస్తారని తెలిసే నేను ముందు జాగ్రత్తపడ్డాను. నా కారు డాష్ బోర్డులో మినీ టేప్‌రికార్డర్ వుంది. మీ కుమారుడూ అతడి స్నేహితుడూ కలిసి నా టాక్సీలో ఎక్కిన దగ్గర్నుంచీ, వేణు చనిపోయిందాకా జరిగిన సంభాషణంతా అందులో రికార్డు చేయబడింది. దాన్ని నా స్నేహితుడి దగ్గర పదిలం చేసి మరీ వచ్చాను.

జనార్ధనరావు ముఖం తేలవేశాడు. సోఫాలోంచి లేచి లోనికి వెళ్ళాడు. మళ్ళీ వచ్చేటప్పుడు అతని చేతిలో నోట్ల కట్ట లున్నాయ్.

"ఇదిగో డబ్బు! ఇక వెళ్లు ఇక్కడ్నుంచి తక్షణమే!"

రాఘవులు ఆ డబ్బు అందుకుని టాక్సీలో ఎక్కాడు. కొంతదూరం పోయాక ఒక సందులో కారాపాడు.

డిక్కీ తెరిచి "ఒరేయ్ వేణూ! నీ ప్లాన్ సక్సెస్! లే లే!" అన్నాడు రాఘవులు.

డిక్కీలోంచి హుషారుగా వేణూ బయటకు దూకాడు. అతడి చేతులకూ, చొక్కాకూ ఎర్రరంగు బాగా పులుముకుని ఉంది.

ఇద్దరూ కార్లో కూర్చుని డబ్బుని తడిమి చూసుకున్నారు.

"పదివేలు! చాలా తక్కువలో పోయాం అనుకుంటా!

పాతికవేలు అడిగివుంటే బాగుండేది." వేణు వుసూరు మంటూ అన్నాడు.

"ఓరి పిచ్చి సన్నాసి! మన డబ్బు బ్యాంకులో ఉన్నట్టే అనుకో! మనకు డబ్బు అవసరం అయినప్పుడల్లా జనార్ధనరావుని బెదిరించి డబ్బు గుంజుతూ వుండచ్చు!" రాఘవులు నవ్వుతూ చెప్పాడు.

"అదీ నిజమేలే! అన్నట్టు వేదాయిపాళెం దాకా వెళ్ళి వద్దాం పద! నా కత్తి అక్కడ పడిపోయింది. అది ఎవరి కాన్నా దొరికితే ప్రమాదం. ఆ కత్తిమీద నీ పేరేవుంది."

"అలా ఎందుకు చేశావ్! సరే పద!"

3

టాక్సీ నిర్మానుష్యంగా వున్నచోట ఆగింది. వేణు కత్తికోసం చీకట్లో వెదుకుతున్నాడు. రాఘవులు గూడ అతడివెంటే ఉన్నాడు.

వేణు వెనక్కు తిరిగాడు.

"దొరికిందా కత్తి?" రాఘవులు అడిగాడు.

"ఆఁ!" అన్నాడు వేణు. అతడి చేతిలో పిస్తోలుంది.

"ఏమిటిది? సుందరం ముందర నాటకం ఆడినట్టుగా మళ్ళీ తమాషా చేస్తున్నావా?"

"అది తమాషా! కానీ ఇదిమాత్రం నిజం! త్వరగా దేవుణ్ణి తల్చుకో!"

"ఈ పదివేలూ నీవే కొట్టేయాలని నన్ను చంపు తున్నావా?"

"కాదు! నీతో చేతులు కలిపి, సుందరంని ఇరికించి, అతడి తండ్రిని బ్లాక్‌మెయిల్‌చేసి డబ్బు గుంజాం! అంత వరకే నీకు తెలిసింది. కానీ వాస్తవానికి నేనూ సుందరం కలసే ఈ పథకం వేశాం. ఇప్పుడు నిన్ను చంపి, జనా

ర్ధనరావు ఇంటికి నీ శవాన్ని చేరవేస్తాను.

"అక్కడ ఈపాటికి సుందరం తన తండ్రిని చంపేసి వుంటాడు. అదీ నీకత్తితో. ప్రపంచానికి ఏమని చెప్తామో, తెలుసా! నీవు డబ్బు దొంగిలించటానికి జనార్ధనరావుని కత్తితో పొడిచావనీ, చనిపోతూ జనార్ధనరావు పిస్తోలు కాల్చగా, ఆ షాట్‌కి నీవు ప్రాణాలొదిలావని, చెబుతాం! అర్ధమైందా? ఈ సాయం చేసినందుకు వేణు నాకు యాభై వేలిస్తానన్నాడు."

"ఓరి రాస్కెల్! అందుకే కిరాయి మనుష్యుల్ని నమ్మగూడదన్నారు. నాతో కలిసి సుందరంని కేసులో ఇరికిస్తున్నట్టే నటిస్తూ, అవతల సుందరంతో లాలూచీ అయినావా? నీవు రెండు నాలుకల పాముని. డబుల్ క్రాస్! నీ చేతిలో ఉన్నది దీపావళి పిస్తోలుకాదూ?"

"అది నీ జేబులోనే వుంది చూసుకో? ఈ పిస్తోలు జనార్ధనరావుది! సుందరమే ఇచ్చాడు నాకు!" అంటూ వేణు రెండుసార్లు ప్రేల్చాడు గురిచూసి.

రాఘవులు కీచుగా అరుస్తూ నేలకూలాడు.

వేణు, రాఘవులు శరీరం చుట్టూ ప్లాస్టిక్ కాగితం చుట్టి, డిక్కీలోని ట్రంకులో పెట్టాడు. టాక్సీని వెనక్కి మరల్చి, జనార్ధనరావు బంగళాకు చేరుకున్నాడు వేణు.

సుందరం అతడికోసమే ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు.

"పని పూర్తయిందా?" వేణుని అడిగాడు సుందరం.

"అంతా సవ్యంగా జరిగిపోయింది. నో ట్రబుల్!"

"నేనూ ఇప్పుడే నా తండ్రిని స్వర్గానికి పంపాను."

వేణూ, సుందరం ఇద్దరూ కలసి రాఘవులు శవాన్ని జనార్ధనరావు గదిలో బోర్లా పడుకోబెట్టారు. రాఘవులు

కత్తిని తెచ్చి అతడి చేతిక్రింద వుంచారు.

ఎదురుగా జనార్ధనరావు శవం వుంది. కత్తిపోట్లకు అతడు అంతకుముందే మరణించాడు.

ఆ గదిలో రెండు శవాల్ని పోలీసులు అనుమానించేలా సర్దారు. ఇనప్పెట్టె తెరచి వుంచారు. కొన్ని నోట్లను చిందర వందరగా పడేశారు.

వేణు తృప్తిగా నవ్వాడు. "ఇక నే వెళ్తాను, నా మిగతా పైకం ఇప్పిస్తే!"

"ఇలాగే ఇస్తాను. మా నాన్న పిస్తోలు ఏదీ?"

వేణు పిస్తోలుని సుందరానికి అందించాడు. సుందరం నాలుగడుగులు వెనక్కువేసి వేణుని గురిచూసి కాల్చాడు.

"ఏమిటిది? నన్నూ చంపుతున్నావా?" అంటూ వేణు నేల కొరిగాడు.

"లేకపోతే! నేను చేసిన హత్యా రహస్యం తెలిసిన వ్యక్తి బ్రతికివుంటే, నాకు వాడెప్పుడూ ప్రక్కలో బల్లెమే. అనుక్షణమూ వాడిచేతిలో నేను బ్లాక్ మెయిల్ చెయ్యబడడం నా కిష్టముండదు" అంటూ సుందరం పక పక నవ్వాడు.

టెలిఫోన్ దగ్గరకు నడిచి పోలీస్ స్టేషనుకు ఫోన్ చేశాడు.

రిసీవర్ని క్రేడిల్‌మీద పెట్టేశాడో, లేదో గదిలోకి పోలీసులు ప్రవేశించారు?

"అరె! ఏమిటి? ఎంత ప్రాంప్టుగా వచ్చేశారు? ఇలా ఫోన్ చేశానో లేదో, అప్పుడే వాకిట్లో ప్రత్యక్షమయారే?" సుందరం ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"మిస్టర్ సుందరం! నిన్ను అరెస్టు చేస్తున్నాం!" ఇన్‌స్పెక్టర్ కోపంగా చూశాడు.

"అదేమిటిసార్! అసలు సంగతి వినకుండానే హంత కుడ్ని నిర్ణయించేశారా? ఇంతకీ ఏంజరిగిందంటే, నేను అవతల గదిలో కూర్చుని చదువుకుంటున్నాను.

"బహుశా ఈ టాక్సీ డ్రైవరూ, అతడి అనుచరుడు, మా నాన్నను బెదిరించి డబ్బు దోచుకోవాలని యత్నిం చారు కాబోలు! మా నాన్న పిస్తోలుతీసి ఒకడ్ని కాల్చా డేమో! పిస్తోలు శబ్దం విని నేను పరుగెత్తుకొచ్చాను.

"అప్పటికే రెండోవాడు మా నాన్నను కత్తితో పొడిచి, ఇనప్పెట్టెను తెరిచాడు. నేను మా నాన్న దగ్గరే పడివున్న పిస్తోలు తీసుకుని ఆ రెండో ఆగంతకుడ్ని కాల్చాను, వాడూ నన్ను చంపగలడని, ఆత్మరక్షణార్థం! వెంటనే మీకు ఫోన్‌చేశాను" సుందరం వివరించి చెప్పాడు.

"అబద్ధాలు చెప్పి ప్రయోజనంలేదు మిస్టర్! టాక్సీ డ్రైవరు తన టేప్ రికార్డరును సిగరెట్ బంకులో వుంచి వచ్చాడు. ఎంతసేపటికీ అతడు రాకపోవటంతో, బంకు యజమాని రికార్డర్‌ని ఆన్‌చేసి విన్నాడు.

"టాక్సీ డ్రైవర్‌ని మీరు చంప యత్నించడం తదు పరి సంభాషణని విని కంగారుపడి, టేప్‌రికార్డర్‌ని మాకు తెచ్చి అప్పగించాడు. మేం ఇక్కడకు వచ్చేసరికి వేణు లోపలకు వస్తున్నాడు.

"మేము బయటనే నిలబడి, నీకూ వేణుకీ జరిగిన సంభాషణను టేప్ రికార్డుచేశాం. కుమారుడి సౌఖ్యం కోసం లక్షలు సంపాదించిన తండ్రినే హత్యచేసిన నీవు కిరాతకుడివి. నీలాంటివాడికి శిక్షాస్మృతిలో గూడ సరైన శిక్ష లేదనుకుంటాను" అంటూ ఇన్‌స్పెక్టర్, సుందరం చేతులకు బేడీలు తగిలించాడు. ★

రాత్రి ఝాం

అజీజ్



"ఠంగ్!" మంది గోడ గడియారం.

పుస్తక పఠనంలో పూర్తిగా లీనమైవున్న డాక్టర్

స్వర్గనాథ్ రవంత ఉలిక్కిపడి గోడవైపు చూసేడు.

రాత్రి ఒంటి గంట!

నైట్‌డ్యూటీలో అతనికి నిద్రపోయే అలవాటు లేదు పగలంతా ఇంట్లో నిద్రపోయి వస్తాడు గనుక! పెద్ద పెద్ద నగరాల్లోని జనరల్ హాస్పిటల్స్‌లో తప్పనిసరిగా డాక్టర్లకు నైట్‌డ్యూటీస్ పడుతుంటాయి వంతులవారీగా. ఒక్కొక్కరూ ఒక్కోనెల చొప్పున వరుసగా డ్యూటీస్ ఇచ్చుకోవాలి.

పగలు రెస్టు!

ప్రస్తుతం స్వర్గనాథ్ నైట్‌డ్యూటీ నడుస్తోంది ఆ హాస్పిటల్లో. పగలు ఇంట్లో నిద్రపోయివస్తాడు గనుక, నైట్‌డ్యూటీలో నిద్రాదేవి అతని ఛాయలక్కూడా రావడానికి సాహసించదు.

ఉబుసుపోడానికి పుస్తకపఠనమే అతనికి శరణ్యం! సాయంత్రం వచ్చేటప్పుడు రెండు మూడు నవలలూ గట్రా తెచ్చుకుంటాడు వెంట. చివరిసారి వార్డుల్లో నైట్ రౌండ్ పూర్తిచేసి, రోగుల స్థితిగతులు విచారించి, ఎవరి కే మందు లివ్వాలో నైట్‌డ్యూటీ నర్సులకు పురమాయించి, తన గదిలో చతికిలబడి పుస్తకం అందుకుంటాడు.

ఎంతో సీరియస్ కేసులు వస్తే తప్ప నర్సులతన్ని డిస్టర్బ్ చెయ్యరు. చిన్నగా ఆవులిస్తూ చదువుతున్న పుస్తకాన్ని టేబిల్‌మీద బోర్లించి సిగరెట్ అంటించేడు స్వర్గనాథ్.

సరిగ్గా అదేసమయంలో, ఎవ్వరో ఆఫీస్‌వైపు వస్తున్న బూట్సుల టకటక వినిపించింది. అడుగులు వేసే తీరునిబట్టి గ్రహించేడు వచ్చేది హెడ్‌నర్స్ అని!

స్ప్రింగ్ డోర్స్ కవతల ఆగిపోయింది శబ్దం.

"మే ఐ కమిన్ సర్?"

"ఎస్!"

డోర్స్ కిర్రుమంటూ తెరుచుకున్నాయి. లోనికివచ్చింది నర్సు.

కనుబొమ ఎగరేశాడు స్వర్గనాథ్.

"ఓ ఎమర్జెన్సీ కేసు వచ్చింది డాక్టర్!"

"ఏ కేసు?"

"కారు ఏక్సిడెంట్!"

"బాగా తగిలాయా గాయాలు?"

"ఔను. పేషెంట్ స్పృహలో లేడు. పోలీసులు తీసుకొచ్చారు అంబులెన్స్‌లో!"

"పద. వస్తున్నాను" అంటూ లేచాడు స్వర్గనాథ్.

కుర్చీ వెనక వేలాడుతున్న తెల్లకోటు తొడుక్కొని, టేబిల్‌మీది స్టెతస్కోప్ అందుకున్నాడు. సిగరెట్ యేష్ ట్రేలో నొక్కి, నర్సుని అనుసరిస్తూ లేబర్ రూంలోకి నడిచేడు.

రక్తసిక్తమైన బట్టలతో టేబిల్‌మీద పడుకున్నాడు పేషెంట్. అతని కిరుపక్కలా పోలీసులూ, ఇద్దరు ముగ్గురు వార్డుబాయ్‌లూ నిల్చునున్నారు. టేబిల్‌ని సమీపించి, ఆ వ్యక్తి మొహం చూడగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు స్వర్గనాథ్.

హఠాత్తుగా కరెంట్ షాక్ తగిలినప్పుడు ఒంట్లోని నరాలన్నీ ఝల్లుమంటాయి. శరీరంలో రక్తస్రావం స్తంభించి, మనిషి స్తబ్ధుడైపోతాడు క్షణంపాటు. సరిగ్గా అటువంటి స్థితికే గురయ్యాడు డాక్టర్ స్వర్గనాథ్!

దాదాపు ముప్పై ఏళ్ళుంటాయతనికి. నుదుటిమీద జీరాడే

ఉంగరాల జుట్టు. నిండైన బుగ్గలు. కోటేరు ముక్కు.

అతనే!

మధుప్రసాద్!!

చుట్టూ నిల్చున్నవాళ్ళు తనలో మారుతున్న రంగుల్ని యెక్కడ పసిగడతారోనని సాధ్యమైనంత త్వరగా తాను సర్దుకోవడంలో కృతకృత్యుడు కాగలిగేడు.

పేషెంట్ ఒంటిమీది బట్టలు తొలగించి, చకచకా గాయాలు పరీక్షించడం ప్రారంభించేడు. మోచేతులూ, మోకాళ్ళూ బాగా గీరుకుపోయాయి. ప్రక్కటెముకల్లో ఒకటి విరిగినట్టుంది. తలకు తీవ్రమైన గాయాలుతగిలాయి.

ఆపరేషన్ చెయ్యకతప్పదు. రక్తస్రావం విపరీతంగా జరిగినట్టుంది. వెంటనే అతని బ్లడ్ గ్రూప్ పరీక్షించి రక్తం యెక్కించడం అత్యవసరం!

ఆ హాస్పిటల్లోనే ఉంది బ్లడ్‌బ్యాంక్! అందులో వివిధ వ్యక్తులు దానంచేసిన రకరకాల గ్రూపుల రక్తం ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది.

ఇటువంటి ఆపరేషన్ కేసులు వస్తే తక్షణం చీఫ్‌కు ఫోన్‌చేసి పిలిపించాలి. ఆపరేషన్ కేసులన్నీ ఆయనే డీల్ చేస్తారు. ఐతే, పేషెంట్ బ్లడ్ గ్రూప్ చెక్‌చెయ్యడానికీ, ఇతర పరీక్షలకూ కాస్త టైం పడుతుంది.

అంతవరకూ గాయాలకు ప్రాథమిక కట్లుకట్టి, గ్లూకోజ్ ఇచ్చి చీఫ్‌కు ఫోన్ చెయ్యాలి అనుకుంటూ నర్సు ద్వారా పేషెంట్ గాయాలు శుభ్రం చేయించి, ప్రాథమిక కట్లుకట్టి పోలీసులదగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నాడు స్వర్గనాథ్.

మోబ్రిన్ రోడ్డుమీద, వేగంగా వస్తున్న ఓ కారు గుద్దేసిందట అతన్ని. ఆక్సిడెంట్ వార్త తెలియగానే పోలీసులు హుటాహుటిన అక్కడికెళ్ళి, గాయాలతో స్పృహతప్పి

పడున్న అతన్ని ఇక్కడికి తీసుకొచ్చారట.

ఇద్దరు కానిస్టేబుళ్ళని అక్కడే వదిలి, మిగతాసిబ్బందితో వెళ్ళిపోయాడు సబిన్స్పెక్టర్.

రొటీన్‌గా పేషెంట్‌కి గ్లూకోజ్ యెక్కించమని నర్సుకు పురమాయించి, గబగబ బైటికెళ్ళి చీఫ్‌కు ఫోన్ చేశాడు స్వర్గనాథ్. తరవాత, నెమ్మదిగా తన గదికి చేరి, కుర్చీలో చతికిలబడి, కళ్ళు మూసుకున్నాడు.

అతని హృదయంలో సన్నగా పొగమంచులా కురుస్తున్న దుఃఖంలోంచి క్రమక్రమంగా ఓ రూపం సాక్షాత్కరిస్తోంది. అతన్ని చూసి చిన్నగా నవ్వుతోంది.

"పూర్ణిమా!" అప్రయత్నంగా వణికాయి అతని పెదాలు.

'నన్ను మర్చిపోయావు కదూ అన్నయ్యా? ఇన్నాళ్ళ తరువాత మళ్ళీ నా గురించి ఆలోచిస్తున్నావు కదూ?' ప్రశ్నిస్తోంది ఆ రూపం పేలవంగా నవ్వుతూ.

'కాదమ్మా! నువ్వు జ్ఞప్తికి రాని రోజు లేదు. ఇంట్లో అడుగుపెట్టిన మరుక్షణం, పూలహారాలతో గోడలకి వేలాడుతున్న నీ ఫోటోలు నిన్ను అనుక్షణం గర్తుకు తెస్తాయి. నా మనసును ఛిద్రం చేస్తాయి.

నిన్నలా అర్ధాంతర చావుకు గురిచేసిన ఆ నీచుడు యెక్కడ కనిపించినా, యెప్పుడు కనిపించినా, నరికి ముక్కలుచేసి, నీ ఆత్మకు శాంతి కలిగించాలని నా మనసు తహతహ లాడిపోతుంది.

ఇన్నాళ్ళకు అనుకోకుండా ఆ అవకాశం చిక్కిందమ్మా! వాణ్ణి నరకానికి పంపేవరకూ నేను నిదరపోదలచుకోలేదు' ఆక్రోశిస్తోంది అతని మనసు మూగగా.

పొరలు పొరలుగా పొంగి వస్తున్న ఉద్వేగాన్ని అతి కష్టంమీద అదిమిపట్టి కళ్ళు తెరిచేడు స్వర్గనాథ్. తొందర

పడకూడదు. ఇటువంటి విషయాల్లో నిదానం ప్రధానం!

టేబిల్ మీది సిగరెట్ కేస్, లైటర్ అందుకున్నాడు. ఓ సిగరెట్ అంటించి, నెమ్మదిగా రిలాక్స్ అవసాగాడు.

ఆరేళ్ళ వెనక్కి జరుగుతున్నాయి అతని ఆలోచనలు.

అప్పుడు మెడిసన్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు స్వర్గనాథ్. తలిదండ్రులకు వాళ్ళిద్దరే సంతానం! పూర్ణిమ అతనికంటే మూడేళ్ళు చిన్నది. బి.ఎస్.సి. రెండో సంవత్సరం చదువుతుండేది.

ఆ రోజుల్లో చదువుతోబాటు టెన్నిస్ పిచ్చికూడా ఉండేది స్వర్గనాథ్‌కు. ఆ వీధిలోనే నివసించే తన బాల్య మిత్రుడితో సాయంకాలాలు టెన్నిస్ ఆడుతూ గడిపేవాడు. అప్పుడప్పుడూ పూర్ణిమకూడా వాళ్ళ ఆటలో పాలు పంచుకునేది. బాల్య నేస్తం గనక అతనికి వాళ్ళింట్లో అడ్డూ అదుపూ వుండేవి కావు.

అతనే మధుప్రసాద్!

ఒకరోజు స్వర్గనాథ్ కాలేజీనించి ఇంటికి రాగానే లోపల ఏదో గొడవ జరుగుతున్నట్టు అనుమానం వేసింది. మూసివున్న ఓ గదిలోంచి, వాళ్ళమ్మ పూర్ణిమని పెద్దగా కేకలేస్తోంది. కారణం ఏదో కనుక్కుందామని తలుపుతెరిచి లోపలి కెళ్ళాడు.

పూర్ణిమ ఏడుస్తూ, తల్లి ఆమెమీద విరుచుకుపడుతూ కనిపించేరు. తల్లిచేతిలో ఏదో కాగితం రెపరెప లాడుతోంది. ఏం జరిగిందని అడిగాడు.

"ఇంకా ఏం జరగాలి నాయనా? తెలిసిన కుర్రాడు కదా అని ఆ వెధవని ఇంట్లోకి రానిస్తే గారడీచేసి దీన్ని వల్లో వేసుకున్నాడు. ఎన్నాళ్ళనించి సాగుతోందో ఈ ఉత్తరాల భాగోతం! ఈరోజు నా కంటబడింది. ఆ వెధవ దీనికిరాసిన



ఉత్తరం చూడు!" అంటూ ఆ కాగితాన్ని అందించింది తల్లి.

అది పూర్ణిమ అతనికి రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరం! ప్రేమలేఖ!!

అది చదివాక, తల్లిలా అతను చిందులు తొక్కలేదు. కేకలెయ్యలేదు. తెలిసీ తెలియని వయసులో అటువంటి సంఘటనలు సహజమేననీ, మతపరంగా కానీ, అంతస్తు దృష్ట్యా గానీ అతను తమకెందులోనూ సరితూగడనీ, మళ్ళీ అటువంటి పొరబాట్లు చెయ్యొద్దనీ నయాన నచ్చజెప్పేడు చెల్లికి.

తరవాత మధుప్రసాద్ ఇంటికెళ్ళి, మళ్ళీ తమ ఇంటి ఛాయలకు రావడంగానీ, పూర్ణిమని కలుసుకోడం అటుంచి, ఆమెవైపు కన్నెత్తి చూసే ప్రయత్నంగానీ చేసిన పక్షంలో యెముకలు సున్నంకిందికి మారతాయని హెచ్చరించి వచ్చేడు.

అంతే!

ఆ సంఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే ఇద్దరూ రెక్కలు మొలిచిన పక్షుల్లా ఇళ్ళూ వాకిళ్ళూ వదిలి అంతుచిక్కకుండా అదృశ్యమైపోయారు. పూర్ణిమ తన నగా నట్రా, బట్టలూ అన్నీ వెంట తీసుకుపోయింది.

వెతికేరు. వెతికించేరు. అనుమానమున్న ప్రదేశాలన్నీ గాలించేరు. నిష్ప్రయోజనం! వారి ఛాయలుకూడా కానరాలేదు ఎవ్వరికీ. ఆ నీచుడు ఇంతకు తెగిస్తాడనీ, పూర్ణిమ అంత సాహసానికి ఒడిగడుతుందనీ ఎవ్వరూ ఊహించలేదు.

అంతా మాయ! గుడ్డిప్రేమకు ఇంగితజ్ఞానం ఎక్కడిది? ఇటువంటి వ్యవహారాల్లో మగవాడి కేలోటూ జరగదు. నిక్షేపంగా వుంటాడు. ఎటొచ్చీ ఆడపిల్ల తరపువాళ్ళే నరకాన్నీ అనుభవించేది. ఏ మచ్చా లేక గౌరవంగా బ్రతికిన కుటుంబం! యెంత అప్రతిష్ట. ఎంత అవమానం! ఊళ్ళో తలెత్తుకు తిరగలేకపోయారు.

ఆ అవమాన భారాన్ని మోయలేక, చితికీ చితికీ, శల్యశరీరులై తలిదండ్రులు ఒకరివెనక ఒకరు ఈ నరక సమాజంనించి నిష్క్రమించేరు.

ఆ తరువాత కొద్ది రోజులకు విజయవాడనించి అతని పేర ఓ టెలిగ్రాం వచ్చింది.

'పూర్ణిమ సీరియస్, స్టార్ట్ ఇమీడియట్లీ!'

కట్టుబట్టలతో ఉన్నపళంగా బైలుదేరాడు. టెలిగ్రాంలో ఉదహరించిన చిరునామాకు వెళ్ళి చూస్తే అప్పటికే జరగవలసిందేదో జరిగిపోయింది.

పూర్ణిమ మరణించింది!

సహజ మరణం కాదు.

ఆత్మహత్య!!

పోలీసులు ఇచ్చిన టెలిగ్రాం అది. ఆమె ఉరి పోసుకున్న గదిని గాలిస్తే ట్రంకుపెట్టె అడుగున ఓ డైరీ దొరికిందట. అందులో రాసుందిట తమ ఇంటి అడ్రస్. దాని ఆధారంగా; అవతలి వ్యక్తులు ఆందోళన పడకుండా 'సీరియస్' అని మాత్రం ఇచ్చారుట టెలిగ్రాం!

గత ఆర్నెల్లనించీ ఆ అమ్మాయి ఓ యువకుడితో ఆ గదిలో నివసిస్తోందని చెప్పారు ఇరుగు పొరుగు. ఐతే, ఇప్పుడా యువకుడి ఐపు లేదక్కడ. అంతేకాదు ఆ ఇంట్లో చిల్లిగవ్వగానీ, పూర్ణిమకు సంబంధించిన ఒక్క నగగానీ లేవు.

ఎక్కడుంటాయి? అన్నీ హరించుకుపోయాక!

పోలీసులు చూపించిన శవాన్ని గుర్తుపట్టేడు తను ఆమె తన సోదరి పూర్ణిమేనని, వెక్కి వెక్కి ఏడుస్తూ. అటువంటి కేసుల్లో పోస్టుమార్టం తప్పనిసరి గనుక, పోస్ట్‌మార్టంలో మరో రహస్యం బైటపడింది.

పూర్ణిమ పట్టి మనిషి కాదు!

మూడు నెలల గర్భిణి!!

అప్పుడు తను అనుభవించిన మనఃక్షోభ ఏ భాషలో వర్ణించేది? అన్నెం పున్నెం తెలియని అమాయకురాలిని ప్రేమ అనే పాశంలో బిగించి, నమ్మించి, ఐనవాళ్ళకు దూరంచేసి, మోజు తీరేక చింకిదుస్తులు విడిచినట్టు విడిచి పారిపోయిన ఆ కిరాతకుణ్ణి యెక్కడ కనిపించినా నరికి ముక్కలుచేసి, కుక్కలకి నక్కలకి విందుచెయ్యాలని నిర్ణయించుకున్నాడు తను.

ఇన్నాళ్ళతరువాత ఈనాడు దొరికింది ఆ సువర్ణావకాశం!

తలచుకుంటే ఈ క్షణంలోనే, ఈ స్థితిలోనే వాణ్ణి

చిటికెలో కైలాసం పంపవచ్చు. కాని, కానిస్టేబుళ్ళు కాపలావున్నారు వాడిదగ్గర. తను ఏ కాస్త తొందరపడ్డా వ్యవహారం బెడిసికొట్టవచ్చు. వాణ్ణి చంపడం అటుంచి, తానే కొన్నాళ్ళు శ్రీకృష్ణ జన్మస్థానం పర్యవేక్షించడాని కెళ్ళవచ్చు. కర్ర విరక్కుండా పాము చచ్చే పథకం వెయ్యాలి. అదేదో వాడికి స్పృహ రాకముందే జరిగి పోవాలి. వాడు కళ్ళు తెరిచాడంటే తనని సులభంగా గుర్తు పడతాడు. స్వర్గనాథ్ మస్తిష్కం తీవ్రంగా యోచిస్తోంది.

అంతలో ఎవరో ఆఫీసువైపు వస్తున్న అడుగుల శబ్దం వినిపించింది.

స్ప్రింగ్‌డోర్స్ తెరుచుకున్నాయి.

"చీఫ్ వచ్చాడు డాక్టర్!" అంది నర్సు.

లేచి, ఆమెననుసరించేడు స్వర్గనాథ్. అప్పటికే బైట తెలతెలవారుతున్నట్టు పక్షుల కిలకిలారావాలు విని పిస్తున్నాయి.

చీఫ్‌ను లేబర్‌రూంలోకి తీసికెళ్ళి చూపించేడు పేషెంట్‌ను.

ఆయన కాసేపు మధుప్రసాద్‌ని పరీక్షించి, వెంటనే ఆపరేషన్‌కు ఏర్పాట్లు జెయ్యమని పురమాయించేడు. రక్త స్రావం బాగా జరిగిపోయింది గనక, వెంటనే పేషెంట్ రక్తం ఏ గ్రూప్‌కు చెందిందో టెస్ట్‌జేసి, బ్లడ్‌బ్యాంక్‌నించి బ్లడ్‌బాటిల్ తెప్పించమన్నారు.

అప్పుడు మెరిసింది స్వర్గనాథ్ బుర్రలో ఓ పథకం! తిరుగులేని పథకం!!

కర్ర విరక్కుండా పాముచచ్చే పథకం!!!

టెస్ట్‌కోసం పేషెంట్ శరీరంలోంచి కొద్దిరక్తం తీసి, బ్లడ్‌బ్యాంక్ లాబొరేటరీ ఇంఛార్జ్‌కు వెంటనే అప్పగించ

మనీ, ఎమర్జన్సీ కేసు గనక, తక్షణం రిపోర్ట్ తీసుకు రమ్మనీ పురమాయించేడు నర్సుకు.

బ్లడ్ బ్యాంక్ ఇంఛార్జి పేరు డాక్టర్ సతీష్‌కుమార్.

పదినిమిషాల్లో వచ్చేసింది మధుప్రసాద్ బ్లడ్ గ్రూప్ రిపోర్టు.

"ఓ—పాజిటివ్."

స్పైయినల్ ట్రేలో ఆపరేషన్‌కు కావలసిన ఇన్‌స్ట్రుమెంట్స్ సిద్ధంజెయ్యమని నర్సుకు ఆదేశించి, గబగబ బ్లడ్ బ్యాంక్ వైపు నడిచేడు స్వర్గనాథ్. కాసేపట్లో అక్కణ్ణించి మధుప్రసాద్ శరీరంలో ఎక్కించడానికి 'ఓ—పాజిటివ్' బ్లడ్ బాటిల్ పంపబడుతుంది ఆపరేషన్ థియేటర్‌కు.

ఆ లోపలే తను చెయ్యవలసిందేందో చేసెయ్యాలి!

బ్లడ్ బ్యాంక్ ముందునించి వెళుతూ లోనికి చూశాడు, డాక్టర్ సతీష్‌కుమార్ లోపలున్నాడేమోనని. లేడు. బహుశా లాబొరేటరీలో ఉండివుంటాడు.

ఇదే అదను!

ఓ మారు చుట్టూ కలయజూసి, చటుక్కున గదిలో అడుగుపెట్టాడు స్వర్గనాథ్. ఎదురుగా, గోడవారగా నిలబెట్టివుంది నిలువెత్తు రెఫ్రిజిరేటర్! అందులోనే వుంటాయి వివిధ గ్రూపులకు చెందిన బ్లడ్ బాటిల్స్.

క్షణంలో జేరుకున్నాడక్కడికి. రెఫ్రిజిరేటర్ తలుపు మీద ఓ హెచ్చరిక రాసివుంది. 'జాగ్రత్తగా తెరవండి. లోపల బ్లడ్ బాటిల్స్ వున్నాయి'.

పిడితిప్పి మెల్లిగా తెరిచేడు తలుపు. లోపల అనేక అరలు. ఆ అరలనిండా ఎర్రని చిక్కని స్వచ్ఛమైన రక్తపు సీసాలు. వాటి కార్కులపై ఆయా గ్రూపులూ, బాటిల్స్

మధ్యన ఆ రక్తం ఎవ్వరు ఎప్పుడు దానమిచ్చారో వివరాలూ అంటించివున్నాయి.

కింది అరలో చిట్టచివర వున్న ఓ బాటిల్ మీద నిలిచింది అతని దృష్టి. దాని కార్క్ పై 'బి—నెగటివ్' అని ముద్రించి వుంది. బాటిల్ మధ్య లేబిల్ పైన—'డాక్టర్ స్వర్గనాధ్ సౌజన్యంతో' అని రాసుంది.

చిన్నగా నవ్వుకున్నాడు స్వర్గనాధ్. అది తన రక్తమే! రెండురోజుల క్రితం తానే ఆ రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ కు దానమిచ్చాడు. కారణం, బి—నెగటివ్ రక్తం చాలా అరుదుగా లభ్యమౌతుంది!

మనుషులందరి రక్తపురంగు ఒక్కటే అయినా, అందరి రక్తం ఒకే కోవకి చెందివుండదు. అందుకే వాటికి ఇలా గ్రూపులు నిర్ధారించబడ్డాయి. ఒక మనిషికి రక్తం అవసరమైతే, ఆ గ్రూపుకు చెందిన రక్తమే అతనికివ్వాలి. అలా కాని పక్షంలో ఆ మనిషిప్రాణానికే ముప్పు.

ఉదాహరణకు ఒక మనిషిరక్తం 'ఓ—పాజిటివ్' అయితే, ప్రమాదవశాత్తూ అతనికి రక్తం అవసరమై నప్పుడు అదే గ్రూపుకు చెందిన రక్తం ఇవ్వాలి. అలాకాక 'బి—నెగటివ్' ఇస్తే మరుక్షణం అతనికి మరణం తథ్యం!

కారణం, అతని శరీరంలో ప్రవహించేది ఓ-పాజిటివ్ గనక, దానికి విరుద్ధంగా బి—నెగటివ్ ఇస్తే వెంటనే అతని శరీరంలో ప్రవహిస్తున్న ఓ—పాజిటివ్ రక్తం కలుషితమైపోతుంది. అదే అతని మరణానికి హేతువౌతుంది!

ఈ సిద్ధాంతాన్నే తన పథకాని కుపయోగించ దలచాడు స్వర్గనాధ్!

క్షణం వృధాజెయ్యకుండా, పై అరలో వున్న ఓ—

పాజిటివ్ బాటిల్ కార్క్ తీసి, కింది అరలోవున్న బి—నెగటివ్ బాటిల్ కార్క్‌ను ఓ—పాజిటివ్ బాటిల్‌కు మార్చాడు.

తరవాత పై అరలోని బాటిల్ కింది అరలోనూ, కింది అరలోని బాటిల్ని పై అరలోనూ పెట్టి, నిశ్శబ్దంగా ఫ్రిజ్ తలుపుమూసి, చకచక గదిలోంచి బైటపడ్డాడు.

ఆలోగా, ఆపరేషన్ థియేటర్లో కావలసిన ఏర్పాట్లు సిద్ధంచేసింది నర్సు.

చీఫ్‌వున్న గదిలోకెళ్ళి, ఆపరేషన్ కంతా రెడీ అయిందని చెప్పేడు స్వర్గనాథ్. ఆయన ఆపరేషన్ థియేటర్లోకి వచ్చి, బ్లడ్ కలెక్ట్‌చేసుకు రమ్మని పురమాయించేడు నర్సుకు.

వార్డ్‌బాయ్‌లు మధుప్రసాద్‌ను స్ట్రెచర్‌మీద తెచ్చి పడుకోబెట్టేరు ఆపరేషన్ టేబిల్‌ముందు. నర్సుబ్లడ్ బాటిల్ తెచ్చి స్టాండుకు వేళాడదీసింది తలకిందులుగా.

చీఫ్ చేతులు వాష్‌చేసుకుని, గ్లవ్స్ తొడుక్కుంటున్నారు. ఆలోగా స్పైనల్ యివ్వడానికి సిద్ధమయ్యాడు స్వర్గనాథ్. స్పైనల్ ట్రే తీసుకుని, లంబార్ పంక్చర్ నీడిల్ చూసుకున్నాడు. పేషెంట్ తలకుకట్టిన ప్రాథమిక కట్లు విప్పేసి, ఆ స్పేసంతా జాగ్రత్తగా క్లీన్‌జేశాడు.

ఆపరేషన్ ప్రారంభమైంది.

చీఫ్‌వేళ్ళు చాకచక్యంగా, వీణతీగల్ని మీటుతున్నంత సున్నితంగా పనిజేస్తున్నాయి. గాయాల్లో అక్కడక్కడా తెగిన బ్లీడింగ్ పాయింట్స్ పట్టుని 'టై' చేస్తున్నాడు.

నలభై అయిదు నిమిషాల్లో ముగిసింది ఆపరేషన్. అక్కడక్కడా కుట్లువేసి, కట్లుకట్టేశారు. అంతా పూర్తయ్యాక, మళ్ళీ పల్స్, బి.పి. చెక్‌చేశాడు స్వర్గనాథ్. పల్స్ నిమి

షానికి 84/ ఉంది. బి.పి. 120/70 ఎమ్.జి. మెర్క్యూరీ ఉంది.

చీఫ్ వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ, "బ్లడ్ ఎక్కించండి" అన్నారు.

నర్సువైపు చూసి తలూపాడు స్వర్గనాథ్. బ్లడ్ బాటల్ వేళాడుతున్న స్టాండ్‌ని పేషెంట్ దగ్గరికి జరిపి, బాటల్ కార్క్‌కు రబ్బర్ పైప్ బిగించింది నర్సు. పైప్‌చివర ఉన్న నీడిల్ని, పేషెంట్ కుడిచేతి వైన్‌లో గుచ్చింది. అంతే!

చుక్కలు చుక్కలుగా మధుప్రసాద్ శరీరంలోకి వెళ్ళ సాగింది రక్తం!

అతనిక్కావలసిన 'ఓ-పాజిటివ్' రక్తం కాదు!

ఆ ఆస్పత్రికి స్వర్గనాథ్ దానమిచ్చిన రక్తం!

బి—నెగెటివ్!!

నర్సును అక్కడే వుండి పేషెంట్ కండిషన్ చెక్ చేస్తుండమని చెప్పి, బైటికి నడిచారు చీఫ్. స్వర్గనాథ్ కూడా చేతులు వాష్ చేసుకుని, తన గదిలోకెళ్ళి కూర్చున్నాడు.

తృప్తి! అనూహ్యమైన తృప్తి అతని మనసునిండా ఆవహించింది. సిగరెట్ అంటించి కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. జీవితంలో మిగిలిన చివరి కాంక్ష తీరినట్టూ, ఎన్నాళ్ళుగానో మోస్తున్న గుండెమీది భారం దించుకున్నట్టూ ఫీలవుతున్నాడిప్పుడు.

పూర్ణిమ ఒక్కర్తేనా? ఆ నీచుడివంటి నీతి బాహ్యుల కబంధ హస్తాల్లో చిక్కుకుని, బంగారంలాంటి బ్రతుకుల్ని ధూళిపాలు జేసుకుంటున్న అమ్మాయిలు కోకొల్లలు!

క్షణ భంగురమైన మోహపాశంలో పడి,కన్నూ మిన్నూ గానక, పెద్దలు గీసిన కట్టుబాట్ల నధిగమించి, రత్న



పుష్పాలవంటి తమ జీవితాలని చిట్లిన గాజు పెంకుల్లా ఎందుకు మార్చుకుంటున్నారో ఈనాటి యువతులు?....

అతని ఆలోచనలకి ఆనకట్టవేస్తూ హడావుడిగా లోనికి వచ్చింది నర్సు.

"డాక్టర్! ఆ పేషెంట్ స్థితి సీరియస్‌గా మారి పోతోంది!" అంది ఆయాసపడుతూ.

"వాట్ హాపెండ్ సిస్టర్?"

"ఇప్పటివరకూ బాగానేవున్న అతని పల్స్ హఠాత్తుగా 120 ఎమ్. టి. లోకి దిగింది. టెంపరేచర్ 102 డిగ్రీలు పెరిగింది. బి. పి. 90 కి డ్రాప్ అయింది. నుదురూ, చేతులూ చల్లబడుతున్నాయి. బొవెల్ సౌండ్స్ లేవు. మైల్డ్ డిస్టెన్షన్ వుంది. పోస్ట్ ఆపరేషన్ అలియస్‌లా వుంది. ఇంటస్టయిన్స్ అంతగా హ్యాండిల్ చేసినట్టులేదు. పేషెంట్ షాక్‌లోకి పోతున్నాడు" చెప్పింది నర్సు.

ఖంగారు నటిస్తూ, ఒక్క ఉదుటునలేచి నిల్చున్నాడు స్వర్గనాధ్. గబ గబ చీఫ్ గదిలోకెళ్ళి పరిస్థితి వివరించేడు. వెంటనే ఆయన ఆపరేషన్ థియేటర్లోకి వచ్చి పేషెంట్ని పరీక్షించాడు.

ఇహ ఎన్ని ప్రయత్నాలుజేసినా మధుప్రసాద్ని ఆ పర బ్రహ్మ కూడా కాపాడలేడని స్వర్ధనాధ్కు తెలుసు. బాగా తెలుసు!

"రైల్స్ ట్యూబ్ ఆస్పిరేషన్. ఐ.వి. ఫ్లూయిడ్స్ కంటిన్యూ జెయ్యండి. బ్లడ్ స్లోగా ఇవ్వండి. ఎందుకైనా మంచిది, మెఫెంటైన్ డ్రిప్‌లోకి ఎక్కించండి. కాన్సర్వేటివ్ ట్రీట్‌మెంట్ ఇవ్వండి చాలు ప్రస్తుతానికి. ఐ హోప్ హి విల్‌బి ఆల్‌రైట్!" అని బైటికి నడిచాడు చీఫ్.

నర్సుతో కలిసి ఆయన ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్ ఫాలో అవసాగేడు స్వర్గనాధ్. నిమిషాలు దొర్లుతున్నకొద్దీ ఆ ప్రయత్నాలేవీ కలిసి రావడంలేదని స్పష్టమైంది. బి పి. ఇంకా డ్రాప్ అయింది. పల్స్ వేగంగా, నీరసంగా కొట్టు కుంటోంది. కాళ్ళూ, చేతులూ చల్లగా మంచులా మారుతున్నాయి.

"చూస్తూండు. చీఫ్‌ని పిల్చుకొస్తాను" అంటూ గబ గబ బైటికి నడిచేడు స్వర్గనాధ్.

చీఫ్ గదికెళ్ళి, వివరించేడు పరిస్థితి. ఆయన హడావుడిగా వచ్చి, పేషెంట్ పల్స్‌చూసి, నెమ్మదిగా చెయ్యి కిందికి జార్చేడు.

"ఎలావుంది డాక్టర్?" అడిగేడు స్వర్గనాధ్ అత్రుత నటిస్తూ.

"పోయాడు!"

ఎగిరి గంతెయ్యాలనిపించింది నాధ్‌కు.

"మన ప్రయత్నాలేవో మనం చేశాం! భగవంతుడి అభీష్టాన్ని ఎవరు కాదనగలరు? పేపర్ వర్క్ కానిచ్చి, శవాన్ని పోలీసుల కప్పగించండి" అంటూ బైటికి నడిచేడు చీఫ్.

రాతలూ, కోతలూ పూర్తయి శవాన్ని పోలీసుల కప్ప గించేసరికి ఉదయం పందిగంటలైంది. నిజానికి స్వర్గనాథ్ డ్యూటీ ఉదయం ఏడుగంటలకే ముగుస్తుంది. ఈ గోడ వలో పడి ఇంతసేపూ ఆగిపోవలసి వచ్చింది.

అంతేగాక, అతనికి మరో ముఖ్యమైన పనికూడా చెయ్యవలసి ఉందక్కడ.

బ్లడ్‌బ్యాంక్ రిఫ్రిజిరేటర్లో బి—నెగెటివ్ కార్కు బిగించివున్న ఓ—పాజిటివ్ బ్లడ్ బాటిల్ అలాగేవుంది. వెంటనే ఆ కార్కు మార్చెయ్యాలి.

తను వెళ్ళాక, ఖర్మగాలి మరేదైనా కేసువస్తే ఆ పేషెంటుకు బి — నెగెటివ్ రక్తం అవసరమైతే, ఆ బాటల్ రక్తం ఎక్కించే ప్రమాదముంది. అందులో ఓ—పాజిటివ్ రక్తంవుంది మరి! ఆ విధంగా తనవల్ల వేరొకరు అన్యాయంగా చావడం స్వర్గనాథ్ కిష్టంలేదు.

ఆ పని పూర్తి జెయ్యడానికి బ్లడ్ బ్యాంక్ గదిముందు రెండు మూడుసార్లు పచార్లుజేశాడు. ఐతే పగలు కావడం వల్ల హాస్పిటల్ సిబ్బంది ఎవ్వరో ఒకరువస్తూ పోతున్నా రక్కడికి.

నిద్ర లేమివల్ల అతని కళ్లు మండిపోతున్నాయి. నీరసం ముంచుకు వస్తోంది. చూసి విసుగెత్తి, రాత్రి నైట్ డ్యూటీకి వచ్చినప్పుడు చూసుకుందామని కార్లో బైలు దేరాడు ఇంటికి.

సాధ్యమైనంత త్వరగా ఇల్లు జేరాలనే తొందర్లో స్పీడ్

కాస్త హెచ్చించాడు.

పిద్ర మత్తువల్ల, పక్క సందులోంచి మేన్‌రోడ్‌మీదికి వస్తున్న మిలిటరీ ట్రక్ కనిపించ లేదతనికి. సడన్‌గా దానిమీద దృష్టిపడి, దెబ్బకు తప్పుకుందామని ప్రయత్నించే లోగా జరగవలసిన ఆలస్యం జరిగిపోయింది!

భయంకరమైన శబ్దంతో ట్రక్‌ని గుద్దేసింది కారు!

స్వర్గనాధ్‌కు క్షణంపాటు ఏం జరిగిందో అర్థంకాలేదు. ఒళ్ళంతా రోకళ్ళతో పొడుస్తున్నట్టు బాధ. క్రమంగా కళ్ళల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. అతనికి తెలీకుండానే నేలకొరిగి స్పృహతప్పాడు.

తిరిగి కళ్ళు తెరిచి చూస్తే తన హాస్పిటల్ లోనే, ఆ ఆపరేషన్ థియేటర్‌లోనే టేబిల్‌మీద పడున్నాడు.

చుట్టూ పరిచయమున్న డాక్టర్లూ, నర్సులూ! తనగురించే ఆందోళనగా మాట్లాడు కుంటున్నారు. ఏదో చెప్పడానికి శాయ శక్తులా ప్రయత్నించేడు స్వర్గనాధ్. కంఠందాటి ఇవతలికి రావడంలేదు స్వరం! కళ్ళు మూసుకున్నాడు నిస్సహాయంగా.

అప్పుడు వినిపించా యతనికి చీఫ్ మాటలు లీలగా. "వెంటనే ఆపరేషన్‌కు ఏర్పాట్లు జెయ్యండి. రక్తం చాలా కారిపోయినట్టుంది. బ్లడ్ గ్రూపింగ్‌కు ఎక్కువ టైం తీసుకోవద్దు. త్వరగా ఎక్కించాలి రక్తం!"

"హీ ఈజ్ రియల్లీ లక్కీ ఫెలోసార్! ఇతని బ్లడ్ గ్రూప్ టెస్ట్ అవసరమే లేదిప్పుడు. రెండు రోజుల క్రితం ఇతనిచ్చిన రక్తం అలాగేవుంది బ్లడ్ బ్యాంక్‌లో, బి— నెగెటివ్!" అది డాక్టర్ సతీష్‌కుమార్ కంఠం.

"ఇంకేం, వెంటనే తెప్పించండి దాన్ని!" అంటున్నాడు చీఫ్.

స్వర్గనాథ్ గుండెల్లో వెయ్యి గుర్రాలు ఒక్కసారి దౌడు ప్రారంభించేయి. వాళ్ళంటున్న బాటిల్లోవున్నది తన రక్తం కాదు. ఓ—పాజిటివ్! తన రక్తం ఎప్పుడో మధుప్రసాద్ మరణానికి దారితీసింది.

కళ్ళు తెరిచి, ఏదో చెప్పడానికి శత విధాలా ప్రయత్నించాడు. మాట పెగిలిరావడం లేదు నోట్లోంచి! చేతులు కదలటం లేదు.

దాంతో భరించలేని భయాందోళనకుగురై మళ్ళీ స్పృహ తప్పిందతనికి. అరగంట తరవాత, స్టాండుకు వేళాడుతున్న బాటిల్ ద్వారా చుక్కలు చుక్కలుగా స్వర్గనాథ్ శరీరంలోకి చేరసాగింది రక్తం!

అతనిక్కావలసిన నెగెటివ్—బి కాదు.

ఓ—పాజిటివ్!! ★

జవాబులేని చీటీ!

ఓ ప్రజానాయకుడు వుమన్స్ లిబరేషన్ గురించి గొప్పగా మాట్లాడుతున్నాడు. కొందరు తమతమ ప్రశ్నలు చీటీలపై వ్రాసి పంపుతున్నారు. తన అభిప్రాయం చెబుతున్నాడు.

ఓ చీటీపై యిలా వుంది "మీరు ముందు వరుసలో అమ్మాయిని పదేపదే చూస్తున్నారు. యింటికి రండి మీ పని చెపుతా" అని వుంది.

—వి. వి. వరదరాజు, విజయవాడ-3.

అభాగిని

యస్. కృష్ణవేణి



ఆఫీసునుండి రూముకి రాంగానే బాత్‌రూమ్‌లో దూరి స్నానంచేయడం పద్మ అలవాటు. ఈ రోజు అలవాటుకి విరుద్ధంగా మడతమంచానికి అడ్డంగా పడుకొని పైకప్పువేపు దీర్ఘంగా చూడసాగింది.

“అమ్మాయీ! వచ్చావా?” తలుపు తోసుకుని ఇంటిగల

మామ్మగారు వచ్చారు.

'ఈ ముసిలిది ఒకటి నా ప్రాణానికి' మనసులోనే విసుక్కొని "వచ్చాను రండి మామ్మగారు" అని లేచి కూర్చుంటూ ఆహ్వానించింది.

"నీవు కరెక్టుగా వచ్చేస్తావు నాకు తెలుసు. అవునూ! ఈ రోజు స్నానం చేయడానికి వెళ్ళలేదేం" పద్మ వేపు చూస్తూ అన్నది.

"కొంచెం తలనొప్పిగా వుంది మామ్మగారు. ఇదిగో కాస్త కాఫీ చేసుకొని ఓ అనాసిన్ వేసుకొని...."

"అయ్యో పాపం! తలనొప్పిగా వున్నదా? పోనీ మా కోడలితో చెప్పి కాఫీ చేయించి యివ్వనా?

"వద్దులెండి! ఎంతసేపు ఫిల్టర్‌లో డికాక్షన్ వుండనే వుంటుంది. కాస్త పాలని వెచ్చచేసి...." అంటూ లేవబోయింది.

"ఇదిగో అమ్మాయి! నువ్వు నాలుగేళ్ళ నుండి మా యింట్లోనే వుంటున్నావు. కడుపున బుట్టిన బిడ్డలా మాతో కలసిపోయావు. నేనో మాట యిందాక విన్నాను. విన్న దగ్గర నుండి ప్రాణాలు ఒకటే కొట్టుకుంటున్నాయి అనుకో?"

ఆవిడ మాటలు వినగానే పద్మగుండెలు దడదడా కొట్టుకో ప్రారంభించినయ్. అయితే ఈవిడ కూడా నేను విన్న మాటల్నే వినిందా? ఇంత తొందరగానా? అయితే.... అయితే నిజమేనా? స్టవ్‌దగ్గరకి వెళ్ళేది వెళ్ళడం ఆపి మంచంమీద అలానే కూలబడిపోయింది.

"మీ యింటికి వస్తూవుంటాడే శేషగిరి, అతని ఆఫీసు లోని చౌదరి మా అబ్బాయి స్నేహితులన్న సంగతి నీకు తెలుసుగా! అతను యీ రోజు మధ్యాహ్నం మా

అబ్బాయితో అన్నాడట మా ఆఫీసులో పనిచేసే శేషగిరికి యింకో పదిరోజుల్లో పెండ్లి అని, పిల్లది వైజాగ్ అనీను. రేపు సోమవారం నుండి అతను లీవు పెట్టేశాడట నెల రోజులు. అది వినగానే మా అబ్బాయికి ఏమోలా అయి పోయిందట. ఓ గంట పర్మిషన్ తీసుకొని మధ్యాన్నం వచ్చి మాతో చెప్పి మాఇద్దై పోయాడు." ఆవిడ ఆగి పద్మ వేపు చూసింది.

పద్మ తలొంచుకుని గోళ్ళవేపు చూసుకొంటున్నది.

"ఏదో నీవూ అతనూ పెండ్లి ఎలానూ చేసుకుంటారు కదా అని మేం వూరుకొన్నాంగానీ అమ్మాయీ! ఇలాంటివి సంసార్ల కొంపల మధ్య జరిగితే మాకెంత అప్రతిష్ట" బుగ్గలు నొక్కుకున్నది ఆవిడ.

పద్మ దీనంగా ఆవిడవేపు చూసింది.

ఆమెకళ్ళు వర్షించబోయే మేఘాల్లా వున్నాయి. పద్మ మొఖం చూడగానే ముసలావిడ గుండెలు కరిగినట్లున్నాయి.

"అయితే నీకు తెలుసా?"

"తెలియదు మామ్మగారూ!" దీనంగా అన్నది.

"మరి నీ గతో?"

ఈ ప్రశ్నతో పద్మకి దుఃఖం పొంగుకొచ్చింది. కళ్ళమ్మట నీళ్లు ధారగా ప్రవహించసాగింది.

అప్పటివరకూ గుమ్మం ప్రక్కన నక్కివున్న మామ్మగారి కోడలు మిగిలిన వాటావాళ్ళు ధైర్యంగా యింట్లోకి జోరపడ్డారు.

"ఊరికే అన్నారా? ఆకువచ్చి ముల్లుమీద పడ్డా, ముల్లు వచ్చి ఆకుమీద పడ్డా ఆకుకే నష్టం" అని ఒకావిడ చేతులు త్రిప్పుతూ అన్నది.

"మా నాన్నని నేనిలా వుద్యోగం చేస్తానంటే మా



నాన్న ససేమిరా వద్దన్నారు. ఉద్యోగాలకి వెళ్ళే ఆడపిల్లలు చెడిపోతున్నారని" యింకొకావిడ గొప్పగా అంది.

"అందరూ అలానే వున్నారేవిటి? నీవు మరీనూ! ఎవరో వాళ్ళు కొవ్వెక్కిపోతే అందరినీ కలుపుతావే నీవూ" ఇంకొకామె అందుకున్నది. ఎందుకంటే ఆమె చెల్లెలూ, ఆడబిడ్డ కూడా వుద్యోగాలు చేస్తున్నారు.

పద్మ ఎవరి మాటలకీ సమాధానం యివ్వకుండా అపరాధినిలా అలా తలొంచుకునే కూర్చుంది.

"అందని ఆడదాని కోసం మగాడు ఎన్ని పాట్లైనా పడతాడు. పబ్బం గడిచిందా దానిమీద మొహంమొత్తుతుంది మగాడికి. మగాడిని కట్టిపడేసేది తాళిబొట్టు ఒక్కటే. అది లేకుండా వాళ్ళకి అందామా మరి మొహం చూపరు ఎంతటి అందగత్తెకైనా" మామ్మగారు అన్నారు.

అందరూ అంతే అంతే అన్నారు.

పద్మ దేనికీ పులకలేదు, పలకలేదు. ఆమె గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయి.

అందరూ తలొక మాట అనిన తరువాత వెళ్ళి

పోయారు. పద్మ లేచి స్టవ్ అంటించి స్నానానికి నీళ్ళు పెట్టింది.

2

పద్మ చిన్నపిల్లగా వున్నప్పుడు లారీ యాక్సిడెంటులో తండ్రి చనిపోయాడు. తరువాత తల్లి పద్మని పెంచడానికి ఎంతో ప్రయత్నించినదట. కానీ ఆమె యవ్వనం ఆమెను ఎక్కడికి వెళ్ళినా కాలసర్పంలా కాటేయసాగింది. మానాన్ని పోగొట్టుకోలేక, అది పోగొట్టుకుని బ్రతకలేక విషం తిని చనిపోయింది.

పద్మకో మేనమామ వున్నాడు. అతని బ్రతుకు అతనిది. గంపెడు సంసారం. పద్మని తీసుకురావడానికి అతని భార్య వొప్పుకోలేదు. దాని ఫలితంగా పద్మ అనాధశరణాలయంలో చేర్చబడింది.

మేనమామ చేసిన మహోపకారం ఏమిటంటే పద్మని రోడ్డుమీద వదిలేయకుండా శరణాలయంలో చేర్చడం.

అక్కడే యస్.యస్. యల్.సి పాస్అయింది. హిందీ విశారదపాస్ అయి టీచర్ ట్రయినింగ్ అయింది. టైపు హయ్యర్ షార్టుహాండు పాస్ అయింది. హిందీ టీచరుకి, స్టెనోకి, టైపిస్టుకి, క్లర్కుకి అప్లయిచేసింది.

ఏలూరులో క్లర్కుగా వుద్యోగం వచ్చింది. శరణాలయానికి గుడ్ బై చెప్పి ఏలూరులో వుద్యోగంలో చేరింది.

చిన్న ఇల్లు అద్దెకి తీసుకొంది.

ఉద్యోగంలో చేరిన ఆరునెలలువరకూ ఏ ఒడుదుడుకులూ లేవు. తరువాత ఎంప్లాయిస్ ఎలక్షన్సు, అప్పుడు ట్రెజరీలోని శేషగిరితో పరిచయం ఏర్పడింది.

శేషగిరి బ్రాహ్మణుడు. మంచి మాటకారి. పరిచయాన్ని వదలలేదు. దారి కాసేవాడు. మర్యాదగా పలకరించేవాడు.

ఒకటి రెండుసార్లు యీ ప్రక్క పనిమీద వచ్చాను ఇక్కడేగా మీరు వుంటున్నదని వచ్చానండి అని యింటికి రావడం మొదలుపెట్టాడు.

ఇంటిగల మామ్మగారికి తన కథ తెలుసు. తనకి నా అనేవాళ్ళు లేరు అనే సంగతి తెలుసు. శేషగిరి రావడం చూసి, "పెండ్లికాని పిల్లవి! నీకు నా అనేవాళ్ళు లేరు. అలా అని కాలుజారమాకు" అని అంది.

తనకి తలకొట్టేసినట్లు అయింది.

ఇంకోసారి వచ్చినప్పుడు, "అమ్మాయీ! ఇది సంసార్లు వుండే కొంప. ఇటువంటి చాటుమాటు వ్యవహారాలు మా యింట్లో కూడదు" అని తెగేసి చెప్పేసింది.

ఆ రోజు సాయంకాలం మామూలుగా శేషగిరి తనని వచ్చి కలుసుకోగానే, "ఏమండీ! మీకు నమస్కారం. మీరు నాతో మాట్లాడడానికి ప్రయత్నించవద్దు. నా కెవ్వరూ లేరు. మామ్మగారు అలా అన్నారు. నా బ్రతుకుని నన్ను బ్రతకనీయండి" అని దీనంగా అంది.

మొదటినుండి ఒకరి దయా ధర్మంమీద బ్రతికినది కావడంవలన దీనంగా మాట్లాడటం మనుష్యులని చూస్తే భయపడటం అన్నది వున్నది.

ఆ రోజు....

నీళ్ళు తెర్లుతున్నాయి.

పద్మ గతంలోనుండి వర్తమానంలోకి వచ్చి నీళ్ళు తీసుకొని బాత్‌రూములోకి వెళ్ళింది.

దొడ్లోకి వెళ్ళగానే అప్పటివరకూ నలుగురూ చేరి ఏదో విషయంగా చర్చించుకొంటున్న వారంతా పద్మని చూసి, మాటలని ఆపి ఎవరి దారిన వారు పోయారు.

స్నానం చేస్తూ తిరిగి గతంలోకి వెళ్ళింది.

"పద్మా! నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అని అతను అన్నాడు.

పద్మ వులిక్కిపడింది.

"మీరు....మీరు బ్రాహ్మలు. నేను అనాధని" అని భయంగా అన్నది.

"ప్రేమకి కులం మతం అంతస్థులు అడ్డురావన్న పాత డైలాగుని వినలేదా?" అతనన్నాడు.

"మన పెండ్లికి మీ వాళ్ళు వొప్పుకుంటారా?" పద్మ అయోమయంగా ప్రశ్నించినది.

"వాళ్ళు ఒప్పుకునేదేమిటి? చేసుకునేది నేను. సంసారం చేసేది నేను. నా జీవితం. నా కిష్టం అయిన వ్యక్తిని చేసుకుంటే సుఖపడేది నేను. వాళ్ళుకాదు" అని అన్నాడు.

"అయితే....అయితే...." ఆ తరువాత ఎలాఅడగాలో తెలియలేదు.

అతను రావడం మానలేదు. రావద్దనలేదు. ఎందుకంటే తనని పెండ్లిచేసుకునే వాళ్ళు ఎవ్వరు? తనకి పెద్దరికం వహించేవాళ్ళు ఎవ్వరు? భగవంతుడి దయవలన ఈయనకి తనమీద ప్రేమకలిగింది. తనూ అందరి ఆడవారిలా భర్తా సంసారం పిల్లలతో ఆనందంగా వుండవచ్చు.

"ప్రేమించడానికి మనంఎవ్వరం పనికిరాకపోయామా!"

"మన ఆఫీసు మగాళ్ళకి గొడ్డుబోయిందా గురూ! ప్రక్క ఆఫీసుమీద పడ్డారు."

ఇలా ఆఫీసులో ఇన్-డైరెక్టుగా కామెంట్సు ప్రారంభమైయ్యాయి.

ఎంత నిదానంగా చేసినా స్నానం పూర్తిఅయిపోయింది. పద్మ బట్టలు కట్టుకొని యింట్లోకొచ్చి తిరిగి ఆలోచనలలో పడ్డది.

"ఏమండీ! మా ఆఫీసులో అందరూ ఏమోమో అంటున్నారు. మీరు పెండ్లి చేసుకుంటానంటున్నారు కదా! చేసుకోవచ్చును కదా?" అడిగింది ఓ రోజు.

"పద్మా! చేసుకోవాలని నీకన్నా నాకే తొందరగా వున్నది. 'నా జీవిత భాగస్వామిని నా రాణి, నా స్వప్న సుందరి వుండగా నాకీ బ్రహ్మచర్యం ఏమిటా? అని"

అతను ఆగాడు.

"మరి!" సిగ్గుపడుతూ అడిగింది.

"చూడు పద్మా! నాకు పెండ్లి కావలసిన చెల్లెళ్లు యిద్దరు వున్నారు. నాకు నిన్ను చేసుకోవడానికి అభ్యంతరంలేదు. కాని వాళ్ళ పెండ్లి కాకుండా నేను నిన్ను చేసుకున్నాననుకో ఇహ వారికి కాదు. అందుకే ఆలోచిస్తున్నాను" అని అన్నాడు.

అది నిజమేగా అని అనుకొని అతనిని నమ్మింది పద్మ.

ఓ రోజు సినిమా చూసి యింటివరకూ దిగబెట్టాడు. అబ్బా! తలనొప్పిగా వుంది అన్నాడు. సరే లోనికి రండి కాఫీ పెట్టి యిస్తాను అంది మర్యాదగా.

పిలిచినదే తడవుగా లోనికివచ్చి చాలసేపు కూర్చొని అదీ ఇదీ మాట్లాడి, "నా పద్మా! నా రాణి" అంటూ కౌగలించుకొని అలానే మంచంమీదికి లాగేశాడు.

పద్మ అభ్యంతరం పెట్టింది. బ్రతిమాలింది. ఏడ్చింది.

"పిచ్చి! భయమెందుకూ! నేనేగా నిన్ను పెళ్ళాడేది" అని ఎన్నో తీయతీయని మాటలు చెప్పాడు.

అప్పటినుండి అతని రాకపోకలు ఎక్కువ కాసాగింది.

"ఉండలేకపోతున్నాను పద్మా" అని అనేవాడు.

మాంసం గారెలు వండి పెట్టమనేవాడు.

"మీరు బ్రాహ్మలుకదా!"

"అయితే తినకూడదని ఎక్కడా లేదు. నాకు ఫ్రెండ్సుతో అలవాటు అయింది. నేను మా యింట్లో మాత్రమే బ్రాహ్మడిని" అని అనేవాడు.

ఊరు వూరంతా పుకారెత్తిపోయింది.

అతను వాళ్ళ చెల్లెళ్ళ పెండ్లికాగానే నన్ను చేసుకుంటా నన్నాడని తన వాడకట్టులో చెప్పింది. అక్కడ మాత్రం మర్యాదకి మొహం మీద వూరుకున్నారు.

ఎన్ని అవమానాలు భరించినది.

రోడ్డుమీంచి వెళ్తూవుంటే కుర్రాళ్ళు చాల అసహ్యంగా మాట్లాడేవారు. ఆఫీసులోనూ తనంటే చులకనగానే వుండేది. ఒకటి అనాధ. రెండు ఇది. అయినా అన్నీ అతనికోసం భరించినది.

తను అన్ని చెప్పుకొని ఏడిస్తే "ఇంకా ఒక చెల్లి వున్నది. దాని పెండ్లి అలా కాగానే మన పెండ్లి ఇలా అయిపోతుంది. అప్పుడు అందరి మొఖాలమీద చెప్పు తీసుకొని తన్నినట్లు వుంటుంది" అని ఓదార్చేవాడు.

అతని మాటలు నమ్మి మోసపోయింది. ఇప్పుడు అతనికి పెండ్లి గనుక అయితే ఈ మనుష్యులు తనని బ్రతకనిస్తారా?

భయంతో గజ గజ లాడిపోయింది.

అతనితో నాలుగేళ్లు కాపురంచేసింది. రెండుసార్లు అబార్షన్ను చేయించుకొన్నది.

అయినా రేపుమీద ఆశతో బ్రతికింది.

పద్మకి దుఃఖం పొంగి పొర్లింది.

శేషగిరి రాత్రిళ్ళు సాధారణంగా పద్మ యింట్లోనే వుండేవాడు. వీళ్ళిద్దరి బాంధవ్యానికి అందరూ అలవాటు పడిపోయారు. వీరినిచూసి చెవులు కొరుక్కోవడం హేళన



చేయడం తగ్గింది.

ఇంతలో ఈ అవాంతరం.

3

ఆ సాయంత్రం శేషగిరి మామూలుగానే వచ్చాడు.

పద్మ మామూలుగానే ప్రవర్తించినది.

అన్నం తింటున్నప్పుడు శేషగిరి పద్మతో అన్నాడు.

"పద్మా! నాలుగు రోజులు సెలవుపెట్టి మా వూరు వెళ్తున్నాను."

"ఏం పనిమీద?"

"ఏమీలేదు. మా నాన్నగారికి ఆరోగ్యం బావుండటం లేదట. రమ్మని వ్రాశారు."

చివరిక్షణం వరకూ మోసగించాలనే చూస్తున్నాడు. పద్మకి అసహ్యం దుఃఖం కలిగినది.

"అబద్ధం ఎందుకు? మీ పెండ్లి అటగా" తీవ్రంగా అడిగింది.

"ఎవరు చెప్పారు?"

"మన భాగోతం వూరందరికీ తెలుసు. అందులో ఎవరో ఒకరు చెప్పారులే."

"తెలిస్తే ఇంక నన్ను అడగడం ఎందుకు?"

"ఏవిటీ నిజమేనా?" కళ్ళు పెద్దవిచేసి అడిగింది.

"అవును నిజమే!"

"మరి నా గతో?"

"నిన్ను ఎప్పటిలానే వస్తూపోతూ చూచుకుంటాను పద్మా!"

"అంటే....అంటే ఓ వుంపుడు గత్తెలానా" అతని వేపు క్రోధంగా చూస్తూ అడిగింది.

"ఛ! అలాకాదు. అదికాదు పద్మా! మా నాన్న మన పెండ్లికి వొప్పుకోలేదు. నాకు పెండ్లి అయినా అది మా యింట్లోనే వుంటుంది. ఈ దీనుడు ఈ దేవిగారి సన్నిధిలోనే వుంటాడు" వూరడిస్తూ అన్నాడు.

"అయినా! దానికి అర్థం వుంచుకుంటాననే. నన్ను ఇలా మోసం చేయడం నీకు న్యాయమేనా? ఆలోచించు, నేను నీ వెంటపడలేదు. నీకు పెండ్లి అవుతే నన్ను ఈ సంఘం బ్రతకనిస్తుందా?" ఏడుస్తూ అన్నది.

"ఓ అనాధముండని చేసుకుంటే ఆ సంఘం నన్ను బ్రతకనీయదు. నీకు నా అనేవాళ్లు లేరు. నా వెనుక నా తల్లి దండ్రి అక్కా చెల్లెళ్ళు పెద్ద కుటుంబం వున్నది. నీ కోసం వాళ్ళనందరినీ బలి పెట్టాలనా" హేళనగా అన్నాడు.

"నేను నీవెంట పడివుంటే నీవా మాట అన్నా పడి వుండేవాన్ని. నావెంటపడి నన్ను భ్రమలోకి లాగింది నీవేగా. నా జీవితం పాడుచేసి యీరోజు ఇలా మాట్లాడటం న్యాయమేనా?"

"అసలు అనాధశరణాలయంలో వున్నప్పుడు నీవు

చెడలేదని గ్యారంటీ ఏమిటి?"

చురకత్తి సూటిగా గుండెల్లో దిగినట్లు అయింది. ఆ మాటలన్న తరువాత యింక మాట్లాడటం అనవసరం అని ఏడుస్తూ వుండిపోయింది.

"ఇదిగో! పద్మా! నీవిలా ఏడిస్తే నేను నీ ఛాయలకే రాను. నేను పెండ్లి చేసుకున్నా నిన్ను మునుపటిలానే చూచుకొంటాను. అది నీ కిష్టం అయితే సరే. లేదా నీ ఖర్మ!" అంటూ లుంగి విప్పి పేంటు వేసుకోసాగాడు.

పద్మలో ఒక దృఢనిశ్చయం కలిగింది.

తల ఎత్తి అతనివేపు చూస్తూ—"మీతో సంబంధం పొడిగించుకోవడం నా కిష్టంలేదు. రేపు మీరు రండి మీ కిష్టమైన కోడికుర్మా, గారెలు చేసిపెడతాను. మీ పెండ్లి అయిన తరువాత మీరెవరో నేనెవరో. నా జోలికి రావద్దు" అని అంది.

శేషగిరి శని ఇలా తొందరగా విరగడవుతున్నందుకు చాల సంతోషించాడు.

4

మధ్యాహ్నం ఉషారుగా వచ్చాడు. పద్మ తల స్నానం చేసి అందంగా తయారయింది.

లుంగీ కట్టుకొని ముందుగదిలో కూర్చున్నాడు.

ముందు గదికి వంటగదికి మధ్యలో చిన్న గోడ మాత్రమే అడ్డు. పొయ్యి మీద పెద్ద కళాయిపెట్టి దాని నిండా నూనెపోసింది.

గారెలు వత్తడానికి పద్మ కూర్చుంది. అది చూపి లొట్టలు వేస్తూ, పత్రిక తిరగవేస్తూ కూర్చొనివున్నాడు శేషగిరి.

నూనె బాగా కాగింది.

పద్మ నూనె కళాయిని గుడ్డతో పట్టుకొని తెచ్చి గోడ మీదుగా వంగి శేషగిరి నెత్తిమీద వొంచేసింది.

అదాట్టుగా ఏదో తీయని కలల్లో, క్రొత్త భార్యతో అనుభవించ బోయే ఆనందాన్ని వూహించుకొంటూ వున్న శేషగిరి....నూనె మీద పడగానే గావు కేకలు వేశాడు. పిచ్చిగా వెర్రిగా అరుస్తూ గంతులు వేస్తున్నాడు.

శేషగిరి అరుపులు విని ఇంటిలో అద్దెకున్న వారు, చుట్టు ప్రక్కలవారు పరుగు పరుగున వచ్చారు.

కళ్ళు వేడికి పేలి, మొహం వొళ్ళూ అంతా వికృతంగా బొబ్బలు తేలి బాధతో వేసిన గంతులకి లుంగీవీడి నగ్న శరీరంతో భయంకరంగా వున్నాడు.

"ఏవిటమ్మా యిది?" అందరూ ముక్త కంఠంతో అరిచారు.

"అదా! మోసానికి ఫలితం!" ధీమాగా అన్నది.

"ఇప్పుడు పోలీసులు నిన్ను వూరికే వదలుతారా?" ఇంటిగల మామ్మగారి అబ్బాయి ప్రశ్నించాడు.

పద్మ విరక్తిగా నవ్వింది.

"తల్లి దండ్రి లేక అనాధగా పెరిగాను. బ్రతకడం కోసమే చూశాను. చచ్చేవరకూ బ్రతకాలను కున్నాను. అంతకన్నా వేరే ఆశలు నాకేవీ లేవు.

కానీ! ఈ దుర్మార్గుడు నా జీవితంలోకి బలవంతంగా ప్రవేశించి, నన్ను ప్రేమించానని, పెండ్లి చేసుకుంటానని, మోసగించి నాలుగు సంవత్సరాలు నన్ను యధేచ్ఛగా అనుభవించి, నలుగురిలో అవమానం పాలుచేసి, యీరోజు నన్ను యీ సంఘం అనే తోడేళ్ళకి మాంసం ముక్కలా విసిరి, తనదారి చూసుకుంటున్నాడు.

ఈ దేశస్త్రీలు ఇలా నాలా ఎంతోమంది బలి అవు

తున్నారు. నా కెవ్వరూ లేరు. నాలా మోసగింపబడిన వని తలు నాలానే ప్రతీకారం తీర్చుకోవాలని వారికి నా జీవితం ఓ సందేశం. నన్ను చేసిన మోసానికి ఫలితం అనుభ వించాలిసిందే! వీడిని మరే స్త్రీ దగ్గరకు రానీయకుండా చేశాను." కసిగా అన్నది. ఆమె కళ్ళు మత్తుగా తూలి పోతున్నాయి.

"పోలీసులు మిమ్మల్ని మాత్రం వదలుతారా?"

ఎవరో ప్రశ్నిస్తున్నారు.

ఆమె నేలకి ఒరుగుతూ వెర్రిగా నవ్వింది. ఆ నవ్వులో వేదాంతం వున్నదో, సందేశం వున్నదో, ఈ దేశ అభాగి నులకే అర్థం అవుతుంది.

శేషగిరి కాలిన శరీరంతో గంతులు వేసి, వేసి స్పృహ కోల్పోయాడు. ★

ఎవరుంటారు ?

ఓ సభలో కవి ఆవేశంగా తన కవిత చదువుతున్నాడు:

కవి:—ఎవరుంటారు? ఎవరుంటారు? చివరివరకు ఎవ రుంటారు?....

శ్రోత:—ఉంటాడు! ఉంటాడు! ఒకడుంటాడు! వాడే మైకువాడు!!

—వి. ఎస్. రాజు, మద్రిపూడి.

ముళ్ళపూడి నాగేశ్వరరావు

కధలు చెప్పకు!

కళ్ళముందు కోటిసూర్యుళ్లు వెలిగినట్టయ్యింది. జీవితంలో అంత వెలుతురు ఎప్పుడూ చూడలేదనిపించింది.

కళ్లు గట్టిగా మూసుకున్నాను. కాని కాంతి కనురెప్పల్ని చీల్చుకుని లోపలికి ప్రవేశిస్తోంది.ఆ లైటు ఎన్ని కాండిల్సో!

నా చేతులు టేబిల్‌మీద ఆనివున్నాయి. స్పర్శబట్టి అది అతి ఖరీదైన చెక్కతో చెయ్యబడ్డదని చెప్పొచ్చు. దీర్ఘ చతురస్రాకారంగా ఉందా టేబిల్. ఆ టేబిల్‌కి ఒక చివర గాడ్రెజ్ ఛెయిర్‌లో కూర్చునివున్నాను నేను. నా కెదురుగా సరిగ్గా నా కళ్ళలో పడేటట్టుగా అమర్చబడి వుందా లైటు.

టేబిల్‌కి రెండువైపులా యింకా కుర్చీలు వున్నాయి. ఆ కుర్చీల్లో మనుషులు కూర్చున్నట్టుగా మాత్రం నాకు తెలుస్తోంది. వాళ్ళ ముఖాలేవి నాకు కనిపించవు. నా ముఖం మాత్రం అందరికీ కనిపిస్తుంది.

"కమాన్ చెప్పు!" మళ్ళీ బొంగురుగా పలికిందా కంఠం లైటువెనక నించి. అది అప్పుడే ఆరోసారి ఆ కంఠం అలా అనడం.

"నాకేం తెలియదు."

"డామిట్! స్టాప్‌టెల్లింగ్ స్టోరీస్" ఆ గొంతులో అసహనం ధ్వనిస్తోంది.

ఈపాటికి అందరికీ అర్థం అయ్యేవుంటుంది. అది "ఇంటరాగేషన్" రూమ్.

* * *

ఆ మేడవేపు, టెలిగ్రాఫ్ స్తంభంవైపు మార్చి మార్చి చూశాను.

"ఫర్వాలేదు. పెద్దకష్టం కాదు" అనుకున్నాను మరోసారి మనసులో. అవును ఆ స్తంభంపైనుంచి మేడమీదకి దూకడం పెద్ద కాష్టంకాదు. రిస్క్ అసల్లేదు. ఆ స్తంభం పైనుంచి మేడమీదకు చేరడానికి క్షణకాలం చాలు. కింద నుంచున్న వాడెవడేనా కన్నుమూసి కన్నుతెరచే లోపల నేను స్తంభం పైనుంచి అదృశ్యం అవుతాను.

మూడు నెలలనుంచి కష్టపడి వేసిన ప్లాన్ ఇది.

మూడునెలల క్రితం ఆ ఇంట్లో ఏదో స్విచ్ పాడయిపోతే స్విచ్ మార్చడానికని వచ్చాను ఆ ఇంటికి. అప్పటి నుంచి ఆ ఇంటిగురించి, ఆ ఇంట్లో వాళ్ళగురించి చాలా ఇన్ఫర్మేషన్ సంపాదించాను.

ఆ ఇల్లు ప్రస్తుతం ఆ యింట్లో వుంటున్నవాళ్ళ స్వంత ఇల్లుకాదు. ఆరునెలల క్రితం అందులో అద్దెకి దిగారు.

ఆ ఇల్లు మొత్తానికి వుంటున్నది భార్యాభర్తా యిద్దరే. భర్త ఏదో లాబొరెటరీ సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. వయస్సు ముప్పై వుంటుంది. భార్య విమెన్స్ కాలేజీలో పాలిటిక్స్ లెక్చరర్‌గా వర్క్ చేస్తోంది. ఆమెక్కూడా అదే వయసు వుంటుంది.

అతడు వుదయం తొమ్మిదింటికల్లా ఆఫీసుకు వెళ్ళిపోతాడు. మళ్ళీ సాయంత్రం ఐదింటికి కాని యింటికి తిరిగి రాడు.

ఆమెకూడ తొమ్మిదిన్నరకల్లా కాలేజీకి వెళ్ళిపోతుంది. కాలేజీదగ్గరే అవడంవలన మధ్యాహ్నం ఒంటిగంటకు తిరిగి వస్తుంది. ఓ అరగంట వుండి వెళ్ళిపోతుంది. మళ్ళీ ఐదుంపావుకి తిరిగివస్తుంది.

ఒక్క ఆదివారాలు, సెలవుదినాలు తప్పిస్తే ఆ తొంభై రోజుల్లోను ఆ కార్యక్రమంలో ఏంమార్పు రాలేదు.

సమయం తొమ్మిది గంటల ఏడునిమిషాలయ్యింది. అతను యింటిలోంచి గబగబా బయటికి వచ్చాడు. బయట స్కూటర్ పార్క్ చేసివుంది. స్కూటర్ వెంటనే స్టార్ట్ అయ్యింది. అతను దూసుకుని వెళ్ళిపోయాడు.

నేను మరో రెండు సిగరెట్లుకొని, అంతవరకు నిల్చుని వున్న కిళ్ళీకొట్టు దగ్గర నుంచి కదిలాను-అక్కడ ఎక్కువ

సేపు నిలబడివుంటే వాడు తర్వాత నన్ను గుర్తుపడతాడేమోనని.

జేబులో చెయ్యిపెట్టాను. చిల్లరతోపాటు తాళాలగుత్తి కూడ గలగల తగిలింది. గట్టిగా దమ్ముపీల్చి వదిలాను.

మరో ఇరవై నిమిషాల్లో ఆమె వెళ్ళిపోతుంది. మరో అరగంటలో నేనా మేడమీద వుంటాను. ఎందుకేనా మంచిది ఏవేనా మర్చిపోయి వెనక్కి రావచ్చని ఆ మాత్రం వ్యవధి యిచ్చాను. ఇంట్లోకి ప్రవేశించడానికి మరో పది నిమిషాలు పట్టచ్చు. తర్వాత యింట్లోంచి ఎంతసేపటికి బయటపడతామన్నది ఖచ్చితంగా చెప్పలేం.

ఖరీదైన వస్తువులు, డబ్బు వెంటనే దొరికితే ఐదు నిమిషాల్లో బయటకువచ్చేయచ్చు. లేకపోతే అరగంట పడుతుంది. ఎట్టిపరిస్థితిలో అరగంట మించి టైం తీసుకోను నేను.

సరిగ్గా హెచ్. ఎమ్.టి. వాచ్ తొమ్మిదీ ఇరవై తొమ్మిది చూపిస్తుంటె ఆమె బయటకు వచ్చింది. పూర్తిగా ఎర్రటిడ్రెస్‌తో వుంది. ఎర్రటి ఎత్తుపడమల జోళ్ళు, ఎర్రటిచీర, చీరకూ జోడుకూ మధ్య ఎర్రటి లంగా కుచ్చెళ్ళు, ఎర్రటి జాకెట్టు, పెదాలకు ఎర్రటి లిప్‌స్టిక్, చెవులకు ఎరుపుపొడివున్న దుద్దులూ, ఎడంచేతికి ఎర్రటి డయిల్ వాచ్, కుడిచేతికి ఎర్రపొళ్ళ గాజులు.

ఆమె ఒంటిమీదున్న వస్తువుల వెల కట్టటానికి ప్రయత్నిస్తోంది నా మెదడు. ఆమె కుడిభుజం నుంచీ వేలాడుతున్న ఎర్రటి వానిటీబాగ్‌లో ఎంత డబ్బుంటుందో అని ఆలోచిస్తున్నాను. ఆమె నడుస్తుంటె రూపాయినోట్లు నడుస్తున్నట్టుంది.

టైము తొమ్మిదీపభై అయ్యేటప్పటికి నేను అప్పారావు

సైకిలుషాపులో వున్నాను. సైకిల్ అద్దెకి తీసుకుని ఐదు నిమిషాల్లో ఆ ఇంటిదగ్గిరకి చేరుకున్నాను. తిన్నగా తీసుకెళ్ళి సైకిల్ని స్తంభం దగ్గరే ఆపాను. చేతిలో చిన్న తోలుసంచీ వుంది.

ఎండ వేడి క్రమంగా హెచ్చుతోంది. జనసంచారం క్రమంగా తగ్గుతోంది.

రోడ్డుమీద యిద్దరువ్యక్తులు మాత్రమే నడుస్తున్నారు. కిళ్ళీకొట్టు వ్యక్తి కిళ్లీలు కట్టడంలో నిమగ్నం అయి వున్నాడు. ఆ స్తంభం ఎక్కాలంటే నిచ్చెనవేసుకుని ఎక్కాలి. మరే ఆధారంలేదు. లేకపోతే కొబ్బరిచెట్టు ఎక్కినట్టు పాకుతూ ఎక్కాలి.

నేను రెండోపద్ధతే అనుసరించాను. కాని స్తంభం నున్నగా వుంది. కాళ్ళకి పట్టు చిక్కటల్లేదు. జారిపోతున్నాయి. స్తంభంపై కెక్కితే నుంచోడానికి ఆధారంవుంది. ఎందుకంటే అక్కడ నిలబడి ఎప్పుడూ రిపేర్లు చేస్తూ వుంటారు.

స్తంభంమీంచి కిందకి పరిశీలనగా చూశాను. కిళ్ళీకొట్టు వాడు కిళ్ళీలు కట్టుకోవడంలో మునిగిపోయాడు. రోడ్డుమీద ఒక పిట్టకూడ లేదు.

మరో ఐదునిమిషాలు అక్కడేదో రిపేరుచేస్తున్నట్టు నటించాను. అప్పుడు నన్నెవరేనా చూస్తే టెలిఫోను తీగలు రిపేరుచేసేవాడు అనుకుంటారు.

భగవంతుణ్ణి తలచుకొన్నాను.

ఊపిరి బిగబట్టి చటుక్కున మేడమీదకు దూకాను. మేడముందు పిట్టగోడ చాలా పొట్టిగావుంది. నేను పడ్డప్పుడు 'దబ్' అన్న శబ్దం నా చెవులకు విచిత్రంగా వినిపించింది. పడ్డంలో కుడిమోకాలు, ఎడం మణికట్టూ



కొద్దిగా బెణికాయి. కళ్ళొకసారి చీకట్లుకమ్మి మళ్ళీ మామూలయ్యాయి.

తలుపుకి వేసున్న తాళం ఖరీదైనదే కాని నా దగ్గరున్న తాళం చెవులగుత్తితో ఈజీగా వచ్చేసింది. ఆరోతాళం చెవితో నా ప్రయత్నం ఫలించింది.

గది నీటుగా సర్దబడివుంది.

గదిమధ్యగా టీపాయ్. టీపాయ్‌చుట్టూ నాలుగు కుర్చీలు వేసివున్నాయి. టీపాయ్‌మీద నిన్నటి హిందూ మడతపెట్టి వుంది. గోడమీద రెండుగ్రూప్ ఫోటోలున్నాయి. కుడిచేతి వెంపున రెండు గాడ్రెజ్ బీరువాలున్నాయి.

మొదటి బీరువా తెరవడానికి చాలా టైంపట్టింది ఒక అరలో బట్టలు, ఒక అరలో మేకప్‌సామాన్లు, ఒక అరలో పుస్తకాలువున్నాయి.

ఎంత వెతికినా ఖాగాఖరీదైన వస్తువులేవీ కనిపించటల్లేదు. రెండో బీరువా మొదటి బీరువాకంటె సులభంగా వచ్చేసింది. దాన్లో పై అర అంతా పైళ్లతో నిండివుంది.

విపరీతంగా చమటపడుతోంది. చమటబిందువులు కళ్ళ జోడుమీదకి జారాయి. తుడుద్దామని కళ్ళజోడు తీసాను.

ఇంతట్లోకి తలుపుదగ్గర ఏదో చప్పుడయ్యింది. గుండెలు ఝల్లుమన్నాయి.

లేచివెళ్ళి తలుపు లాగాను. రాలేదు. అవతలవేపు ఎవరో గొళ్ళెం పెట్టేరు.

మైగాడ్! ఇప్పుడేం చెయ్యాలి?

నా ప్లాన్ ఎందుకిలా బెడిసికొట్టింది. ఎప్పుడూ యింటికి తిరిగిరానివాళ్ళు ఈవేళ యెందుకు వచ్చారు. డామిట్! అసహనంగా కాళ్లు నేలకేసి కొట్టాను.

ఏంచెయ్యాలి? ఇంతకీ అవతలవేపు తలుపు గొళ్ళెం పెట్టింది భార్యా? భర్తా? పోలీసులకి ఫోన్ చెయ్యడానికి కిందికి వెళ్ళారా?

తిన్నగా వచ్చి సాలెగూడులో చిక్కుకున్న ఈగలా వుంది నా పరిస్థితి.

ఇంతవరకు నేను చేసిన ఏడు దొంగతనాల్లో ఎప్పుడూ దొరకలేదు. నా పేరు పోలీసురికార్డుల్లోకి యెక్కలేదు. పోలీసులు, కటకటాలు, ఎత్తైన జైలుగోడ నా ఊహల్లో కదిలాయి.

అప్పుడు చూశాను తలుపుకి పక్కనేవున్న కిటికీని. వెళ్ళి తెరిచాను.

నా ప్రశ్నలకి సమాధానంగా,నా ఊహాలకు ఫుల్‌స్టాప్‌గా ఒక మెరుపు మెరిసింది. ఇరవైకి ఇరవైఐదుకీ మధ్య వయస్సున్న ఒక అందమైన అమ్మాయి ముఖం దర్శన

మిచ్చింది. ఈ మధ్య సినిమాల్లో తప్ప అంత అందమైన అమ్మాయి ముఖం నిజజీవితంలో చూడలేదు. ఆమె కళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి.

"గుడ్ మార్నింగ్ మిస్టర్!"

"గుడ్ మార్నింగ్" అన్నాను నీరసంగా.

"మీరు వచ్చి యెంత సేపయ్యింది."

నేను మాట్లాడలేదు.

"నేను వచ్చి పదినిమిషాలయ్యింది. మీరింకా ముందరే వచ్చి ఉంటారు."

అప్పుడనుమానం వచ్చింది. ఆమెకూడ నాలాటిదేమో నని.

"మీరెవరు?" కష్టంమీద నా నోరు పెగిలింది.

"కొంపదీసి నేనుకూడ మీలాటిదాన్నే అనుకుంటున్నారేమిటి?"

కంగారుపడ్డాను. ఈవిడకి టెలీపతీ ఏమేనా ఉందా?

"ఈ ఇల్లు మా అక్కాదీ బావదీ."

"ఐసీ."

"నే నివాళే హైదరాబాదునించి వచ్చాను. గోదావరి ఎక్స్‌ప్రెస్ లేట్‌గా వచ్చింది అందుకని తిన్నగా కాలేజీకి వెళ్ళి అక్కాదగ్గర తాళాలు తీసుకుని వచ్చాను. ఇంట్లో కొచ్చానో, లేదో పైనేవో శబ్దాలు వినిపించాయి—డ్రెస్ ఛేంజ్ చేసుకోకుండా పైకొచ్చాను."

"పోలీసులకి ఫోన్‌చేశారా?" ధైర్యంచేసి అడిగాను.

"లేదు. ఇంకా లేదు."

కొంచెం ధైర్యం వచ్చింది.

"మీ పేరు విద్యాసిన్హానా?"

"కాదు. అదేం అలా అడిగారు."

"మీరు విద్యాసిన్హాలా వున్నారు."

ఆమె నవ్వింది. "కాని నా ఫ్రెండ్సందరూ హేమ-మాలినిలా వుంటానంటారు."

"ఎనీ హౌ యూ వార్ స్మార్ట్!"

"థాంక్స్ లాట్! బియ్యేస్సీలో గోపాల్ అని మా క్లాసు మేటొకతను ఉండేవాడు. అచ్చు మీలాగే వుంటాడు. అతను మంచి కళాకారుడుకూడా. మీరుకూడ బాగా ఆరి తేరినట్టున్నారు. లేకపోతే ఇలా పట్టపగలే దొంగతనానికి రారు కదా!"

నేనేం మాట్లాడలేదు.

"ఇంతకీ మీ పేరేమిటి?"

"అసలు పేరేనా? లేక మారు పేరా?"

ఆమె మళ్ళీ నవ్వింది. ఆమె పలువరుస తళుక్కున మెరిసింది.

"నేనంత పెద్దదొంగను కాను. మీ పేరేవిటి?"

"నా పేరు మంజుల. మిస్ మంజుల."

"నైస్ టు సీ యూ."

"కాని మనం కలసిన పరిస్థితులే అంత బాగాలేవు."

నా బుర్ర చురుకుగా పనిచేస్తోంది. తప్పించుకోవడానికి మార్గాలు అన్వేషిస్తోంది.

"పరవాలేదు. విచిత్రమైన పరిస్థితుల్లో జరిగిన పరిచయాలే బాగుంటాయి."

ఆమె మళ్ళీ నవ్వింది.

"మీరు నాకొక చిన్న సహాయం చెయ్యండి. ఆ తలుపు గొళ్ళెం తియ్యండి. నేను చడీ చప్పుడూ లేకుండా వెళ్ళిపోతాను. కావాలంటే ఆ బీరువాలో సామాన్లన్నీ సర్దేసి మరీ వెళ్ళిపోతాను."



"ఏమిటీ?" అంది ఆమె తన అందమైనకళ్ళను మరింత పెద్దవి చేస్తూ.

"నాతో నేనేం తీసుకెళ్ళటల్లేదు. ఉత్తి చేతులతోనే వెళ్ళిపోతాను. నన్ను పోలీసులకి పట్టిచ్చినా మీకేం లాభం వుండదు, నాలుగైదుసార్లు స్టేషను చుట్టూ తిరగడం తప్పితే."

ఆమె మాట్లాడలేదు.

"అంతేకాదు. నేనిప్పుడిలా ప్రయత్నించడం వలన మీకో లాభం జరిగింది. ముందు ముందు మీ బావగారు ఇంటికి మంచి సెక్యూరిటీ వుండేలా చూసుకుంటారు. ఇంక నాలాటి వాళ్ళు ప్రవేశించే అవకాశం వుండదు. నేను

కలరా వేక్సిన్ లాంటివాణ్ణి. అది ముందు కలరా రాకుండా వుండటానికి పనికి వస్తుంది.”

అంతా విని ఆమె చిన్నగా నిట్టూర్చింది.

“మీరు చెప్పిందంతా బాగానే వుంది. మీరు చాలా తెలివైనవాళ్ళలా వున్నారు. ఐ ఎప్రిషియేట్ యు. బట్ ఐయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ. ఐ కాంట్ హెల్ప్.” మళ్ళీ నిశ్శబ్దం.

నాకు కథల్రాయడమే కాకుండా, కథలు చెప్పడంకూడా అలవాటు. ఇంక తప్పక చివరి అస్త్రం ప్రయోగించాను.

“చూడండి మేడమ్. నాగురించి మీరు సరిగ్గా ఊహించి నట్టు లేరు. నేను మీరనుకుంటున్నట్టు సాధారణ దొంగను కాను. నేను సి.బి.ఐ. ఏజంట్ను. ఈ మధ్య మీ బావగారు పనిచేస్తున్న లాబరేటరీలో విచిత్రమైన పరిశోధనలు జరుగు తున్నాయి. అవి దేశ రక్షణకు సంబంధించినవి.

వాటిలో కొన్ని యెలాగో ఇతర దేశ గూఢచారులకి అందుతున్నాయి. అవి ఎవరో ఓ సైంటిస్టుద్వారా బయటకు చేరుతున్నాయి. అందుకనే ఏ సైంటిస్టేనా ఆ పరిశోధనలకి సంబంధించిన కాగితాలను ఇంట్లో దాచుకుంటున్నాడేమో నని చెక్ చెయ్యడానికి వచ్చేను నేను. మీ బావగారి చెకింగ్ అయిపోయింది. ఆయనదగ్గర పరిశోధనలకు సంబంధించిన కాగితాలేం లేవు....”

నేను ఆగాను.

ఆమె కళ్ళు ఇంకా నవ్వుతున్నాయి.

“మీరు సి.బి.ఐ. ఏజెంటా!”

“అవును.”

"అయితే మీ ఐడెంటిఫికేషన్ కార్డ్ చూపించండి."

చిక్కుల్లో పడ్డాను.

"రూమ్‌లో మర్చిపోయాను. పాంట్ మార్చినప్పుడు అందులో ఒదిలేసాను."

"ఫోన్లెండి—అదేదో పోలీసులకి చెబుదురు గాని"

"అదికాదు. ఇప్పుడు నన్ను పోలీసులు అరెస్టుచేసి, కేసు బుక్ చేస్తే, అనవసరంగా నా పేరు బయటకువస్తుంది. మా డిపార్ట్‌మెంటు చికాకుపడుతుంది. ప్లీజ్! పోలీసులకి ఫోన్ చెయ్యొద్దు."

"ఇందాక అబద్ధం చెప్పాను. ఐయాంసారీ నేనిందాకనే పోలీసులకి ఫోన్ చేసాను."

"డామిట్! తలుపుతియ్యండి నేను వెళ్ళిపోతాను."

"ఎందుకలా చిరాకుపడతారు. పోలీసుల గురించి మీ రెలాగు భయపడక్కరలేదు. అందాక ఏవేనా కబుర్లు చెప్పండి."

నా మతిపోతోంది. అయితే ఆమె నా కథ నమ్మిందా? నమ్మి నన్ను విడిచిపెట్టలేదా?

"పి.బి.ఐ. ఏజెంటు కదా. మీ అడ్వంచర్స్ గురించి ఏవేనా చెప్పండి."

ఇంతట్లోకే ఇంటిముందర 'వేన్' ఆగినచప్పుడయింది.

"అదిగో మీ ఫ్రెండ్ వచ్చినట్టున్నారు," అంటూ ఆమె కిందకి వెళ్ళిపోయింది. నేను నిస్పృహతో కళ్ళు మూసుకున్నాను.

* * *

"నిజం నాకేమీ తెలీదు. ఆమె విడిచిపెడుతుందేమో

నన్న ఆశతో ఏదో కథ అల్లి చెప్పాను." నా గొంతుకలో ఏడుపు సుళ్ళు తిరుగుతోంది. నా వేళ్ళగోళ్ళు యెప్పుడో తీసేసారు. వాటిమీద ఇప్పుడు గుండుసూదులు గుచ్చు తున్నారు.

"డోంటాక్ రబ్బిష్." నా ముఖంమీద ఏదో తగిలింది. బహుశా అది పిడికిలి అయివుంటుంది. నా శరీరం అలాటి చిన్న చిన్న దెబ్బల్ని గుర్తించడం మానేసి చాలా సేపయ్యింది.

"నీకేం తెలీదూ. విద్యాసాగర్ లేబరేటరీలో దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయని, అవి విదేశ గూఢచారులకు చేరుతున్నాయని, అవన్నీ నీ కెవరు చెప్పారు? నువ్వింతకీ ఏ దేశ గూఢచారివి?"

అలాటి పరిస్థితుల్లోకూడ నా బుర్రపనిచేస్తోంది. జరిగిన ఘోరం ఏమిటో అర్థం అవుతోంది. స్పృహతప్పుతోంది.

స్పృహ వచ్చింది. కన్ను కొద్దిగా తెరచి చూసాను. అదే గది. డిమ్‌గా వెలుతోంది నీలంరంగు బల్బు. కుడిచేతి వైపున మూడవ కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసే టప్పటికి నాకు మళ్ళీ స్పృహ తప్పినట్టనిపించింది.

నాలుగవ కుర్చీలో ఉన్నతను మిగతావాళ్ళతో చెబు తున్నాడు. "ఈమె మిస్ మంజుల. మొన్ననే ఈమె మన సి.బి.ఐ.లో చేరారు."

అప్పుడు అర్థం అయింది నాకు పూర్తి కథ.

ఇంతలోకే ఎవరో అన్నారు "అతనికి స్పృహ వచ్చింది."

★

కోష్టాత్రి మరకలు

వినయ్



సార్జంట్ శేఖర్ ఆసక్తిగా వింటున్నాడు. నేను క్రిమినల్ ఇన్వెస్టిగేషన్‌లో మా కిచ్చిన ట్రెయినింగ్ గురించి చెబుతున్నాను—

"కానీ, ఏమిటంటే, అసలు చాలామంది హంతకులు

ఆవేశంతో హత్యలు చేస్తుంటారు. ఏ కొద్దిమందో ప్లాన్ వేసుకుని చేసినా, వాళ్ళప్లాన్‌లో ఎక్కడో ఓ లూప్‌హోల్ వుంటుంది. వాళ్ళుచేసే ఏదో ఒక చిన్న పొరపాటు వాళ్ళను పట్టిచ్చేస్తూ వుంటుంది. అందుకే హత్యకేసులు మనకు పెద్ద ఇంటరెస్టింగ్‌గా వుండవు. కాకపోతే కాస్త కామన్‌సెన్స్, టైమింగ్‌సెన్స్ వుండాలి."

నేనిలా అంటున్నంతలో ఒక్కసారి కళ్ళు జిగేల్ మన్నాయి. ఒక్కొక్క లైటూ వెలిగింది. "అమ్మయ్య, కరెంట్ వచ్చింది" అన్నాను, లోలోపల అనుకున్నట్టుగా. టేబిల్‌మీద వెలుగుతున్న కొవ్వొత్తి ఆర్పేసి, సొరుగులో పడేసాను. మాదెంత పోలీస్ డిపార్ట్‌మెంటు ఐనా మా దగ్గరుండేది సెర్చిలైట్లే కనుక, కరెంటు పోయినప్పుడు మాకూ కొవ్వొత్తులు వెలిగించుకోక తప్పదు, కరెంటు పోయినప్పుడల్లా.

జేబులోంచి ఐదు రూపాయల నోటు తీసిచ్చి, కానిస్టేబుల్‌ని ఖాజా, కాఫీ తెప్పించమన్నాను. కేసేదీ లేకపోవడంతో సార్జెంటు శేఖర్, నేనూ అవీ, ఇవీ మాట్లాడుతూ కూర్చున్నాం. కానిస్టేబుల్ తెచ్చిన చిప్స్‌తిని, కాఫీ తాగటం పూర్తయింది.

అంతలో ఫోన్ రింగవుతూండటంతో శేఖర్‌వైపు అందుకోమన్నట్టుగా చూశాను. తాపీగా సిగరెట్ పాకెట్టు తీశాను.

"సార్, ఏ.సి. మీకిమ్మంటున్నారు" అంటూ ఫోన్ నా కందించాడు.

విసుగ్గా ఫోనందుకున్నాను. ఆయన చెప్పినదంతా విని రిసీవర్ క్రేడిల్ చేశాను.

"ఏమిటిసార్" అంటున్న శేఖర్‌కి సమాధానం చెప్ప

కుండా, సిగరెట్ వెలిగించి, లేచి నిలబడి హాట్ అందు కున్నాను.

సార్జెంటు శేఖర్ లేచి నిలుచున్నాడు.

"హత్య. పద" అన్నాను బైటకు దారితీస్తూ.

2

"సార్, ఇదే యిల్లు" అంటూ బ్రేక్ వేశాడు శేఖర్.

జీప్‌దిగి లోనికి నడిచాను. సార్జెంటు శేఖర్ నన్ననుస రించాడు.

ఇంటిచుట్టూ జనం గుమికూడారు. అప్పటికే మా మిగతా సిబ్బంది వచ్చేశారు. తలుపుదగ్గర నిలుచున్న కాని స్టేబుల్ మమ్మల్ని చూడగానే సెల్యూట్ చేశాడు.

ముందు హాలు విశాలంగానే వుంది. బాగా ధనవంతులు కాకపోయినా మంచిస్థితిలో వున్నవాళ్ళేననిపిస్తూంది, ఆ ఫర్నిచర్ చూస్తుంటే.

"హత్య జరిగింది, ఆ గదిలోంచి వెళితే వచ్చే బెడ్ రూంలో సార్" అన్నాడు కానిస్టేబుల్ కుడివైపుగా చూపుతూ.

ఫోటోగ్రాఫర్ తన పని ముగించినట్టు అప్పుడే బైటి కొస్తున్నాడు. నన్ను చూడగానే విష్ చేశాడు.

"హల్లో డాక్టర్" అన్నాను, డాక్టర్ సింగ్ కనిపించ గానే.

"హల్లో ఇన్‌స్పెక్టర్" అన్నాడాయన నవ్వుతూ.

"మీ స్క్రూటినైజింగ్ పూర్తయిందా" అన్నాను, శవం వున్న గదిలోకి దారితీస్తూ. ఫింగర్‌ప్రింట్సు ఎక్స్ పర్ట్ తన సామాన్లు సర్దుకుంటున్నాడు.

హత్య చేయబడింది ముప్పయ్యేళ్ళ స్త్రీ. చంపబడింది సఫొకేటింగ్ ద్వారానని చూడగానే చెప్పొచ్చు. కనుగుడ్లు

వెలికి వచ్చాయి. నోరు బిగుసుకుపోయి వంకర తిరిగి వుంది. బాగా పెనుగులాడినట్టు పక్కంతా నలిగిపోయి వుంది. పగిలిన గాజులు గదంతా పడున్నాయి. అక్కడక్కడా కొవ్వొత్తి చుక్కలు. ఇంట్లో దొంగలు పడ్డట్టుగా వస్తువులన్నీ చిందరవందరగా పడివున్నాయి.

"డాక్టర్, ఏమిటి మీ రిపోర్టు" అన్నాను, డాక్టర్ సింగ్ వైపు తిరిగి.

"హంతకుడు మరీ బలవంతుడు అయివుండడు. కాస్త బలమున్న మగవాడయి వుండొచ్చు. చేత్తోకాక ఏ మఫ్లర్ తోనో గొంతుకు వురి బిగించి నోరు నొక్కిపెట్టి వుంటాడు. రెండు నిమిషాల్లో ప్రాణం పోయివుండొచ్చు" అంటూ గడియారం చూసుకుని, "హత్య ఎనిమిదీ ముప్పావు తొమ్మిదిల మధ్య జరిగివుండొచ్చు. పోస్టు మార్టమ్ తర్వాత కానీ ఖచ్చితమైన సమయం చెప్పలేను. నాట్ సో క్రిటికల్" అంటూ ముగించాడు.

"బీరువా తలుపులు, బల్లసొరుగు, తాళంకప్పలూ— వేటిమీదా వేలిముద్రలు లేవుసార్" అన్నాడు ఫింగర్ ప్రింట్సు ఎక్స్‌పర్ట్.

"ఇది నాగులుగాడి పనయివుంటుంది సార్" అన్నాడు, సార్జెంట్ శేఖర్.

నాగులు కే.డి. వాడి దొంగతనాలన్నీ ఇలాగే వుంటాయి. కానీ వాడు ఇంతకుముందు ఎప్పుడూ హత్యలు, కనీసం అటెంప్ట్సు కూడా చేయలేదు.

రొటీన్‌గా శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపటం వగైరా పనులన్నీ పూర్తయిపోయినాయి. ఈలోగా సార్జెంటు శేఖర్ హతురాలిని గురించిన సమాచారం సేకరించి వివరించాడు.

నీ పేరు మీద నేను కథలు రాస్తున్నానని.. నా పేరుతో మళ్ళీ వంటా వార్పులు రాసి పంపించటం ఏం బాలేదు రాణీ!!



ఆమె పేరు శకుంతల. భర్త అనంతరావు. అసిస్టెంటు ఇంజనీర్‌గా ఏదో కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్యా భర్తల సంబంధంగురించి పెద్దగా చెప్పుకోదగిన విషయా లేమీ లేవు. సాధారణమైన దంపతులు.

బీరువాలూ అవీతీసి వుండటం మూలాన హత్య దొంగ తనం ఆధారంగా జరిగినట్టు అనిపిస్తూంది. అనంతరావు వస్తే కానీ ఏమేం పోయాయో తెలియదు.

పోయిన కరెంటు వచ్చిన ఐదారు నిమిషాలకు పక్కింటావిడ పాలు తోడు పెట్టుకోవటానికి పెరుగుకోసం వచ్చి చచ్చిపడున్న శకుంతలని చూసి గావుకేక వేయటంతో, ఆమె భర్త పరిగెత్తుకొచ్చాడు. ఆయనే ఎవరింటినుండో పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేశాడు.

హతురాల్ని మొదట చూసిన పక్కింటావిణ్ణి, ఆమె భర్తని ఫార్మల్‌గా ప్రశ్నించాను. వారివద్దనుండి కొత్త వివరాలు ఏవీ తెలియలేదు. ఇంటి యజమాని అనంత రావు ఎక్కడికెళ్ళాడో తెలియదు.

పది దాటింది.

అంతలో ఒకాయన హడావిడగా "ఏం జరిగింది, ఏం జరిగింది" అంటూ లోపలకు వస్తూండటం కనిపించింది. బహుశా అతనే అనంతరావు అయివుంటాడు. ఎవరూ అతనికి సమాధానం చెప్పలేదు.

"మీరేనా ఈ యింటి యజమాని, ఐ మీన్ మిస్టర్ అనంతరావ్" అన్నాను.

అతను నన్ను అప్పుడే చూశాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని చూసేసరికి అతని కళ్ళల్లో భయం గోచరించింది. మనిషి సన్నగా వణుకుతూ

"అవును. నేనే. ఏంజరిగింది ఇన్‌స్పెక్టర్" అన్నాడు ఆదుర్దాగా.

"ఐయామ్‌సాకీ. మీ ఆవిడ హత్య చేయబడింది" అన్నాను.

"హత్యా?" అంటూనే నిశ్చేష్టుడయ్యాడు. తర్వాత భార్య శవాన్ని చూసి బావురుమన్నాడు.

"ప్లీజ్. డోంట్ అప్‌సెట్. ధైర్యం తెచ్చుకోండి" అన్నాను అనునయంగా.

కొద్దిసేపు అతను పిచ్చిగా, నర్వస్‌గా వుండిపోయాడు.

"ముందు మీ యింట్లో ఏమేం వస్తువులు పోయాయి, వాటి విలువ ఎంతవుంటుంది—అనే విషయాలు తేల్చుకోండి. పదండి, నేనూ మీవెంట వస్తాను" అంటూ లేచి నిలుచున్నాను.

అనంతరావ్, సార్జెంటు శేఖర్ నన్ను అనుసరించారు.

శకుంతల రిస్టువాచీ, మెళ్లో చెయినూ, డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉండే ఆమె లాకెట్—అంతే పోయింది.

దొంగ గాడ్రెజ్ బీరువావైపు వెళ్ళలేదు. మిగతా

బీరువాల్లోని బట్టలన్నీ చిందర వందరగా పడేసాడు వంటిల్లంతా గాలించినట్టుగా వుంది.

మళ్లీ హాల్లోకి వచ్చి కూచున్నాం. సిగరెట్టు ఆఫర్ చేస్తే అనంతరావ్ తీసుకోలేదు. నేను వెలిగించాను.

"హత్యకు కారణం దొంగతనమని నాకనిపించటం లేదు" అన్నాను, అనంతరావ్ వైపు తిరిగి.

"మరి?" అన్నాడు, వెంటనే.

"మీకుగానీ, మీ ఆవిడకుగానీ ఎవరైనా శత్రువు లున్నారా?"

"నాకు వృత్తిగతంగా ఎవరో ఒకరిద్దరు శత్రువు లుండొచ్చు. ఐనా హత్యచేసేంత కక్ష ఉండటానికి వీల్లేదు. అదీ, నా భార్యను చంపి వాళ్లేం బావుకుంటారు?"

"మీ ఆవిడకు?"

"మా ఆవిడకు శత్రువులెవరు వుంటారు ఇన్‌స్పెక్టర్?" ఆశ్చర్యంగా చూశాడు.

"మిస్టర్ అనంతరావ్, ఇలా అడుగుతున్నందుకు అన్యథా భావించవద్దు. మీ ఆవిడమీద మీ అభిప్రాయం?"

"అంటే....?"

"ఆవిడకు మరెవరితోనైనా, ఏవైనా డీలింగ్స్ ఉన్నాయా?"

"ఇన్‌స్పెక్టర్. మీరు చాలా మీనింగ్‌లెస్‌గా మాట్లాడు తున్నారు" కోపంగా అన్నాడు అనంతరావ్.

అలాంటివి మాకు సర్వసాధారణం.

"ఐయామ్ సారీ! అందుకే మొదటే చెప్పాను— అన్యథా భావించొద్దని. చూడండి మిస్టర్ అనంతరావ్, నేర పరిశోధనలో మేం రకరకాల వ్యక్తుల్ని చూస్తుంటాం. రకరకాలుగా అనుమానించి ప్రశ్నిస్తుంటాం. ఒక్కో నేరా

నికి ఒక్కోరకమైన కారణం వుండొచ్చు. అందుకే మేం ఊహించే కారణాలు ఏవైనాసరే, వాటి విషయంలో నిజా నిజాలు విచారించటం తప్పనిసరి. ఇట్సాల్ రైట్. మరొక ప్రశ్న మీరు ఇప్పుడు ఎక్కణ్నించి వస్తున్నారు?"

"సినిమానుండి."

"ఐసీ. ఇఫ్ యూ డోంట్ మైండ్, టికెట్ ముక్క చూపిస్తారా?"

"ఎందుకు?" అసహనంగా చూశాడు.

నాకు కాస్త చికాకు కలిగింది.

"మీరు నిజంగా సినిమాకు వెళ్ళారో, లేదో తెలుసు కోవటానికి. దయచేసి మళ్ళీ ప్రశ్నలడగకండి. మాతో సహకరించటం మీ బాధ్యత."

అయిష్టంగా లేచి నిలుచుని జేబులో చేయిపెట్టాడు. బైటికి తీస్తుండగా ఏదో కాగితాల మడత జేబులోంచి కిందపడింది. నాదృష్టి దానివైపు వెళ్ళింది. 'ఆఫీస్ బిల్స్' అంటూ వంగి తీసుకున్నాడు అనంతరావ్. ఐతే, ఆ కాగి తాలకంటే నా కళ్ళను ఆకర్షించింది అతని ఎడంకాలి షూపైన వున్న తెల్లని మచ్చ.

"ఇదిగోనండి" అనంతరావ్ టిక్కెట్ ముక్క అందిం చాడు. తీసుకున్నాను. టిక్కెట్ నంబర్ నాలుగు ఒకట్లు కావటంతో రాసుకోకుండానే టిక్కెట్ తిరిగి ఇచ్చేశాను. అది జగదాంబ టాకీస్ బాల్కనీ టిక్కెట్టు.

"మీరొక్కరే వెళ్ళారా?"

"అవును"

"మీరు సినిమా హాల్లోనే ఉన్నట్టు మీకు ఏదైనా ఎలిబీ వుందా? ఐమీన్, మీ పక్కన కూర్చున్న వారెవరైనా సాక్ష్యం చెబుతారా?"



"పక్కన కూర్చున్నతను ఎవరో నాకు తెలియదు. మీరు మాత్రం ఎలా తెలుసుకుంటారు?"

"మా పద్ధతులు మాకుంటాయి. ఐతే మీరు సినిమా హాల్లోనే ఉన్నారుగా."

"అవును."

"వెల్. చివరిప్రశ్న. మీరీ హత్యచేశారా?"

క్షణంపాటు కలవరపడ్డాడు.

"నేను అక్కడ సినిమా చూస్తూ ఇక్కడ హత్య ఎలా చేయగలను? అయినా ఆ అవసరం నాకేమిటి?"

"ఇట్సాల్‌రైట్, థాంక్ యూ" అంటూ లేచి నిలుచున్నాను.

"పోస్టుమార్టమ్ తర్వాత శవం మీకు అప్పగించబడుతుంది. రేపు మధ్యాహ్నం జీపు పంపిస్తాను. మీరొకసారి హెడ్‌క్వార్టర్స్‌కు రావలసివుంటుంది. బైదిబై, ఈ కేసు తేలేవరకూ మీరు ఊరువదిలి వెళ్ళకండి" అన్నాను.

"రూమ్ లాక్‌చేశాను సార్!" అన్నాడు సార్జెంటు.

"మా కేసు పూర్తయేవరకూ ఆ గది మా అధీనంలో

వుంటుంది. ఎట్టిపరిస్థితిలోనూ మాకు చెప్పకుండా ఆ గది మీరు తెరవటానికి వీలులేదు" అన్నాను, బైటికి నడుస్తూ.

3

"క్వార్టర్స్ కెళదామా సార్!" అన్నాడు శేఖర్ జీప్ స్టార్ట్ చేస్తూ.

"లేదు. జగదాంబ థియేటర్‌కి పోనీ" అన్నాను.

శేఖర్ జీప్ పోనిచ్చాడు.

"ఐతే హత్యకు మోటివ్ దొంగతనం కాదా సార్," అన్నాడు శేఖర్ జీప్ మెల్లిగా పోనిస్తూ.

"కాదనే నా అనుమానం. ఎందుకంటే దొంగతనానికి వచ్చేవాడు అర్ధరాత్రిని ఎంచుకుంటాడు. కానీ సాధారణంగా అందరూ మెలకువగా వుండే సమయాన్ని యెంచుకోడు. ఎనిమిది, తొమ్మిదిల మధ్య సమయంలో అంతా భోజనాలు చేస్తూనో, ఇళ్ళు సర్దుకుని పడకలు పరుచుకుంటూనో ఉంటారు.

అంతేకాదు, మరొక విషయం. హంతకుడు ఎత్తుకు పోయినవి బైటకనిపించేవీ, అతి చిన్న వస్తువులూనూ. దొంగలు సామాన్యంగా బీరువాలు తెరవకుండా వెళ్ళరు. గాడ్రెజ్ బీరువా తెరవడం అతనికి సాధ్యంకాలేదనుకుందాం. శకుంతలను చంపిన తరువాతైనా అతను బీరువా తాళాలు వెతుక్కోగలడు కదా! ఆ మాత్రం రిస్కు తీసుకోని వాడు దొంగతనం చేయటానికి రాడు.

ఇంకో ముఖ్యమైన విషయమేమిటంటే, దొంగలు సాధారణంగా హత్యలు చేయరు. స్పృహపోయేటట్టు నెత్తి మీద దెబ్బ కొట్టడమో, లేకపోతే నోట్లో గుడ్డలు కుక్కి కట్టిపడేయడమో చేస్తుంటారు. ఎందుకంటే ఎంత పకడ్బందీగా దొంగతనం చేసినా తామెక్కడ పట్టుబడతామో

అనే అనుమానం వాళ్ళను పీకుతూనే వుంటుంది. అది క్రిమినల్ సైకాలజీ. అలాంటప్పుడు, హత్యచేసి పెద్దశిక్ష అనుభవించే రిస్క్ వాళ్ళు తీసుకోరు."

సార్జెంటు శేఖర్ నోరు వెళ్ళబెట్టాడు.

"నేను యింత లోతుగా ఆలోచించలేదు సార్. ఐతే హత్యకు కారణ మేమిటంటారు?"

"అది తెలుసుకోవటమే ఇప్పుడు మనముందున్న పని. అది తేలిపోతే హంతకుణ్ని యీజీగా పట్టుకోవచ్చు—" అన్నాను సాలోచనగా.

జీప్‌కు బ్రేక్ పడింది.

"జగదాంబ వచ్చింది సార్" అన్నాడు సార్జెంటు, ఇంజన్ ఆఫ్‌చేస్తూ.

హాటు తలమీద పెట్టుకుని దిగాను.

మమ్మల్ని చూడగానే వాచ్‌మెన్ గబుక్కున లేచి నిలుచుని సెల్యూట్ కొట్టాడు. మేం లోపలికి నడుస్తుండగా యెవరో చెప్పగా విని హాలు మేనేజరు హడావిడిగా మాకు యెదురొచ్చాడు.

"నమస్కారం సార్!"

ప్రతి నమస్కారం చేసాను.

"సినిమా కొచ్చారా సార్. ఇప్పుడే స్టార్టయింది" అన్నాడు వినయంగా.

కాదన్నట్టు తలాడించాను.

"ఒక కేసు విషయంలో కాస్త ఇన్‌ఫర్‌మేషన్ కావలసి మీ దగ్గరకొచ్చాను. పదండి. మీ ఆఫీసులో కూచుని మాట్లాడుకుందాం" అన్నాను.

రిలాక్సింగ్‌గా సిగరెట్ వెలిగించి మొదలెట్టాను.

"ఫస్ట్ షో ఎన్నింటికి స్టార్టు చేస్తారు?"

"ఏడుగంటలకు సార్."

"ఇంటర్వెల్ యెన్నింటికి?"

"ఎనిమిదిన్నరకి."

"ఐసీ" అంటూ, రెండుక్షణాలు ఆలోచించాను. ఒక సారి గట్టిగా సిగరెట్టు పీల్చి పొగవదిలాను. కిటికీలోంచి నల్లగా కనిపిస్తున్న ఆకాశంలో ఏదో నక్షత్రం మినుకు మినుకుమంటూ మెరుస్తూంది.

"మీ థియేటర్‌కు బాల్కనీ వుంది కదూ?"

"ఉంది సార్."

"ఆ గేటుకీపర్‌ని ఒకసారి పిలిపించండి."

గేటుకీపర్‌ని పిలవటానికి ఆఫీస్‌బాయ్ వెళ్ళాడు.

"మిస్టర్ మేనేజర్, మీరు ఫస్ట్ షోకి కట్ చేసిన టిక్కెట్లతో ఫోర్‌వన్స్, ఐ మీన్ వెయ్యినూటపదకొండు నెంబరుందా?"

రికార్డ్ తీసి చూసి, "ఉంది సార్" అన్నాడు.

మరో నిమిషంలో గేటుకీపరొచ్చాడు. పాతికేళ్ళుంటా యతనికి. చాలా చురుకుగా కనిపించాడు.

"ఇవాళ ఫస్ట్ షో సినిమాకొచ్చినవాళ్ళని నువు గుర్తించ గలవా?"

ప్రశ్న అర్థంకాక నీళ్ళు నమిలాడు.

"అంటే, ఎవరినైనా చూపించి ఇతను ఆ షోకివచ్చాడో లేదోనని అడిగితే చెప్పగలవా?"

"చెబుతాను సార్" అన్నాడు వుత్సాహంగా.

"వెల్. ఇతనొచ్చాడా?" అన్నాను, సార్జెంటు శేఖర్‌ని చూపిస్తూ.

"పోలీసు లెవరూ రాలేదు సార్."

"నేనడిగింది పోలీసులని కాదు, అతనే మఫ్టీలోగానీ

వచ్చాడా?" అన్నాను.

ఒక్క క్షణం తెల్లబోయాడు. తరువాత సార్జెంటు శేఖర్‌ని తేరిపార చూశాడు. "రాలేదాసార్" అన్నాడు నిశ్చయంగా.

శేఖర్ సన్నగా నవ్వాడు.

"ఇంటర్వెల్ ఎనిమిదీముప్పావు వరకూ కదా' ఇంటర్వెల్ తరువాత ఎవరైనా లేటుగా వచ్చారేమో చెప్పగలవా?"

"చెప్పలేను సార్" ఈ సారి కాస్త ధైర్యంగా సమాధానం చెప్పాడు.

"ఎందుకని?"

"సినిమాకు రష్ యెక్కువ వున్నప్పుడు ఎన్నిసీట్లు తక్కువవున్నాయో గుర్తుంచుకుంటాం. అలాగే మరీ తక్కువ వున్నప్పుడు యెన్నిసీట్లు నిండాయో గుర్తుంచుకుంటాం. ఇంటర్వెల్‌లో పాసులివ్వం. ఈ సినిమాకు రష్ బాగావుంది. ఫస్టుషోకి తొమ్మిది సీట్లే ఖాళీవున్నాయి. ఇంటర్వెల్ ఐనాక ఓ అరగంట తర్వాత లెక్క చూసుకున్నాను."

. "ఇవ్వాళ లెక్క సరిగ్గా వుందా? ఏమైనా పొరపాటొచ్చిందా?"

"సరిగ్గానే వుంది సార్."

"వెల్. నువ్వు చెప్పిన పాయింట్ ఒప్పుకుంటాను. ఐతే, దాదాపు అందరూ ఇంటర్వెల్ సమయం పూర్తయ్యేలోగా వచ్చేస్తే, ఏ ఒక్కరో ఆలస్యంగా, అంటే-సినిమా మళ్ళీ మొదలైనాక పది, పదిహేను నిమిషాలు ఆలస్యంగా వస్తే నీకు గుర్తుండాలి కదా. అలా ఎవరైనా వచ్చారేమో

చెప్పగలవా?"

"ఈ సినిమాకి అది కూడా వీలులేదు సార్!"

"ఏం?"

"ఏమంటే, ఇంటర్వెల్ తరువాత ఇరవై ఐదు నిమిషాలకి జయమాలిని డాన్సువుంది. అంతదాకా పెద్దముఖ్యమైన కథ ఏదీలేదు. అందుకని చాలామంది ఆ పాట మొదలయ్యే సమయానికే వస్తూవుంటారు. ఈ ఫస్ట్‌షోకి కూడా అలాగే జరిగింది."

నాకు కాస్త చికాకు కలిగింది. అనంతరావు ఎలిబీ దుర్భేద్యంగా వుంది.

టేబిల్‌మీద వుంచిన సిగరెట్‌పాకెట్ తీసుకోబోతుండగా వేళ్ళకేదో తగిలింది.

"ఇదేమిటి?" అన్నాను అప్రయత్నంగా.

"కొవ్వొత్తి సార్. సిటీ అంతా కరెంటు ఫెయిలయింది కదండీ. అప్పుడు కొవ్వొత్తి అంటించి నిలబెట్టాం. దాని తాలూకు కరిగిన కొవ్వు" మేనేజర్ వివరించాడు.

నవ్వొచ్చింది. అంతలోనే ఏదో తట్టింది.

"కరెంటుపోయింది ఇంటర్వెల్ సమయంలో కదూ?" అడిగాను.

"కాదుసార్. ఇంటర్వెల్ ఐపోయింది. మేం బెల్ మోగించాం. అంతలోనే కరెంటుపోయింది—దాదాపు పది నిమిషాలపాటు."

"ఐసీ" అన్నాను, లేచి నిలుచుంటూ. మేనేజర్‌కు థాంక్స్ చెప్పి బయటపడ్డాం.

కాస్త చికాకుగా వుంది. హాలుబైటకు వచ్చాం. సార్జెంటు శేఖర్ జీపువైపు నడవబోతుండగా వారించాను.

ఎదురుగా న్యూ ఉడ్‌లాండ్స్ లక్జరీ హోటల్ కనిపించింది.

"కాఫీతాగి వెడదాం, పద" అన్నాను.

హోటల్ కాంపౌండ్ గేటుదాటి నడుస్తుండగా కారు షెడ్డుకు పక్కనున్న మరోషెడ్డు కనిపించింది.

"శేఖర్! అదేమిటి?"

"జనరేటర్ రూంసార్."

"జనరేటర్ వున్నా, కనీసం అది స్టార్ట్ చేసేదాకా ఇంతపెద్ద హోటల్లో కొవ్వొత్తులు వెలిగించాలి కదూ?" అన్నాను, నవ్వుతూ.

తనూ వంతపాడాడు.

మేం లోనికడుగు పెట్టగానే మేనేజర్ యెదురొచ్చి, ప్రైవేటురూంలోకి దారితీశాడు. కాఫీ తాగుతూ కరెంటు ఫెయిలవటం గురించి ప్రస్తావించాను, సరదాగా. ఐతే, అతను చెప్పిన విషయం విని తెల్లబోయాను. నా ఊహ పొరపాటయింది...?

4

హెడ్ క్వార్టర్స్‌కు చేరగానే కేసుకు సంబంధించిన ప్రిలిమనరీ విషయాలు డైరీలో రాస్తున్నాను. సడన్‌గా ఏదో తట్టింది.

"శేఖర్" గట్టిగా పిలిచాను.

పరిగెత్తుకువచ్చాడు సార్జెంటు శేఖర్.

"వెంటనే వెళ్ళి అనంతరావ్‌ని తీసుకురా. అతని దగ్గర స్టేట్‌మెంటు తీసుకోవాలి."

"ఇప్పుడా సార్?" ఆశ్చర్యపోయాడు.

"ఇప్పుడే. వెంటనే" అన్నాను.

"ఓ.కె. సార్" అని వెళ్ళిపోబోయాడు.

"చూడు...." అన్నాను, ఆగమన్నట్టుగా.

ఆగి వెనక్కి తిరిగాడు.

"మనం వెళ్ళినప్పుడు బైటనుండి ఎలా వచ్చాడో అలాగే తీసుకురా. అదే డ్రెస్సు, అవే షూస్. అక్కడ క్షణం ఆలస్యం కాకుండా అతన్ని వెంటబెట్టుకురా" అన్నాను, ఉత్సాహంగా.

సార్జెంటు శేఖర్ బైటకు నడిచాడు.

సిగరెట్టు వెలిగించి ఆలోచించ సాగాను. నా ఊహ కరెక్టయితే ఎవిడెన్స్‌తో సహా రేపు ఈ హత్యకేసు కోర్టులో ఫైల్ చేయగలను. హుషారుగా సిగరెట్టు వెలిగించాను.

పదిహేను నిమిషాల్లో అనంతరావుని వెంటతీసుకుని వచ్చాడు సార్జెంటు శేఖర్. అతన్ని నఖశిఖ పర్యంతం పరిశీలించాను. షూస్ అవే. తెల్లని కొవ్వొత్తి మరక అలాగేవుంది. వెరీగుడ్. సన్నగా నవ్వుకున్నాను.

ఇంటరాగేషన్ ఆరంభించాను.

"మిస్టర్ అనంతరావ్, నిన్న మీరు జగదాంబతో సినిమా కెళ్ళానన్నారు. ఇంటర్వెల్ సమయం పూర్తి కాగానే మళ్ళీ థియేటర్‌లోకి వెళ్లారా?"

"ఎస్ ఇన్‌స్పెక్టర్. ఏం?" కాస్త మెల్లిగా అన్నాడు మేకపోతు గాంభీర్యంతో.

"ఇంటర్వెల్ తరువాత సినిమా స్టార్టింగ్‌నుండి వెళ్ళ లేదు. మరి కాస్సేపు ఎక్కడికో వెళ్ళారు—అంటాను. వాట్ డూ యూ సే?"

క్షణంసేపు మౌనంగా వుండిపోయాడు.

"అవును. హోటల్లో కూచున్నాను."

"ఏ హోటల్?"

"థియేటర్ ఎదురుగానేవుంది. న్యూ ఉడ్‌లాండ్స్."

"మీరు మళ్ళీ సినిమా కెళ్ళేసరికి ఏంనడుస్తూంది?"

"నెక్ట్స సీన్ జయమాలిని డాన్స్."

"మీరు ఎప్పట్నించి ఎప్పటివరకు హోటల్లో ఉన్నారో చెప్పగలరా?"

"సారీ, నేను టైం చూసుకోలేదు."

ఒక్క క్షణం ఆలోచించాను.

"పోనీ, ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలరా? మీ ఎడంకాలి షూ మీద ఆ మరక ఏమిటి?"

ఉలిక్కిపడి చూసుకున్నాడు.

"అది, కొవ్వొత్తి మరక."

"ఎలా అయింది?"

"అది.... అది.... ఇన్‌స్పెక్టర్, ఐనా ముద్దాయిని ప్రశ్నించినట్టు ఏమిటీ క్రాస్ ఎగ్జామినేషన్?" ఉడుగ్గా అన్నాడు.

"మిస్టర్ అనంతరావ్, ఇది ఇంటరాగేషన్. క్రాస్ ఎగ్జామినేషన్ రేపు కోర్టులో యెలాగూ తప్పదు" అన్నాను గంభీరంగా.

"మీ అభిప్రాయం?" కోపంగా అన్నాడు.

"తరువాత చెబుతాను. ముందు నా ప్రశ్నకి సమాధానం చెప్పండి" కఠినంగా అన్నాను.

"హోటల్లో కరెంటు పోయినప్పుడు కొవ్వొత్తులు వెలిగించారు. నా టేబిల్‌మీది కొవ్వొత్తి పడిపోతే నేను మళ్ళీ నిలబెట్టడానికి నా చేతిలోకి తీసుకున్నాను. అప్పుడు కరిగిన డ్రాప్ బహుశా నా షూమీద పడివుంటుంది."

"దటీస్ నైసాఫ్ యూ. అంటే, మీరు హోటల్లో వుండగా కరెంటు పోయింది కదూ?"

"అవును."

"ఏదీ, న్యూ ఉడ్‌లాండ్స్ హోటల్‌లో వుండగా,"

"ఎగ్జాక్ట్‌లీ."

"సరిగ్గా కరెంటు పోయినప్పుడే మీ ఆవిడ హత్య చేయబడింది" సాలోచనగా అన్నట్టు అన్నాను.

"అలాంటప్పుడు హోటల్లోవున్న నేను ఎలా హత్య చేయగలను?"

"మీరు హత్య చేశారని ఇంకా నే ననలేదే?"

"మీ అభిప్రాయం అదే కదా!"

"అఫ్ కోర్స్. మిష్టర్ ఆనంతరావ్, మీరు యీహత్య చేశారు. ఒప్పుకోండి. శిక్ష తగ్గుతుంది" అనునయంగా అన్నాను.

"నో. నేనీ హత్యచేయలేదు. అసలు ఎలా చేయ గలను?"

"చెబుతాను వినండి. జగదాంబలో ఇంటర్వెల్ వరకూ మీరు సినిమా చూశారు. ఇంటర్వెల్‌లో అందరితోపాటుగా బైటకొచ్చారు. తిన్నగా ఇంటికెళ్ళారు. వేగంగా నడిస్తే పదినిమిషాల కన్నా పట్టదు అడ్డదారిలో. మీరు యింట్లో కెళ్ళి మీ ఆవిడను హత్యచేశారు.

అదే సమయంలో కరెంటు ఫెయిలయింది. అది మీ ఇల్లే కనుక చటుక్కున కొవ్వొత్తి తీసి వెలిగించుకొచ్చారు. ఆ వెలుగులో, ఇంట్లోకి దొంగ ప్రవేశించినట్టుగా సాక్ష్యం సృష్టించారు. చేతికందిన చిన్న వస్తువులు జేబులో వేసు కున్నారు. అవి ఎక్కడో దాచి వుంటారు. వంటింట్లో సామాన్లు, బీరువాలో బట్టలు చిందరవందర చేశారు.

కానీ ఇక్కడ ఒక చిన్న లాజికల్ పాయింటు మరచి పోయారు. దొంగతనానికో, హత్య చేయటానికో వచ్చిన పరాయి వ్యక్తి, వెంట ఏ టార్చ్‌లైటో తెచ్చుకుంటాడు. అంతే కానీ కొవ్వొత్తి తెచ్చుకోడు. అనుకోకుండా కరెంటు పోయినప్పుడు ఇంట్లోని వ్యక్తి ఐతేనే అతనికి తెలుసు కనుక కొవ్వొత్తి వెదికి, తీసి వెలిగిస్తాడు.''

"ఆ కొవ్వొత్తి శకుంతల వెలిగించి వుండొచ్చుగా" తెలివిగా అన్నాడు అనంతరావ్.

"మేబీ. కానీ కాదు. ఎందుకంటే హత్య జరిగింది ఎనిమిదీ ముప్పావు, తొమ్మిదిల మధ్య. కరెంటుపోయింది ఎనిమిది ముప్పావుకి. కరెంటు పోయే సమయంలో ఆమె బ్రతికి వుందనుకుంటే, కొవ్వొత్తి వెలిగించివుంటే ఆమె హత్యానంతరం అది అలాగే వెలుగుతూ అక్కడే కరిగి పోయి వుండేది. లేదా వచ్చిన హంతకుడు ఆర్పేసేవాడు. సగం కాలినముక్క అక్కడ వుండేది. ఏదీ లేదు.''

"మీ ఊహసరియైనదో కాదో కానీ హత్యచేసింది నేను కాదు. నా భార్యను ఎందుకు హత్య చేస్తాను? అసలెలా చేయగలను?"

"మరి ఆ కొవ్వొత్తి మరక మీ షూ మీదికి యెలా వచ్చింది?"

"చెప్పానుగా." విసుగ్గా చూశాడు.

"మళ్ళీ ఒకసారి చెప్పండి'' అన్నాను, సార్జంటుశేఖర్ పక్కన తిరుగుతున్న టేప్ రికార్డర్ వైపు చూస్తూ.

న్యూ ఉడ్ లాండ్స్ హోటల్‌లో కరెంటుపోతే వెలిగించిన కొవ్వొత్తి కథ మళ్ళీ చెప్పాడు, అనంతరావ్.

"ఇది నిజమని ఖచ్చితంగా చెప్పగలరా?"

"అవును. కావాలంటే నేను హోటల్ కెళ్ళినట్టుబేరర్ సాక్ష్యం చెబుతాడు."

"బహుశా, మీరుహత్యచేసి,తిరిగి వెళుతూ హోటల్‌లో కెళ్ళారంటాను. ఏమంటారు?"

"అబ్‌సర్డ్."

"నో. ఇటీస్ ట్రూ. ఆ కొవ్వొత్తి మరక న్యూ ఉడ్ లాండ్స్ హోటల్‌ది కాదు."

"సిల్లీ. ఇక్కో కొవ్వొత్తి మరక ఒక్కోలాగా ఉంటుందా?"

"ఉండదు. బట్, మిష్టర్ అనంతరావ్, న్యూ ఉడ్ లాండ్స్ హోటల్‌లో అసలు కొవ్వొత్తి వెలిగించాల్సిన అవసరమే వుండదు. ఎందుకంటే వాళ్ళకు జనరేటర్ వుంది. అదీ, ఆటోమేటిక్ కనెక్షన్. అంటే కరెంటు ఫెయిలవగానే జనరేటర్ స్టార్టవుతుంది,అంటే హోటల్‌లో కూచున్న వాళ్ళకు అసలు కరెంటు పోయినట్టే తెలియదు. అంటే, ఆ కొవ్వొత్తి మరక మీయింట్లో మీరు వెలిగించిన కొవ్వొత్తి తాలూకుది. కనుక ఈ హత్యచేసింది మీరేనని ఖచ్చితంగా చెప్పగలను. మీరు తీసి దాచినవస్తువులు సంపాదించి కట్టు దిట్టంగా కేసు ఫైలు చేయగలను. పోతే ఎందుకు చేశారన్నది మీరు చెప్పాలి"—అన్నాను, అతని వంకచూస్తూ.

రక్తం ఇంకి పోయినట్టుగా అతని ముఖం పాలి పోయింది. తలదించుకున్నాడు. ★

రెండు పొరపాట్లు

విద్వాన్ శీలాదేవి

పాఠకుల పరిశోధన పోటీ-80

(బహుమతి రు. 50/-లు నగదు)

"ఇక్కడ ఆపండి సార్!" అన్నాడు ఖైదీ.

"ఈ ఇల్లేనా?" అడిగాడు జైలు ఉద్యోగి జీపుకు బ్రేక్

వేస్తూ.

ఖైదీ తలూపేడు మౌనంగా.

అది విశాలమైన రెండంతస్తుల భవనం! ఆ భవనం ఎదుట అందమైన పూదోట. ఇనప ఊచల గేటు.

"దిగు?" అన్నాడు సార్జంట్ ఖైదీ, చేతికున్న ఇనప గొలుసు బిగుతుగా పట్టుకుంటూ.

ఖైదీ రెండుచేతులకీ బేడీలు బిగించివున్నాయి. సార్జంట్ కిందికి దిగగానే, తనూ నిశ్శబ్దంగా జీపుదిగాడు.

పాతికేళ్లుంటాయతనికి. వయసుకు మించిన ఎదుగుదల. అందంగా ఆరోగ్యంగా వున్నాడు. తెల్లని ఒళ్ళు, చారడేసి కళ్ళు, నిండైన బుగ్గలు, కోటేరు ముక్కు, ఉంగరాల జుత్తు, మృదువైన చేతులు.

వాళ్లు దిగగానే డ్రైవింగ్ సీట్లోంచి ఓ కానిస్టేబుల్ కూడా దిగి ఖైదీ కుడిపక్కన జేరాడు. సార్జంట్ గేటుతోపి కాంపౌండ్‌లో ప్రవేశించాడు. అతని వెనకే ఖైదీ, కానిస్టేబుల్ అనుసరించారు.

ముగ్గురూ వడి వడిగా అడుగులు వేస్తూ భవనం మేన్ డోర్ని సమీపించారు. తలుపు మూసుంది. కానిస్టేబుల్ చెయ్యెత్తి గుమ్మానికున్న కాలింగ్ బెల్ నొక్కాడు.

లోపల సూది పడితే వినిపించే నిశ్శబ్దం రాజ్యమేలు తున్నట్టుంది. అందుకే ఎక్కడో మోగుతున్న బెల్ శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది వాళ్ళకి.

రెండు నిమిషాల తరవాత తెరుచుకుంది తలుపు.

ఎదురుగా ఇంటి నౌఖరు నిల్చునున్నాడు. ఖైదీని చూడ గానే అతని కళ్లు ఆశ్చర్యంతో విప్పారాయి.

"విక్రమ్ బాబూ! మీరా?" అన్నాడు నోరు తెరుస్తూ.

"ష్, అరవక! నేనీ స్థితిలో వున్నానని పిన్నికి తెలీ

కూడదు. ఆమె ఆరోగ్యం ఎలా వుందిప్పుడు? కోలు కుందా?" అడిగాడు ఖైదీ తగ్గు స్వరంతో.

"దేవుడి దయవల్ల ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు బాబూ! ఇంకా లేచి తిరిగే స్థితిలో లేరు. బాగా నీరసంగా వున్నారు"

"హమ్మయ్య! అంతా ఆ భగవంతుడి చలవ. ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైందని తెలిసి, నానా అవస్థలూ పడి ఆమె నొక్కసారి చూసే అవకాశం సంపాదించ గలిగాను.

"జాగ్రత్త! నేనీ స్థితిలో వున్నానని ఆమెకెట్టి పరిస్థితి లోనూ తెలియకూడదు. తెలిస్తే భరించలేని దుఃఖానికి గురౌతుంది" అన్నాడు ఖైదీ సంకెళ్లు బిగించివున్న చేతుల్ని కొద్దిగా ఎత్తి చూపుతూ.

"అలాగే బాబూ? రండి. డ్రాయింగ్ రూంలో కూర్చోండి. నే వెళ్ళి అమ్మగార్ని కనిపెట్టుకునుండే నర్సె మ్మని పిల్చుకొస్తాను." అన్నాడు నౌఖరు తలుపు కడ్డం తొలుగుతూ.

ముగ్గురూ లోన అడుగుపెట్టి, అతన్ని అనుసరిస్తూ డ్రాయింగ్ రూంలో ప్రవేశించారు. వాళ్ళనక్కడ కూర్చో బెట్టి, లోపలకు వెళ్ళిపోయాడు నౌఖరు.

గోడలకు వేళాడుతున్న ఖరీదైన పెయింటింగ్స్‌నీ, చుట్టూ అలంకరించివున్న అందమైన వస్తువుల్నీ, కాళ్ళ కింద పరిచివున్న మెత్తని తివాసీనీ చూడగానే జీవితంలో తను ఎటువంటి సౌభాగ్యన్ని పోగొట్టుకున్నాడో తెలిసి వచ్చింది ఖైదీకి.

అంతలో నర్సుని వెంటబెట్టుకు వచ్చాడు నౌఖరు. ఆమెకు ఖైదీని పరిచయం జేశాడు.

"మీ పిన్నిగారు తీరిక వేళల్లో నాతో కబుర్లాడుతూ అనేకసార్లు మీ గురించి చెప్పడం గుర్తుంది. ఐదేళ్ళ ప్రాయంలో మిమ్మల్ని దత్తత స్వీకరించిందిట ఆమె. పదేళ్ల వయసులో మీకు చెడు సావాసాలు సోకి దుర్వ్యస నాలకు దాసులయ్యారుట.

ఒకసారి ఆవిడ మిమ్మల్ని దండిస్తే ఇల్లు విడిచి పారి పోయారుట.

ఇన్నాళ్ళ తరవాత అనుకోకుండా తిరిగివచ్చిన మిమ్మల్ని చూసి ఆవిడ పట్టరాని ఆశ్చర్యానందాలకు గురి కావచ్చు. దయచేసి ఈ బేడీలతో మాత్రం ఆమె యెదుట పడకండి.

పదినిమిషాల కోసం వీటిని తొలగించినంత మాత్రాన పెద్దనష్టం లేదనుకుంటాను. ఏమంటారు" అంది నర్సు జైలు ఉద్యోగులవైపు చూస్తూ.

"సారీ! రూల్సు ఒప్పుకోవు. ఎట్టిపరిస్థితిలోనూ ఇతని బేడీలు విప్పకూడదని ఆదేశాలివ్వబడ్డాయి. ఈ స్థితిలోనే అతను తన పిన్నిని కలుసుకోవాలి. తప్పదు! పారిపోయా డంటే, మా వుద్యోగాలు కాస్తా ఊడతాయి" అన్నాడు సార్జంట్ ఖచ్చితంగా.

"రాక రాక ఈ స్థితిలో వచ్చిన ఇతన్ని చూసి, ఆ ముసలిప్రాణం తల్లడిల్లిపోవచ్చు. ఎంతైనా పెంపుడు తల్లి కదా? పిల్లలు లేరన్న భావంతో యెంతో గారాబంగా చూసు కునేదిట ఈయన్ని.

తన అతి గారాబమే ఈయన భవిష్యత్తు పాడుజేసిందని ఇప్పటికీ ఆమె కుమిలి పోతుంటుంది."

సార్జంట్ తల అడ్డం తిప్పుతూ ఏదో అనబోతుండగా! ఖైదీ కల్పించుకుని—"మీరు ఖంగారు పడకండి సిస్టర్,

పేడీలు కనిపించకుండా నా చేతులమీద రుమాలు కట్టు కుంటాను. పిన్ని కారణం అడిగితే, ప్రమాద వశాత్తూ కాలిందని చెబుతాను. ఆమెకివి కనిపించడం నాకూ ఇష్టం లేదు!" అన్నాడు.

నర్సు కాసేపు ఆలోచించి—"ఆల్ రైట్! ఎవ్వరికీ ఇబ్బంది కలక్కుండా నాకో ఉపాయం స్ఫురిస్తోంది. ఈయన రెండు చేతులకున్న బేడీల్లో ఒకదాన్ని అంటే, కుడిచేతి బేడీ తీసి, ఎడంచేతికి తొడిగించండి.

గొలుసును పాములా మోచేతివరకూ చుట్టండి. నేను బాండేజ్ తెచ్చి, వాటిమీద చుట్టేస్తాను. దాంతో ఆయన చెప్పే సంజాయిషీకి పూర్తి సమర్థన లభిస్తుంది. ఆవిడ నిజంగానే ఈయన చెయ్యికాలి వుంటుందనుకుంటుంది.

"వాళ్లు మాట్లాడు కుంటున్నప్పుడు దయచేసి మీ రిద్దరూ గదిబైట వుండటం మంచిదని నా అభిప్రాయం! ఏ మంటారు?" అడిగింది సార్జంట్ ని.

"అఁ! ఈ మాత్రం సహాయం జెయ్యడానికి నేనూ సిద్ధమే. సరే! మీరు చెప్పినట్టే కానివ్వండి." అన్నా డతను.

నర్సు లేచి,"థాంక్సు! బాండేజ్ పట్టుకొస్తానుండండి!" అంటూ బైటికి నడిచింది.

ఖైదీ నిట్టూర్చేడు. "నర్సు చెప్పినట్టు పిన్నిది నిజంగా అతి సుతిమెత్తని మనసు. ఇప్పుడామెకు దాదాపు ఏభై ఏళ్లు దాటివుంటాయి. ఆమె పేరు రోహిణీ దేవి. భర్తృ హీన. వాళ్ళు నలుగు రక్కచెల్లెళ్లు. మిగితా ముగ్గురికీ పిల్లా పాపలు కలిగినా, ఈమెకు మాత్రం సంతాన యోగం ప్రాప్తించలేదు.

భగవంతుడు మిగతా అక్కచెల్లెళ్ళకి సంతానం యిచ్చి

ఐశ్వర్యం ఇవ్వలేదు. ఈమెకు ఐశ్వర్యం ఇచ్చి సంతానం ఇవ్వలేదు.

నే నామె తోబుట్టువు కొడుకును. నా మూడేళ్ళప్రాయం లోనే మా అమ్మ మరణించింది. నాన్న తాగుబోతు, జూద గాడు. అమ్మ మరణించిన కొద్ది కాలానికే ఆయన రెండో పెళ్ళి చేసుకున్నాడు. దాంతో పిన్ని నన్ను దత్తత తీసుకుంది.

అల్లారు ముద్దుగా చూసుకునేది. ఆ అతి గారాబమే నన్ను పెడతోవ పట్టించింది. జులాయి వెధవల జట్టు కట్టి చెడిపోయాను. నా ఆగడాలు మితి మీరడంతో పిన్నినన్ను దండించడం మొదలు పెట్టింది. దాంతో విసుగెత్తి ఒక రోజు చెప్పా చెయ్యకుండా ఇంట్లోంచి పారిపోయాను. అప్పుడు నాకు పదిహేనేళ్ళు. ఆ తరవాత ఇదే రావడం!

నే వెళ్ళాక పిన్ని మళ్ళీ ఇద్దరు పిల్లల్ని పెంపకం తీసుకుందిట. వాళ్లు బుద్ధిగా చదువుకుంటూ పెద్ద చదువుల కోసం విదేశాల కెళ్ళారు. ఇప్పుడు తెలిసి వస్తోంది నాకు, చేజేతులా నే నెటువంటి అదృష్టాన్ని పోగొట్టుకున్నానో. దేనికైనా ప్రాప్తం వుండాలి మరి...."

"కబుర్లు కట్టిపెట్టి నోరు మూసుక్కూర్చో" అన్నాడు సార్జంట్ చిరాకుగా.

కొర కొర చూశాడు ఖైదీ అతని వైపు.

అంతలో నర్సు బ్యాండేజ్ వుండలతో వచ్చిం దక్కడికి. సార్జంట్ జేబులోంచి తాళం చెవితీసి, ఖైదీ కుడిచేతి బేడీ తెరిచి, దాన్ని ఎడంచేతికి తొడిగి లాక్ వేశాడు.

నర్సు గొలుసును ఖైదీ ఎడంచేతికి పాములా చుట్టేసి, దానిపై బ్యాండేజ్ చుట్టడం ప్రారంభించింది. రెండు నిమిషాల్లో, ఖైదీ చేతికున్న బేడీలూ, గొలుసూ కనిపించ

కుండా బ్యాండేజ్ కింద పూడుకు పోయాయి!

అంతా అయ్యాక—"రండి, ఆవిడ మేడమీది గదిలో వున్నారు. మీ రామెతో మాట్లాడు తున్నప్పుడు ఆ చెయ్యి యెక్కువ కదిలించకండి. ఖర్మగాలి బ్యాండేజ్ తొలగి బేడీలు బైటపడే ప్రమాదముంది!" అంది నర్సు లేస్తూ.

తలూపేడు ఖైదీ.

ముగ్గురూ లేచి, నర్సు ననుసరిస్తూ హాల్లో ప్రవేశించి, మెట్లగుండా మేడమీది కెళ్ళారు. తలుపులు తెరిచివున్న ఓ గది ముందాగి, సార్జంట్‌నీ, కానిస్టేబుల్‌నీ అక్కడే వుండమని సైగజేసింది నర్సు.

తరవాత, విక్రమ్‌ను వెంటబెట్టుకుని, లోనికి నడిచింది.

గది మధ్య మంచంమీద కూర్చున్న వృద్ధస్త్రీ అతన్ని చూడగానే ఆప్యాయంగా చేతులు చాచి, "రా నాయనా, రా! నన్ను చూట్టానికి నువ్వొచ్చావని నర్సుచెబితే నమ్మలేక పోయాను. ఎంతలా ఎదిగి పోయావురా బాబూ!

ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు? ఎలా బ్రతికావు? పదేళ్ళ తరవాత ఈ పిన్ని జ్ఞాపకం వచ్చిందా నాయనా?" అంది చెమ్మగిల్లిన కళ్ళతో.

విక్రమ్ కళ్ళల్లోకూడా నీళ్లు సుళ్లు తిరిగాయి. మంచం మీద ఆమె పక్కన కూర్చుని. "నన్ను క్షమించు పిన్నీ! నే నిప్పుడు మునుపటి విక్రమ్ కాను. జీవితం నేర్పిన గుణ పాఠాలతో మారిపోయిన విక్రమ్‌ని.

మళ్ళీ ఇక్కడికి రావడానికి మొహం చెల్లక ఇన్నాళ్లూ మరుగున పడిపోయాను. నువ్వు తీవ్ర అనారోగ్యంతో బాధపడతున్నావని తెలియగానే నా మనసు తల్లడిల్లి పోయింది. నిన్ను ఒక్కసారి చూసి పోదామనివచ్చాను." అన్నాడు విక్రమ్ తలవంచుకుంటూ.

ఆవిడ అనురాగంతో అతని తలనిమిరి-"మా నాయనే! మా బాబే! నే నంటే ఎంత ప్రేమరా నీకు. పాపిష్టిదాన్ని! బంగారంలాటి కొడుకును చేజేతులా దూరం జేసు కున్నాను....చేతికి ఆ కష్టేమిటి నాయనా?" అంది.

"ప్రమాద వశాత్తూ కాలిపోయింది!"

"మాయదారి కష్టాలన్నీ నీకే వచ్చాయా బాబూ! ఇప్పు డెలావుంది గాయం?" అంటూ ఆ చెయ్యి నిమరబోయిం దామె.

విక్రమ్ ఖంగారుపడి చటుక్కున చెయ్యి వెనక్కి తీసు కున్నాడు. దాంతో బ్యాండేజ్ కాస్తా వెనక్కి జరిగి, బేడీలు తొంగి చూశాయి బైటికి.

రోహిణీదేవి దిగ్భ్రాంతితో రెప్ప వెయ్యకుండా వాటినే చూస్తుండి పోయింది క్షణంపాటు, "ఏమిటి బాబూ ఇవి? బేడీలా...."

సిగ్గుతో నిలువునా కుంచించుకు పోయాడు విక్రమ్. "ఔను పిన్నీ! నా పాపాలకి ప్రాయశ్చిత్తాలు. నేనిప్పుడు శిక్ష అనుభవిస్తున్న ఖైదీని. ఈ నాలుగు సంవత్సరాల జైలు శిక్ష నాలో తీవ్రమైన మార్పు తీసుకు వచ్చింది. నా గత జీవితంపట్ల రోత పుట్టింది. విడుదలవగానే సమా జంలో మంచి మనిషిగా జీవించాలని నిశ్చయించుకున్నాను.

నీ అనారోగ్యం గురించి తెలియగానే ఎన్నో అవస్థలు పడి, నిన్ను చూట్టానికి అనుమతి సంపాదించగలిగాను. బైట జైలు ఉద్యోగులున్నారు. కొద్దిపాటి వ్యవధే లభించింది.

ఈ విషయం తెలిస్తే మళ్ళీ నీ ఆరోగ్యం పాడవు తుందోనని భయపడి, నర్సు సహాయంతో ఈ రహస్యం కప్పి పుచ్చుకోడానికి ప్రయత్నించాను.

నీవు చెప్పినట్టు విని, బుద్ధిగా బ్రతికివుంటే ఈనాడు నాకీ దుర్గతి పట్టేదికాదు. అంతా ఐపోయాక ఇప్పుడు చింతించి ఏం ప్రయోజనం? నా శిక్ష ఇంకా కొద్ది రోజులే మిగిలింది. విడుదలయ్యాక ఏదైనా వ్యాపారం జేసుకుంటూ నీతిగా బ్రతకాలని నిశ్చయించుకున్నాను.

నా ఉనికివల్ల ఈ ఇంటికి చెడ్డపేరు రావడం నా కిష్టం లేదు. అలదుకే, ఈ ఇంటికి దూరంగావుండి స్వశక్తిమీద పైకి రావాలను కుంటున్నాను. అందుకు నీ ఆశీర్వాదమూ, సహకారమూ ఎంతైనా అవసరమున్నాయి.

వ్యాపారమన్నాక, అంతో ఇంతో పెట్టుబడి కావాలి కదా? నాకీ లోకంలో నువ్వుతప్ప ఇంకెవరున్నారు? నా బ్రతుకు తీర్చిదిద్దుకోడానికి అతి స్వల్పమొత్తం నిన్ను అర్థిస్తున్నాను పిన్నీ! కేవలం యాభై వేలు చాలు. నా కాళ్ళ మీద నేను నిలదొక్కుకున్న తక్షణం నీపైకాన్ని పువ్వుల్లో పెట్టి సమర్పించు కుంటాను.”

కింకా ఎన్నాళ్ళు మిగిలున్నాయి?" అడిగింది విషాదంగా.

"కేవలం నెల రోజులు!" అన్నాడు విక్రమ్ లేస్తూ.

చివరిసారి ఆమెపాదాలు స్పృశించి, కళ్ళ కద్దుకుని వెను దిరిగాడు. అడుగులో అడుగు వేసుకుంటూ గదిలోంచి బైటికి వచ్చాడు. నర్సు వెంటనే అతనిచేతికి చుట్టివున్న బ్యాండేజ్ విప్పేసింది.

సార్జంటు అతని ఎడం చేతికి తగిలించిన రెండో జేడీ తీసి, కుడిచేతికి బిగించి, గొలుసందుకున్నాడు.

విక్రమ్ నర్సువైపు తిరిగి—"వస్తాను సిస్టర్! మీ సహ కారానికి థాంక్సు! పిన్నిని కాస్త జాగ్రత్తగా చూసుకోండి" అంటూ జైలు ఉద్యోగుల వెంట ముందుకు నడిచాడు.

భవనంలోంచి బైటికి రాగానే ముగ్గురూ తిరిగి జీప్ ఎక్కారు. కాన్‌స్టేబుల్ జీప్ స్టార్టుజేసి ముందుకు పోనిచ్చాడు. వీధి మలుపు రాగానే ఎడంవైపు తిప్పి స్పీడ్ హెచ్చించాడు.

రెండు మూడు రోడ్లు కట్‌జేసి, మాంబళం వీధిలో

ప్రవేశించింది జీప్. కొద్దిదూరం వెళ్ళాక జన సంచారం లేని ఓ సందులోకి తిరిగింది. ఐదారిళ్లుదాటి ఓ పెంకుటింటి ముందాగింది.

ముగ్గురూ దిగారు.

సార్జంటు ఆ ఇంటి తాళంతెరిచి, తలుపు తోశాడు. ముగ్గురూ లోనికెళ్ళారు. వెంటనే తలుపు మూసుకుంది.

సార్జంటు, కానిస్టేబుల్ గబ గబ తమ ఒంటిమీదున్న జైలు సిబ్బంది యూనిఫామ్స్ విప్పేసి, మామూలు బట్టలు తొడుక్కున్నారు.

"మీ బట్టలు తొడుక్కోడం తరవాత కానివ్వండి. ముందీ బేడీలు త్వరగా విప్పండి. ఒరుసుకు పోతున్నాయి." అన్నాడు విక్రమ్ మొహం చిట్లిస్తూ.

సార్జంటు పాత్ర వహించిన వ్యక్తి వెంటనే తాళం చెవందుకుని, గబ గబ అతని చేతి కఫ్స్ తీసేశాడు. తర వాత ముగ్గురూ పక పక నవ్వుకున్నారు ఇల్లదిరిపోయేలా!

"ఎలావుంది నా నటన? బాగా నటించలేదా! నా పథకం పారుతుందో, లేదోనని మీరిద్దరూ ముందు అనుమాన పడ్డారు కదా? ఇప్పుడేమంటారు? అ ముసలిదాన్ని యెలా బుట్టలో వేశానో చూశారు కదా!

పాపం. నేను తన పెంపుడు కొడుకు విక్రమ్‌నేనని గుడ్డిగా సమ్మేసింది. వాడు గత అయిదేళ్ళనించీ మన ముఠాలోనే పనిజేసే వాడనీ, ఓ దోపిడీ డబ్బు పంపకంలో మనతో పేచీపెట్టుకుని మొన్నిమధ్యే మన చేతుల్లో చచ్చా డనీ దానికేం తెలుసు?

విక్రమ్ తరుచూ ఆ ముసలిదాని గురించి మనతో చెప్పడం, కాకతాళీయంగా వాడికీ, నాకూ అంతో ఇంతో పోలికలుండటం ఈవిధంగా మన ప్లాన్‌ను సక్సెస్‌జేశాయి.

కొద్దిపాటి మేకప్‌తో అచ్చు వాడిలా తయారు కాగలిగాను.

నా నటనా సామర్థ్యంతో ఆ ముసలిదాని సానుభూతి సంపాదించ గలిగాను. ఇహ నెలరోజుల తరవాత, జైలు నించి విడుదలైనట్టు వెళ్ళి, ఆ యాభై వేలు దులుపుకు రావడమే తరవాయి." అన్నాడు విక్రమ్‌లా నటించిన యువకుడు, తలమీది ఉంగరాల జుత్తు విగ్గుతీస్తూ.

"ఆ కబుర్లన్నీ తరవాత చెప్పుకోవచ్చు. ముందా దొంగలించిన జీప్ ఎక్కడైనా వదిలి రావడం ముఖ్యం! ఈ పాటికి అది దొంగిలించ బడ్డట్టు పోలీసులకు రిపోర్టందివుంటుంది!" అన్నాడు కానిస్టేబుల్ పాత్ర వహించిన తను.

"దాని నెంబర్ ప్లేట్లు మార్చేశాంగా? భయం దేనికి? త్వరగా వెళ్ళి ఎక్కడైనా వదిలేసిరా!" అన్నాడు నకిలీ విక్రమ్.

కానిస్టేబుల్ పాత్రధారి గబ గబ వెళ్ళి తలుపు తెరిచి, అదిరి పడ్డాడు. అతనితోబాటు లోపలున్న మిగతా ఇద్దరూ, గుమ్మాని కవతల నిలుచున్న వ్యక్తుల్ని గుర్తుపట్టింది చూస్తుండి పోయారు రాతి బొమ్మల్లా!

వాళ్ళు పోలీసులు!

ట్రాఫిక్ పోలీసులు!!

"ఐదు నిమిషాల క్రితం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌నించి మాకు ఆదేశాలందాయి. మీరు ప్రయాణిస్తున్న జీప్ నెంబర్ చెప్పి, అది ఎక్కడ కనిపించినా ఫాలోజేసి, మీ ముగ్గుర్నీ కస్టడీలోకి తీసుకుని, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపమని! ఊఁ, పదండి!" అన్నాడు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హూంకరిస్తూ.

వాళ్లని తమ జీప్‌లో ఎక్కించుకుని తిన్నగా పోలీస్

హెడ్ క్వార్టర్స్‌కు తీసికెళ్ళారు వాళ్ళు.

లోపలికి వెళ్ళగానే ముగ్గురు నేరస్థులూ దిగ్భ్రాంతితో కళ్ళు తేలవేశారు!

కారణం, ఇన్‌స్పెక్టర్ ఎదురుగా రోహిణీదేవి కూర్చునుందక్కడ!

ఆమె పక్కనే నర్సు!!

వాళ్ల దురవస్థచూసి, చిన్నగా నవ్వాడు ఇన్‌స్పెక్టర్. "మీ పథకం నిరాటంకంగా పారిందనీ, ఈ ముసలామెని సులభంగా మోసం జెయ్య గలిగామనీ మురిసిపోయారు కదూ?

మిస్టర్ బోగస్ విక్రమ్! నిన్ను చూడగానే, ఇంటి నౌఖరూ, రోహిణీదేవీ నువ్వు విక్రమ్‌వేనని అపోహ పడ్డ మాట నిజమేగానీ, నీవల్ల జరిగిన రెండు పొరపాట్లు ఆమెకు అనుమానాన్ని కలిగించాయి. మీరు బైటికెళ్ళగానే కిటికీలోంచి గేటు ముందాగివున్న మీ వాహనం నెంబరు నోట్ చేసుకొని, వెంటనే మాకు ఫోన్‌చేసింది...."

"నావల్ల రెండు పొరపాట్లా....??" నకిలీ విక్రమ్ ఆశ్చర్యపోయాడు.

* * *

[ఇదీ కథ. దీనిలో నకిలీ విక్రమ్ చేసిన రెండు పొరపాట్లు ఏమిటో మీరు పరిశోధించి కనుక్కోండి. మీ పరిశోధనను ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి 15-1-78 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హాం.వె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టలు స్టాంపులు జతపరచాలి. అత్యుత్తమ పరిశోధన చేసిన ఇద్దరు పాఠకులకు చెరొక రు. 25-00లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి.

—ఎడిటర్.]

ప్రియా! ఓ ప్రియా!

టి. వేణుగోపాల్

గణేశ్ పేట స్టేషన్‌లో ఆగింది రైలు.

రైలు పెట్టెలోంచి క్రిందికి దిగింది నర్స్ నీలవేణి. ఆమె తప్ప మరే ప్రయాణికుడూ ఆ స్టేషన్‌లో దిగలేదు.

పట్టాలకి కాస్త దూరంలో గుబురు గుబురుగా పెరిగిన చెట్లు ఆవైపు ఏమి వున్నదో తెలయ నివ్వడంలేదు.

చీకటి పడటానికి కొద్ది సమయము మాత్రమేవుంది.

పట్టాలకు ఎడమవైపున కొద్ది దూరములో స్టేషన్ మాస్టర్ గది, అందులో అప్పుడే శుభ్రంగా తుడిచి వెలిగించిన హరికెన్ లాంతరు వెలుగు కనిపిస్తున్నాయి.

నీలవేణి స్టేషన్ మాస్టర్ గదివైపు నడిచింది.

లాంతరు వెలుగులో ఏదో రాసుకుంటున్న స్టేషన్ మాస్టర్ నీలవేణి వస్తున్న శబ్దంవిని అద్దాల్లోంచి కళ్ళెత్తి చూశాడు.

"గణేశ్ పేటకు ఎటువైపు వెళ్ళాలి. యిక్కడినుండి ఎంత దూరముంటుంది?" అంది నీలవేణి.

"మూడు కి.మీ.పైన వుంటుందమ్మా. చీకట్లో నువ్వంత దూరము ఒంటరిగా వెళ్ళగలవా!"

"ఇంకా పూర్తి మబ్బు పళ్ళేదుగా, తొందరగా నడిస్తే ఎంత సేపట్లో చేరగలనండీ?"

"ఎనిమిది లోపల చేరుకోగలవు....కాలిబాట తప్ప వాహనా లటువైపు వెళ్ళవు" అన్నాడు స్టేషన్ మాస్టర్.

ధైర్యంగల చురుకయిన పిల్ల నీలవేణి.

"ఫరవాలేదు దారిచూపండి" అంది.

స్టేషన్ మాస్టర్ బయటకువచ్చి దారి చూపాడు.

బయల్దేరింది నీలవేణి.

2

వడివడిగా నడుస్తుంది నీలవేణి.

హైదరాబాదు నగరానికి దక్షిణంగా తొంబైరెండు కి.మీ. దూరంలో దట్టమయిన అడవుల మధ్యవుంది గణేశ్ పేట. స్టేషన్ దగ్గర్నుంచి ఎద్దులబండి తప్ప మరే వాహనాలు అక్కడికి వెళ్ళలేవు. ఎగుడు దిగుడు నేల, బాట కిరువైపులా విపరీతంగా పెరిగిపోయిన కంచె, కంచె కావలి

వైపున పచ్చని పొలాలు.

చుట్టూ ప్రకృతిని గమనిస్తూ నడుస్తూనే వున్నా, పరుగెడు తున్నంత వేగంగా కదలిపోతున్నాయి నీలవేణి పాదాలు.

అప్పుడప్పుడు ఏ ఒకరిద్దరో తప్ప జనులు ఎదురు రావడం లేదు.

పౌర్ణమి రోజు కావడంతో వెన్నెల తెల్లగా విరగ కాస్తుంది.

పెద్ద రావిచెట్టు, చెట్టుకు కొంచెం ఆవలగా పెద్దబావి, బావి చుట్టూ సిమెంటు కప్పడం చేసిన చుట్టుగోడ కనిపించాయి నీలవేణికి.

గోడ వ్యాసాన్ని చూడగానే 'ఎంత పెద్ద బావయ్యుంటుందో' అనిపించింది. బావి దగ్గరకు వెళ్ళి లోనికి తొంగి చూసింది నీలవేణి.

చెత్తా చదారంతో పాడుబడివుంది బావి. ఎప్పుడో అమర్చిన పంపు తీసి వేయడంవలన గోడలో ఏర్పడిన రంధ్రము, పూర్తిగా ఎండి నల్లగా మారిన పాచి గుర్తులతో న్నున్న కాలువను చూస్తూ కొంతసేపు నిలబడి పోయింది నీలవేణి.

చంద్రుడు మబ్బులచాటుకు పోవడంతో ఆ ప్రాంతాన్ని చీకటి కప్పివేసింది మసకగా.

చక....చకా బాటను చేరుకుంది నీలవేణి.

కొద్దిదూరం నడిచింది.

"ప్రియా...." అన్న పిలుపు వినబడటంతో ఉలిక్కిపడింది నీలవేణి.

వెనుతిరిగి చూసింది.

నిర్మానుష్యం.

"భ్రమ పడ్డానేమో!" అనుకుని రెండడుగులు ముందు వేసింది.

"ప్రియా!....ఓ ప్రియా!....నిన్నే" కొంచెం గట్టిగా వినబడిందీసారి.

అడుగు ముందుకు పడలేదు నీలవేణికి.

వెనుదిరిగి చూసింది మళ్ళీ.

పెద్ద పెద్ద పొదలుగా పెరిగిన నీలం ఉమ్మెత మొక్కలు, బావిచుట్టూ పాడుబడి పాతదాన్ని తెలుపుతున్న చుట్టుగోడ, రావిచెట్టు, కీచురాళ్ళ ధ్వని.

"మనిషి మాత్రుడులేని వంటరి ప్రాంతంలో ఎవరిదా పిలుపు....? ఎవర్ని వుద్దేశించి?"

భయమన్నది యెరుగని నీలవేణి మొహంమీద చెమట బిందువులు చోటు చేసుకున్నాయి. బిక్క....బిక్కమంటూ చూసింది బావి చుట్టుప్రక్కల. వొంటరి మఱ్ఱిచెట్టు గాలికి నిశ్శబ్దంగా కదుల్తుంది. దానికాండము ప్రక్కనుండి బయట కొచ్చాడొక యువకుడు.

మబ్బులు చంద్రుణ్ని దాటిపోవడంతో వెన్నెల మళ్ళీ భూమిని తాకింది.

వెన్నెల వెలుగులో అతన్ని తీక్షణంగా చూసింది నీలవేణి.

ఆమెలోవున్న భయం అతను కనబడడంతో యెగిరి పోయింది.

ఇరవై మూడేళ్ళుంటాయి ఆ యువకుడికి. బ్రవున్ కలర్ టెరికాటన్ పాంటువేశాడు. షర్టు ఏ రంగుదో తెలియకుండా వున్ని స్వెట్టర్, చారల మఫ్లర్ కప్పివేశాయి.

విచిత్రం....

అతను చీకట్లోకూడా కూలింగ్ గ్లాసెస్ వేశాడు.

అద్దాల వెనుకనున్న అతనికళ్ళు ఏమి వెతుకుతున్నామో గమనించ లేకపోతూంది నీలవేణి.

చిన్నగా నడుచుకుంటూ ఆమె దగ్గర కొచ్చాడతను.

"ఏవయ్యా. బుద్ధిలేదూ?....ఒంటరిగావున్న అమ్మాయి కనిపిస్తే ఇష్టమొచ్చిన పిలుపులతో పిలుస్తావా" అంది.

అతను విరగబడి నవ్వాడు.

అంతలా ఎవరయినా నవ్వడం యింతవరకూ చూడ లేదు నీలవేణి.

"ప్రియా నువ్వు అమ్మాయివా?....అమ్మవా...."మళ్ళీ గట్టిగా నవ్వాడు అతను.

"ఛీ....ఛీ .... పశువులా గున్నావే" అని వెనుతిరిగి వేగంగా నడవసాగింది.

"ప్రియా....ఓ ప్రియా! అగు, నీతో మాటాడాలి" అంటున్నాడు వెనుకనుండి అతను.

అతని మాటలు వినిపించుకోనట్టు, పారిపోతున్నట్టు వేగంగా నడుస్తుంది నీలవేణి.

హైదరాబాదులోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో నర్సు నీలవేణి. తల్లి తప్ప ఆమె కింకెవ్వరూ లేరు. తల్లి కూడా గవర్నమెంటు నర్సు. తను రిటైర్ అయ్యేలోపల కూతురి చేతకూడా ట్రైనింగ్ పూర్తిచేయించింది.

ట్రైనింగ్ పూర్తి అయినాక గవర్నమెంటుపనిదొరకక పోవడంతో డాక్టర్ అమర్‌నాధ్ అనే ప్రైవేటు డాక్టర్ దగ్గర చేరింది నీలవేణి. అమర్‌నాధ్ పేషంటు పరంధామ్ అనేవ్యక్తి గొప్ప ధనవంతుడు. అతనిది గణేశ్‌పేట. ఆయ నకు హోమ్‌నర్స్ అవసరమయి డాక్టర్‌ను ఓ నర్స్‌ని

కొంత కాలం తన దగ్గరకు పంపమని కోరాడు.

అమర్‌నాథ్ నీలవేణిని అడిగాడు.

తనకొస్తున్న జీతంమీద యింకా వందరూపాయలు ఎక్కువ ఆదాయముంటుందని, కొన్ని నెలలు పల్లెపట్టున ప్రశాంతంగా గడపవచ్చని అనుకున్న నీలవేణికూడా తన ఆమోదాన్ని తెలియజేసింది.

ఆ కారణం వల్లనే ఆమె గణేశ్‌పేట ప్రయాణాన్ని పెట్టుకుంది.

పల్లే అయినా మరీ చిన్నదేం కాదు గణేశ్‌పేట. విద్యుచ్ఛక్తి సౌకర్యము, ఒక టూరింగ్ టాకీస్, పోలీస్‌స్టేషన్ గవర్నమెంటు లైబ్రరీ బ్రాంచిలాంటి సదుపాయాలున్నాయి.

ఇంతకుముందు కనిపించిన యువకుడ్ని గురించే ఆలోచిస్తూ నడుస్తుంది నీలవేణి.

ఎవరతను. రాత్రిపూట నల్లకళ్ళజోడు తొడిగి తిరుగుతున్నాడు....పిచ్చాడా? అతని వాలకము అలాలేదు. మరైతే తనను 'ప్రియా....ప్రియా' అని యెందుకు పిలిచాడు.

కొంచెం దూరంలో వూరిలోని కరంటు దీపాలు కనిపిస్తున్నాయి.

"దగ్గర కొచ్చేశాను" అనుకుంది నీలవేణి.

దారి చుట్టు తిరిగివుంది.

బాట ప్రక్కలో మళ్ళీ చెట్లగుబుర్ల మధ్య నల్లరాతిమీద కూర్చునివున్న నల్ల కళ్ళజోడు యువకుడ్ని చూడగానే నీలవేణి పాదాలు ముందుకు కదలలేదు.

అతను సిగరెట్ కాల్చుతున్నాడు.

"ఎవరు నువ్వు? ఎందుకు వెంటాడుతున్నావు నన్ను?"

"నేను నిన్ను వెంటాడ్డం లేదే. నీకన్నా ముందే

వచ్చాను."

"ఎలా వచ్చావు?"

"నా కీ దారి చాలా బాగాతెలుసు "

"నాతో నీకేం పని."

"నీకు నిజంగా తెలీదూ?" అని కళ్ళజోడు చేతిలోకి తీసుకున్నాడు.

అతని కళ్లు నిప్పులా మండుతున్నాయి.

అంతటి ఎర్రని కళ్లు తాగుబోతుల్లో, రోగుల్లో కూడా చూడలేదు నీలవేణి.

"ఏవిటి తెలియడం? అసలు నువ్వెవరు, నే నెవరు.... వెళ్లు....వెళ్లు" అని కసరి విస విస నడిచింది నీలివేణి.

కొంతదూరం నడిచి వెనుదిరిగి చూసింది.

ఆ యువకుడు అక్కడ లేడు.

4

పరంధామ్ వయసు ఏభై దాటింది. పడక మీదనుండి లేవలేడు అతను. అతని భార్య పుష్పవల్లికూడా వయసు మీద పడటంతో అంతగా కష్టపడలేదు. వారిద్దరి ఏకైక పుత్రుడు అమెరికాలో చదువు కుంటున్నాడు.

నర్సు అవసరమెంతో వుంది ఆ యింటికి.

రాత్రి తొమ్మిది గం॥లప్పుడు యిల్లుచేరిన నీలవేణిని, తోడు యెవరిని తీసుకురాకుండా వచ్చినందుకు, ముందుగా కబురు అంద చేయనందుకు సున్నితంగా మందలించాడు పరంధామ్.

అందంగా నవ్వేసింది నీలవేణి.

దారిలో జరిగివ విషయాలేమీ ఆ వృద్ధునికి చెప్ప లేదు.

భోజన మయిన తరువాత డాక్టర్ అమర్‌నాథ్ ఇచ్చిన



మందులు, తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో చాకచక్యంగా నెరవేర్చింది నీలవేణి.

మిద్దె వెనుక అవుటుహవుస్‌లావున్న యింటిని నీలవేణి బస చేయడానికి యిచ్చారు.

పరంధామ్ నిద్రపోయేవరకూ అతనితో మాటాడుతూ కూర్చుని తరువాత కిటికీ కర్టెన్స్ మూసివేసి, సీసాలో మాత్రలు లెక్కపెట్టి, మంచి నీళ్ల అతనికి అందుబాటులో వుండేట్టు పెట్టి, తనగదికి వెళ్ళింది నీలవేణి.

కిటికీ ప్రక్కనేవున్న మంచంమీద బెడ్డింగ్ పరచి కట్టుకున్న చీరవిప్పి వేరే చీర కట్టుకుని తలుపులు గడియ వేసివచ్చి మంచంమీద కూర్చుంది.

పగలంతా ప్రయాణంలో అలసి పోయివుంది. కిటికీ లోంచి దూరంగా కనిపిస్తున్న కొండలను, కొండలమీదుగా మెరుస్తున్న చంద్రుణ్ని, తన గదిముందున్న తోటలోని పూలమొక్కల్ని చూస్తూండగానే నిద్రపట్టేసింది నీలవేణికి

5

ఎవరిదో బూట్లచప్పుడు వినిపించడంతో మెలకువ వచ్చింది నీలవేణికి. బయట యెవరో నడుస్తున్నారు.

వెళ్ళి తలుపులు తెరచిచూపింది. ఎవరూ కనబడలేదు. వెన్నెల పూలమొక్కలతో ఆడుకుంటూంది. తలుపులు వేసి వచ్చి మంచంమీద పడుకుని దుప్పటి మీదకు లాక్కుంది.

మళ్ళీ బూట్ల చప్పుడు....

చెవులు రిక్కించి వింది.

"టంగ్....టంగ్" మంటూ పరంధామ్ గదిలోని గోడ గడియారం రెండుగంటలు కొట్టడం వినిపించింది.

ప్రక్కకు తిరిగి పడుకుంటూ కిటికీలోంచి బయటకు చూసింది. కోపంతో ఆమె ముక్కుపుటాలు పెద్దవయ్యాయి.

తోటలోని సంపంగె పొదదగ్గర నిల్చుని సిగరెటు తాగు తున్నాడు ఆ నల్ల కళ్ళజోడు యువకుడు.

"ఏం ప్రియా....నిద్రపట్టలేదా?" అంటూ కిటికీదగ్గరకు వచ్చాడు.

"నీకేం పనిలేదా....? నేను కేకవేస్తే నీ పనేమవు తుందో తెలుసా?" కోపంగా అరచింది నీలవేణి.

"ఏమీ కాదు....నన్నెవరూ ఏమీ చేయలేరు" అన్నాడు ఆమెను చూస్తూ.

నిద్దర్లో చెదిరిన ఆమె దుస్తులు, రేగిన వెంట్రుకలు, ఉబ్బిన కళ్లు, కోపంగా మాటాడేప్పుడు పైకి కిందికి చురుగ్గా కదిలే ఎర్రని పెదిమలు, ఎగిరిపడే గుండె ప్రాంతము, మంచంమీద నిర్లక్ష్యంగా కాలు కొంచెం పైకి లాక్కుని దిండుకు నడుము ఆనించి కూచోవడంతో వుబ్బి మడత పడిన తెల్లని నడుము....ఆమెనే కోరికతో, కోపంగా చూస్తున్నాడు ఆ యువకుడు.

"నీ కళ్లు జబ్బుచేశాయా? లేక ఫాషన్‌కోసం దొడ్డిదారులగుండా అమ్మాయిలదగ్గర ఫోజులు - కొట్టడానికా ఆ అద్దాలు?" అంది నీలవేణి వెటకారంగా.

"ఎందుకో తెలీదూ.... ఈ అద్దాల్లో నే నెంతో బావుంటానని తెగ పొగిడేదానివే, అప్పుడే మరిచిపోయావా! ఏమి ధైర్యం ప్రియా నీది. నేను కనబడినా మందలించకుండా మాట్లాడుతున్నావు. ఆ గుండెధైర్యంతోనే తలుపు తీయరాదూ, కలిసి మాట్లాడుకుందాము" అన్నాడు ఆ యువకుడు.

"ఏవిటీ, నేను నిన్ను పొగిడేదాన్నా....? తలుపు తియ్యాలా, తీస్తాను, తీసి వూరంతా వినబడేలా కేక లేస్తాను. ఇంట్లోని పనివాళ్ళు వచ్చి బుద్ధిచెపితేగాని నీ జాడ్యం కుదరదు" అంటూ విసురుగా లేచి తలుపుతీసి, "బాబుగారు" అని కేకేసి కిటికీవైపు చూసింది.

అతనక్కడ లేడు. మిద్దెలోని లైట్లు వెలిగాయి.

మెట్లు దిగి చుట్టు తిరిగి తోటలోనికి వెళ్ళి చూసింది. ఎక్కడా కనబడలేదా యువకుడు.

6

ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ సిగరెట్టు కాల్చుతూ పేపర్ చూస్తున్నాడు.

ఆ స్టేషనుకు కొత్తగా వచ్చాడు కరుణాకర్. వయసు ఇరవైతొమ్మిది సం॥లు వున్నా, ఇరవైనాలుగు, ఇరవై ఐదు సం॥ల వారి మాదిరి అగుపిస్తాడు చూపరులకు.

డిపార్ట్‌మెంటులో ఇప్పుడిప్పుడే పేరులోకి వస్తున్న వాడు. మంచి తెలివి, ధైర్యం వున్న వ్యక్తి. అందమయిన మొహం, విశాలమయిన ఛాతీ, ఐదడుగుల తొమ్మిది అంగుళాల పొడవువున్న మనిషి.

సాధారణంగా పోలీసు మనుషుల్లో కనిపించే కరకుదనం అతని మొహంలో కనిపించదు. ఎప్పుడూ ప్రశాంతంగా వుంటుంది.

అతను మంచి చిత్రకారుడన్న విషయం చాలామందికి తెలీదు.

"నమస్తే....ఇన్‌స్పెక్టర్‌గారూ" అంటూ స్టేషన్‌లో కొచ్చింది నీలవేణి.

"నమస్తే...."

"నా పేరు నీలవేణి. నిన్ననే ఈ వూరు వచ్చాను పరంధామ్ అనే ఆయన యింట హోమ్ నర్స్‌గా పనిచేయడానికి; ఒక వ్యక్తిమీద రిపోర్ట్ యివ్వాలని వచ్చాను."

"ఎవరిమీద, ఎందుకు? కూర్చుని నిదానంగా చెప్పండి."

"అతనిపేరు నాకు తెలీదు. పట్టణాల్లో రోడ్‌సైడ్ రోమియోలు వుంటారని ఆడపిల్లల్ని అల్లరిచేస్తారని తెలుసు. కాని యిటువంటి గ్రామాల్లోకూడా వుంటారని, వీరిముందు వారెందుకూ పనికిరారని అనిపిస్తుంది" అంది కోపంగా నీలవేణి.

"ఏం జరిగిందో చెప్పండి.... అతనెవరో తెలుసుకుని మేము దండిస్తాము" అన్నాడు కరుణాకర్.

తాను స్టేషన్‌లో దిగినప్పటినుండి, రాత్రి రెండు గంటలప్పుడు ఆ యువకుడు తనతో మాట్లాడినంతవరకూ ఒక పదము కూడా మరచిపోకుండా చెప్పింది నీలవేణి.

ఆమె చెప్పడం పూర్తయేవరకూ అడ్డుప్రశ్నలేమీ వెయ్యకుండా ఆశ్చర్యంగా విన్నాడు ఇన్‌స్పెక్టర్ కరుణాకర్.

"మిమ్మల్ని ప్రియా, ప్రియా అనే సంబోధించాడా?"

"అవును అదే నా పేరయినట్టు ప్రవర్తించాడు."

"కళ్ళద్దాలు అతనికి బావుంటాయని అన్నది మీరు కాదని, అతనెవరోకూడా మీకు తెలియదని, అతనికి నచ్చ చెప్పలేకపోయారా?"

"లేదు....కోపంలో వున్న నాకు అతనికి నచ్చచెప్పాలని యెలా అనిపిస్తుంది" అంది నీలవేణి.

"నిజమే, ఒక సంగతి వినండి. రాత్రులపూట దారివెంట వెళ్ళే బాటసారులకు ప్రియా, ప్రియా అని ఎవరో పిలవడం చాలాసార్లు వినిపించింది. అలా పిలుస్తున్న వ్యక్తి ఎవరో కనిపించలేదు మీకు తప్ప" అన్నాడు కరుణాకర్.

"అంతా బూటకం. పిలిచిన వ్యక్తి కనిపించకుండా పోవడానికి అతనేం దేవుడు కాదుగా."

"దేవుడు ప్రజలను ప్రియా అని పిలవడు. కనుక దేవుడు కాకపోవచ్చు."

"మరైతే ఆ మనిషి దెయ్యమా?"

"కావచ్చు" అన్నాడు కరుణాకర్.

"అడుగుతున్నానని ఏవనుకోకండి. దయ్యాలు,భూతాలు వుంటాయని నమ్మే మీరు ఈ వుద్యోగాని కెలా వచ్చారు" చిన్నగా నవ్వుతూ అంది నీలవేణి.

"నన్ను విమర్శిస్తున్నారని బాధలేదు. మనం నమ్మినా మానినా, మానవాతీతమయిన శక్తులతో కొన్ని ఆకారాలు తిరుగుతున్నట్టు ఎన్నో ఆధారాలున్నాయి" అన్నాడు కరుణాకర్.

"నన్నెవరో ఒక వెధవ అల్లరి చేస్తున్నాడని నేనంటుంటే, మీరు వినిపించుకోకుండా ఏదో దయ్యం, ఆకారం అంటున్నరేమండీ, అతను ఖచ్చితంగా మనిషే!" అంది నీలవేణి.

"నా అనుమానం....అంతే!"అన్నాడు కరుణాకర్.

"ఎవరో ఏదో విన్నామని అన్నది వినేగా మీరలా అంటున్నారు."

"లేదు....చెపుతాను వినండి...." అని ప్రారంభించాడు కరుణాకర్.

"చాలా రోజులుగా నన్ను వేధిస్తున్న సమస్య యిది. మీ రాకతో నాలో యెంతో వుత్సాహం పెరిగింది. ఎవరో విన్నామని అన్నదికాదు. స్వయానా నేనే విన్నాను. మూడు నెలల క్రితం ఈ వూరికి మీలాగే కొత్తగా వచ్చాను నేను. మీలాగే చీకటిపడుతున్న సమయంలోనే రైలు దిగి కాలి నడకనే వూరిలోనికి వస్తున్నాను.

బావి దగ్గర కొచ్చేటప్పటికి మీకు వినబడ్డట్టే ప్రియా.... ప్రియా అన్న శబ్దమే నాకు వినబడింది. నేను ఆ పిలుపు వినబడినవైపు పరిగెత్తుకెళ్ళాను. అప్పుడు పిలుపు వినబడ లేదు. చెట్టు పరిసరాలలో గాలించాను. ఎవరూలేరు. భ్రమ పడ్డానేమో అనుకున్నాను.

కాని వూరిలోకి వచ్చిన తర్వాత ఒక కానిస్టేబుల్ నా అనుభవం విని ఆశ్చర్యపడలేదు. అది మామూలే అని, చాలామందికి అలా వినబడిందని, అయితే ఎవరికీ ఆ పిలిచిన వ్యక్తి కనబడలేదని అన్నాడు. తరువాత ఈ మధ్య కాలంలో నాకు పరిచయమయిన కొత్త మిత్రులు కూడా ఈ అనుభవాన్ని చవిచూచామన్నారు" అని ముగించాడు కరుణాకర్.

"ఈ అద్దాల మిడిమాలమే అందరికి అలా భ్రమ కలిగిస్తున్నాదేమో" అంది నీలవేణి.

"అది మీరు హేళనచేసినట్టు అతనే దయ్యమో, దేవుడో అయితేనే సాధ్యము."

"ఎలా చెప్పగలరు?"

"ఒక మనిషే ఇలా చేస్తున్నాడేమో, అనే సంకోచ ముండేది నాకు మీరు రానంతవరకు. మీ అనుభవం విన్న తరువాత ఇది మనిషి చేస్తున్న పనికాదనిపిస్తుంది."

"మనిషే ఎందుకు చేసి వుండకూడదు?"

"మనిషే అయితే భయపెట్టడానికి అలా 'ప్రియా.... ప్రియా' అని అరుస్తూ, తను పదిలంగా దాక్కోవడానికి ఒక ప్రదేశాన్ని ఎన్నుకొని వుండవచ్చు. ఇన్నిరోజులుగా ఎవరి కంటాపడకుండా మీకంటే పడడానికి, తన ఆకారం మీరు విపులంగా వర్ణించడానికి ఎందుకు అవకాశం యిచ్చాడు.

మీరు ఈ వూరికి కొత్తవారు. మీకు కనిపించడంవలన అతనికి లాభం? లాభం సంగతటుంచి యిన్నిరోజులుగా గుప్తంగా వుంచుకున్న తన వునికి యితరులకు తెలిసి పోతుంది. అలా తెలుపాలనుకున్న మనిషి కొత్తవారైనా మిమ్మల్నే ఎందుకు ఎన్నుకున్నాడు? మీవెనుక వస్తున్న మనిషి అంతముందుకు ఎలా రాగలిగాడు మీకు కనిపించ కుండా? రాత్రి తోటలో అంత తొందరగా ఎలా వెళ్ళి పోగలిగాడు" అన్నాడు కరుణాకర్.

"కొంచెం శిక్షణవుంటే రాత్రి అతని ప్రవర్తన అసాధ్యమేంకాదు. నేను ఈ వూరికి కొత్తదాన్నని మీరే అంటున్నారు. ఇన్నిరోజులుగా ఎవరికీ కనబడని అతని ఆకారం నాద్వారా బట్టబయలవుతుంది. అలా కావాలని దయ్యం కోరుకుంటుందా? ఇన్నిరోజులుగా నాకోసమే ఎదురుచూస్తుందంటే నేను నమ్మను.... పైపెచ్చు దయ్యం సిగరెట్టు కాల్చుతుందా?" అంటూ నవ్వింది నీలవేణి.

"మనిషి శ్వాసద్వారా కాల్చే సిగరెట్టును దయ్యము కాల్చలేదు. కానీ కాల్చినట్టు భ్రమింపజేయగల శక్తి దాని

కుండవచ్చు కదా....ఏది ఏమయినా ఆ వ్యక్తిని, లేదా ఆ దయ్యాన్ని చూసే అవకాశం యిన్ని రోజులకు మీవలన నాకు కలుగుతుంది....అది మీరన్నట్టు దయ్యం కాకపోతే మిమ్మల్ని అల్లరిచేసినందుకు, ఇన్నిరోజులుగా రాత్రు లందు ప్రజలను భయపెట్టి నందులకు తప్పకుండా తగిన చర్య తీసుకుంటాము" అన్నాడు కరుణాకర్.

"నా ద్వారా ఎలా సాధ్యం?"

"నా వూహ నిజమయితే రాత్రి జరిగిన సంఘటనే ఈ రాత్రికి మీకు ఎదురవ్వచ్చు."

"కానీండి చూద్దాం....ఈ రాత్రి అతనికి తప్పకుండా బుద్ధి చెపుతాను" అంది నీలవేణి.

7

ముందురోజులా వెన్నెల కాయడం లేదు.

మేఘాలు ఆకాశాన్ని కప్పి పెట్టాయి.

వర్షము కురవడానికి సిద్ధంగా వున్నట్టుంది వాతా వరణము.

నీలవేణి పనిమనిషి పాపులమ్మను తోడు తెచ్చుకుని పడుకునివుంది.

ఒంటిగంట దాటిన కాసేపటికి నల్ల కళ్ళజోడు యువ కుడు నీలవేణి గది కిటికీ దగ్గరకు వచ్చాడు.

అతని చేతిలో కాలుతున్న సిగరెట్టు.

నిద్రిస్తున్న నీలవేణి, పాపులమ్మ కనిపించారు.

వెనుదిరిగి తోటను దాటుకుని, గాలిలా సుతారంగా పిట్టగోడను దాటేశాడు.

గోడకు కాస్త ఆవలిగా పెరిగివున్న వుమ్మెత్త చెట్ల చాటున కూర్చుని వున్నాడు ఇన్స్పెక్టర్ కరుణాకర్.

కరుణాకర్ నల్లని దుస్తులు ధరించాడు. జేబులో పిస్టల్,



చేతిలో పెన్ టార్చి, మరోజేబులో మడిచి పెట్టుకోడానికి వీలయ్యే గొడుగు వున్నాయి.

లేచి కళ్ళజోడు యువకుడ్ని అనుసరించసాగాడు కరుణాకర్.

అతను గుప్పు గుప్పున వదుల్తున్నాడు సిగరెట్టుపొగను.

వెనుక చడీ చప్పుడు కాకుండా పిల్లిలా అడుగులు వేస్తూ కన్నుమూస్తే కనుమరుగవుతాడేమో అన్నంత దీక్షగా అతన్నే చూస్తూ నడుస్తున్నాడు కరుణాకర్.

కొంతదూరము తరువాత మలుపులో చింతచెట్టు క్రింద నిల్చున్నాడు అతను.

అతను నిల్చోవడం గమనించి కరుణాకర్ కూడా ఒక చెట్టుచాటున నిలబడిపోయాడు.

అతను వదుల్తున్న సిగరెట్టు పొగ కరుణాకర్ దగ్గరకు

వస్తుంది.

కరుణాకర్ ముక్కుతో పొగను పీల్చి చూశాడు.

ఆశ్చర్యం....పొగరూపం వుందిగాని వాసన, ఘాటు వేయలేదు. కేవలము గాలి పీల్చినట్టుంది.

అతను తిరిగి బయల్దేరాడు.

వెంబడించాడు కరుణాకర్.

రావిచెట్టు, పాడుబడ్డ బావి దాటుకుని అటుతరువాత మావిడితోట మధ్యగా నడుస్తూ స్మశానం చేరుకున్నాడు అతను.

సన్నగా తుంపర పడసాగింది.

అతను కాల్చుతున్న సిగరెట్టును ఒక ఘోరి పక్కకు విసిరాడు.

ఆతను సిగరెట్టు పారవేసిన స్థలాన్ని జాగ్రత్తగా గుర్తుపెట్టుకున్నాడు కరుణాకర్.

స్మశానం మధ్యన నడుస్తున్నారు.

పెద్దగా పెరిగిన కానగచెట్టు, దానికింద అందమయిన సమాధి. అక్కడ నిలబడ్డాడు ఆ యువకుడు. వెనుదిరగకుండానే "ఇక ఆగండి ఇన్‌స్పెక్టర్. ఇప్పటికే చాలా శ్రమపడ్డారు. ఇక యింటికి వెళ్ళి విశ్రాంతి తీసుకొండి. ఇటువంటి రాత్రులప్పుడు ఒంటరిగా యిటువంటి ప్రదేశాల్లో వుండరాదు" అన్నాడు.

"నువ్వెవరు?" అన్నాడు కరుణాకర్.

"నేనెవరయినా మీకు వుపయోగములేదు" అని వెనుదిరిగాడతను. కళ్ళజోడు చేతిలోకి తీసుకుని కణాకర్‌ను నవ్వుతూ చూశాడు.

ఎంతోమంది ఖూనీకోర్‌లను, మరెంతమందో త్రాగుబోతులను, జూదరులను చూశాడు కరుణాకర్. ఎవరిలోను

అంత ఎర్రని కళ్లు చూడలేదు అతను.

"మీవెనుక వున్నది ఎవరు" అన్నాడు ఆ యువకుడు.

వెనుదిరిగి చూశాడు కరుణాకర్.

ఎవరూ లేరు.

ముందుకు తిరిగాడు. కళ్ళజోడు యువకుడు అక్కడ లేడు.

ఎంతో గుండెనిబ్బరం గల కరుణాకర్‌కు కూడా ఆ సమయంలో భయం కలిగింది. అయినా ఆ సమాధి దగ్గరకు వెళ్ళి టార్చికాంతితో పరిశీలించాడు.

ఏమిలేదు.

వెనుదిరిగి సిగరెట్టు వెలిగించి గుండెలనిండా పొగ పీల్చుకుని వదలి ముందుకు కదిలాడు.

ఆ యువకుడు సిగరెట్టు పారవేసిన ప్రాంతంలో టార్చి కాంతిని వేసి చూశాడు. సిగరెట్టుకు బదులు ఒక బొగ్గు ముక్క కనిపించింది.

తొందర తొందరగా నడచి తన యిల్లు చేరుకున్నాడు కరుణాకర్.

పెట్టెలోంచి కాన్వాస్‌గుడ్డ, కుంచె, రంగెలపెట్టె బయటకుతీసి తను చూసిన ఆ యువకుడి ఆకారాన్ని చిత్రించసాగాడు.

8

ఒక నడివయసు వ్యక్తిని తోడుతీసుకుని నీలవేణి ఇంటికి వచ్చాడు కరుణాకర్.

కరుణాకర్ వెంబడి వచ్చినవ్యక్తి నీలవేణిని చూసి ఆశ్చర్యపోయాడు.

నీలవేణి ఇద్దరినీ కూచోమని, తనూ కూర్చుంది.

"నీలవేణీ ఈయన ఈ వూరివ్యక్తే. పేరు గోవిందయ్య.

వృత్తి జైలరు....ఈమె పరంధామ్‌గారి నర్స్‌గా పని చేస్తుంది. మీకు తెల్సింది చెప్పదల్చుకున్నది ఒకేసారి చెప్పండి. ఈవిడతోపాటు నేనూ వింటాను" అన్నాడు కరుణాకర్.

"ఈ వూరి ఈశ్వరచంద్రయ్యగారి కుమారుడు రంగనాధ్ మూడుసం॥రాల క్రితం వూరిబయట బావిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

లలితా ప్రియదర్శిని అనే అమ్మాయిని గాఢంగా ప్రేమించాడు రంగనాథ్. మొదటిలో ఆమెకూడా అతనంటే మోజు చూపేది.

ఆ రోజుల్లో ఒక వివాహము జరిగింది ఈ వూరిలో.

చెన్నకేశ్వరుని గుడిలో జరిగిన ఆ పెళ్ళికి పులిరాజు అనే శూద్రుల అబ్బాయి వచ్చాడు. ఎలా జరిగిందో నాకు సరిగా తెలియదు. లలితాప్రియదర్శిని రంగనాధ్‌ను కాదని పులిరాజుతో లేచిపోయింది.

సున్నిత హృదయుడు రంగనాధ్ యీ దెబ్బను తట్టుకోలేకపోయాడు. ఆమెలేంది బ్రతకలేనంటూ రోడ్లవెంబడి తిరిగాడు. ఒకరోజు బావిలోదూకి చనిపోయాడు.ఆ బావిలో అంతకుమునుపే కొందరు దూకి చనిపోయివుండడంతో 'ప్రియా' అనే పిలుపు రంగనాధ్‌దని ఎవరికీ అనుమానం రాలేదు....

మీరు నూటికినూరుపాళ్ళు ఆమెలానే వున్నారు. మొదట మిమ్మల్ని చూడగానే 'లలితాప్రియదర్శిని' అనే అనుకున్నాను" అని ముగించాడు గోవిందయ్య.

రాత్రి తనకు జరిగిన అనుభవము, తను గీసిన రంగనాధ్ చిత్రము గోవిందయ్యకు చూపించడము చెప్పాడు కరుణాకర్.